




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50

విజయవాడ సిటీ*

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 293

శుక్రవారం | 7-2-2020 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 6.32 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పునర్వసు రా. 12.01 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ. 12.41 -2.12; దుర్ము హూర్తం: ఉ. 9.06-9.51, మ. 12.52-1.38; అమృతఘడియలు: రా. 9.45-11.15; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.10

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore







# ఉరే సరి!

## తల్లీకూతుళ్ల హంతకుడికి శిక్ష ఖరారు

### డబ్బు, బంగారం కోసం ఘాతుకం

**2013లో కలకలం రేపిన ఘటన**

**ఏడేళ్ల తర్వాత నెల్లూరు కోర్టు సంచలన తీర్పు**

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 7: నెల్లూరులో కలకలం సృష్టించిన తల్లీకూతుళ్ల హత్యకేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు షేక్ ఇంతియాజ్‌ను దోషిగా తేలుస్తూ ఉరిశిక్ష ఖరారు చేసింది. ఈ మేరకు నెల్లూరు 8వ అదనపు( మహిళా కోర్టు) జిల్లా సెషన్స్ జడ్జి డొక్కా సత్యనారాయణ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలు... నెల్లూరు బాలాజీనగర్ ఏడో క్రాస్ రోడ్డులో నివసించే షేక్ ఇంతియాజ్ బిల్డింగ్ ఎలివేషన్ డిజైనర్‌గా పని చేసేవాడు. నర్తకి సెంటర్‌లోని వెన్నెల ఐస్‌క్రీమ్ మిద్దెపై 3డీ ఆర్కిటెక్చర్ పేరుతో ఆఫీసు నడిపేవాడు. ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం గ్రామంలోని వాగ్దేవి బిఫార్మసీ ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ ఆసోది దినకర్

మిగతా 2వ పేజీలో...



ఇంతియాజ్

## సైకో కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డికి ఉరి

- హాజీపూర్ వరుస హత్యాచార కేసులో తీర్పు
- 90 రోజుల్లోనే తేల్చేసిన పోక్సో కోర్టు
- 2 కేసుల్లో మరణశిక్ష.. ఓ కేసులో జీవితఖైదు
- శ్రీనివాస్‌రెడ్డిలో కనిపించని పశ్చాత్తాపం
- అప్పీలు, న్యాయ సహాయానికి జడ్జి హామీ

2



శ్రీనివాస్‌రెడ్డి



# హైదరాబాద్‌లో కరోనా?

- ఇద్దరు చైనీయులకు పాజిటివ్ గుర్తింపు
- నిర్ధారణ కోసం పుణెకు రక్త నమూనాలు
- ఐసొలేషన్ వార్డులో ఉంచి చికిత్సలు

**బెజవాడలోనూ కరోనా కలకలం?**

**అదేమీ లేదంటున్న వైద్యాధికారులు**

అడ్డగుట్ట, గోల్నాక/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఇద్దరికి కరోనా వైరస్ పాజిటివ్ అని తేలింది. ఇద్దరూ 33 ఏళ్లలోపు చైనా యువకులే. వీరు నగరంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. విధి నిర్వహణలో భాగంగా ఇటీవలే వీరిద్దరూ చైనా వెళ్లి వచ్చారు. కొద్ది రోజులుగా అస్వస్థతగా ఉంటున్నారు. చైనీయులు కావడంతో పరీక్షలు చేయించుకోవాలని చుట్టుపక్కల వారు సూచించారు. దాంతో, వారు ఆస్పత్రికి వెళ్లారు. కరోనా వైరస్ అనుమానంతో

మిగతా 12వ పేజీలో...

## కరోనాకు 24 వేల మంది బలి?

12

- చైనాలో అతిపెద్ద ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ వెల్లడి
- మర్నాడే అధికారిక గణాంకాలతో సర్దుబాటు



# అయ్యో.. ఐటీ

**ఇప్పుడు కాండ్యుయెంట్ వంతు!**

- మిలీనియం టవర్‌లో కంపెనీకి లక్ష చదరపు అడుగుల్లో ఆఫీసు
- విస్తరణ దశలో రాజధాని ప్రకటన
- ఈటవర్‌లోనే సీఎం కార్యాలయం, సచివాలయం ఏర్పాటు యత్నం
- ఇటీవల పెరిగిన ఐఏఎస్‌ల రద్దీ
- ఇలా వస్తుంటే ఏం చేయాలంటూ కంపెనీ నిర్వాహకుల ఆందోళన
- ఐటీ పార్క్‌లో పరిపాలన ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్న పలువురు
- ఐటీ రాయితీపై ప్రకటనలేగానీ నయాపైసా ఇవ్వని ప్రభుత్వం

## విశాఖలో పరిశ్రమకు గడ్డుకాలం

## ఏపీ ఇన్నోవేషన్ సెంటర్ మూత

నోటితో నవ్వుతూ, నొసటితో వెక్కిరించడమంటే ఏమిటో రాష్ట్ర ప్రభుత్వం చేతల్లో చూపిస్తోంది. విశాఖను ఐటీ హబ్‌గా మారుస్తామని, డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతామని, ఉపాధి అవకాశాలు పెంచుతామని మంత్రి గౌతంరెడ్డి విశాఖకు వచ్చినప్పుడల్లా చెబుతున్నారు. కానీ కొత్త కంపెనీలు తేవడం లేదు సరికదా..ఉన్నవి ఇక్కడి నుంచి వెళ్లిపోయే పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థిక రాజధానిలో మూతపడుతున్న కార్యాలయాలు విమర్శలకు బలం చేకూర్చుతున్నాయి.

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్త ఐటీ కంపెనీలు విశాఖపట్నం వస్తే...వాటికి ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో వెంటనే కార్యకలాపాలు ప్రారంభించుకునేలా గత ప్రభుత్వం రుషికొండ ఐటీ పార్కులో ఏపీ ఇన్నోవేషన్ వేలీ (స్టార్టప్ విలేజ్) మిలీనియం టవర్ల నిర్మాణం చేపట్టింది. అందులో ఐటీ కంపెనీలు నడుస్తున్నాయి. ఎప్పుడైతే విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా మార్చాలని అధికార పార్టీ నేతలు భావించారో అప్పటి నుంచి ఈ భవనాల్లో ఐటీ కంపెనీలను ఒక్కొక్కటిగా బయటకు పంపడం ప్రారంభించారు. గత ఆర్నెల్లుగా ఈ కార్యక్రమం ఒక పద్ధతి ప్రకారం సాగుతోంది. రాష్ట్రంలో ఐటీకి విశాఖే ప్రధాన కేంద్రం కావడంతో గత ప్రభుత్వం రేసపువానిపాలెంలోని టెక్ హబ్‌లో ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ (ఏపీటా) కార్యాలయం ఏర్పాటుచేసి సీఈవోను నియమించింది. ఐటీ ప్రమోషన్ బాధ్యతలను

మిగతా 11వ పేజీలో...

## మిలీనియం టవర్స్ ఖాళీ చేయిస్తున్నారా?

ఆ పత్రాల్నీ జత చేయండి.. పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం 11

## 'కియ' కలకలం!

- తరలిపోతోందని రాయిటర్స్ కథనం
- తమిళనాడుతో చర్చిస్తోందని వెల్లడి
- రాజకీయ వర్గాల్లో సంచలనం
- రాష్ట్రం నుంచి పార్లమెంటుదాకా పెద్దఎత్తున విపక్షాల విమర్శలు
- ఖండించిన ప్రభుత్వం, కియ

10

## హోల్‌సేల్‌గా తరిమేస్తున్నారు!

- నానాతిప్పలు పడి తెస్తే ఇలా చేస్తారా?
- ఇప్పుడు కాళ్లు పట్టుకుని ఆపినా వాస్తవాలు మరుగునపడతాయా?

కియ, ఐటీ తరలింపు వార్తలపై చంద్రబాబు ఆవేదన



10

తాళ్లాయపాలెం వద్ద కృష్ణానదిలో జలదీక్ష చేస్తున్న మహిళలు, రైతులు



## కృష్ణమ్మా.. కాపాడమ్మా

- సారె సమర్పించి మహిళా రైతుల జలదీక్ష
- చెప్పులు కుడుతూ విద్యార్థి జేఏసీ నిరసన
- కొనసాగుతున్న 151 గంటల నిరాహార దీక్ష

11

## సచివాలయం, అసెంబ్లీ వేర్వేరు చోట్లా?

**అలాంటి రాజధాని ఏదీ లేదు**

హోదా కాదు.. రాయితీలు అడగండి: ఉండవల్లి

## జగన్‌పై తీవ్ర అవినీతి కేసులు

'హిందూ' రామ్‌కు తెలుసనుకుంటా

ఐవైఆర్ వ్యాఖ్య

8

## రైతుకు ధర రాకపోతే మనమే కొందాం

- ప్రభుత్వానికి నష్టమొచ్చినా ఫర్వాలేదు.. మార్చినాటికి పరిస్థితిలో మార్పురావాలి
- లేదంటే అధికారులనే బాధ్యుల్ని చేస్తాం.. ఉద్యాన, మత్స్య, పాడి రంగాలకు ఊపు
- అగ్రి మిషన్ సమీక్షలో సీఎం ఆదేశాలు .. రైతుభరోసా కేంద్రాల లోగో ఆవిష్కరణ

11

**ఏపీకి 21 వేల కోట్ల రుణం!.. సీఎంతో భేటీలో ఏఐఐబీ సంసిద్ధత**

**ఏడాదికి కనీసం 10వేల కోట్లు ఇవ్వండి.. నాబార్డును కోరిన జగన్**





## తెలంగాణ ఏర్పాటుపై నాడు చర్చే లేదు

- పార్లమెంట్‌ను బంద్ చేసి చర్చకు కత్తెరేశారే..!
- 370 నిర్వీర్యం చేస్తే రచ్చా?
- నాడు నిరసనల్ని మన్మోహన్ తప్పుపట్టలేదా?
- సీఏఏపై కాంగ్రెస్ వైఖరేంటి?
- ఢిల్లీ ఓటర్లే టార్గెట్‌గా పార్లమెంట్లో మోదీ ప్రసంగం

8


ఉబ్బిన నరాలు (వెరికోస్ వెయిన్స్) నుండి విముక్తి కోసం... టోల్ ఫ్రీ : 1800 313 1818



- కాళ్ళలో నరాలు వాచి ఉండడం
- కాళ్ళలో నొప్పి, మంట మరియు బరువెక్కినట్లు అనిపించడం
- కండరాలు బిగిసుకుపోవడం ఎక్కువసేపు నిలబడిన కూర్చున్న నొప్పి ఎక్కువ అవడం
- కాళ్ళలో నరాలు మెలి తిరిగి, బయటికి తేలినట్లు ఉండడం

ఉచిత కన్సల్టేషన్ కొరకు : 92461 99911

మా ప్రత్యేక చికిత్సలు

ఆర్థరైటిస్ | ఆస్తమా & ఎలర్జీ | థైరాయిడ్ | ఇన్‌ఫెర్టిలిటీ | ఇంపొటెన్సీ | ఆటిజం | కిడ్నీ స్టోన్స్ చిన్న పిల్లల వ్యాధులు | గ్యాస్ట్రిక్ | అల్సర్ | హెపటైటిస్-బి | హెచ్. ఐ. వి. | అనీమియా..... మొదలైనవి

పాజిటివ్ హోమియోపతి

సమస్య ఏదైనా సులువైన సురక్షితమైన చికిత్స

www.positivehomeopathy.com

A Unit of Positive Homeopathy

Dr.Kiran's Homeo LIFE

www.homeolife.in

ఆంధ్రప్రదేశ్ : నెల్లూరు • విజయవాడ • రాజమండ్రి • వైజాగ్ • తిరుపతి • కర్నూలు • గుంటూరు • కాకినాడ | కర్ణాటక



కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే

KAPIL GROUP

40 Years of Trusted Services

Visit Us: www.kapilchits.com

కపిల్ చిట్స్

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

sricharanamedia.com



BUY ONLINE AT: malabargoldanddiamonds.com

## మలబార్ వాగ్దానం

మలబార్ గోల్డ్ & డైమండ్స్

గత ఇరవై ఏళ్ళుగా మలబార్ గోల్డ్ & డైమండ్స్ సంస్థ కేవలం బి.ఐ.ఎస్ హాల్‌మార్క్ చేయబడిన ఆభరణాలను మాత్రమే తమ ఖాతాదారులకు అందిస్తుంది. మా నాణ్యతకు మా లక్షలాది ఖాతాదారులు పట్టం కట్టడమే అందుకు సాక్ష్యం.

వెడ్డింగ్ అడ్వాన్స్ ప్లాన్ : మీరు కొనుగోలు చేయాలి అనుకున్న బంగారం విలువలో 10% నుండి ముందుగా చెల్లించి బుక్ చేసుకోండి, తద్వారా భవిష్యత్తులో పెరిగే బంగారం ధరల నుండి మిమ్మల్ని రక్షించుకోవచ్చు.

**సంపూర్ణ పారదర్శకత :** పూర్తి వివరాలతో కూడిన బిల్లు మరియు ధరల పట్టిక మీకు పారదర్శకతతో కూడిన భరోసా అందిస్తుంది. ఆభరణం యొక్క మొత్తం బరువు, రాళ్ల బరువు మరియు ఖరీదు, మజూరీ మొదలగు వివరాలతో కూడిన పారదర్శక ధరల పట్టిక ప్రతి ఆభరణానికి జతచేయబడి ఉంటుంది.

**హామీతో కూడిన జీవితకాల నిర్వహణ :** 10 దేశాల్లో ఉన్న మా 260 షోరూముల్లో మీరు కొనే ప్రతీ నగకు జీవితకాలం హామీతో కూడిన నిర్వహణ సౌకర్యం.

**బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు :** 22 క్యారెట్ల బంగారాన్ని మా వద్ద మార్పిడి చేసుకున్నప్పుడు ఎటువంటి తగ్గింపు లేకుండా 100 శాతం విలువ లెక్కించబడుతుంది.

**బి.ఐ.ఎస్ 916 హాల్‌మార్క్ బంగారం :** 2001వ సంవత్సరం నుండి మా వద్ద ఆభరణాలు స్వచ్ఛతతో, సంపూర్ణ హామీతో బి.ఐ.ఎస్ 916 హాల్‌మార్క్ ధృవీకరణతో లభిస్తున్నాయి.

**పరీక్షించబడిన & ధృవీకరించబడిన వజ్రాలు :** మా వద్ద ప్రతి వజ్రం 28 రకాల అంతర్గత తనిఖీల్లో నెగ్గటమే కాకుండా ఐ.జి.ఐ, జి.ఐ.ఎ ధృవీకరణతో లభిస్తాయి.

**తిరిగికొనుగోలు హామీ :** అన్ని రకాల బంగారు మరియు వజ్రాభరణాలకు తిరిగి కొనుగోలు హామీ లభిస్తుంది.

**ఆభరణాలకు బీమా సదుపాయం :** మా వద్ద కొనుగోలు చేసిన ప్రతి నగకు దొంగతనం, దోపిడి, అగ్ని ప్రమాదం వంటి చర్యల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ఏడాది పాటు బీమా.

**క్యారెట్ విశ్లేషణ సదుపాయం :** మావద్ద కొనుగోలు చేసిన లేదా అమ్మిన, బంగారం యొక్క స్వచ్ఛతను నిర్ణయించడానికి క్యారెట్ విశ్లేషణ సదుపాయం కలదు. మీ కళ్ళ ముందే బంగారం యొక్క ఖచ్చితమైన క్యారెట్ విలువ నిర్ణయించబడుతుంది.

— మా వాగ్దానం అంటే — వాగ్దానమే



*Conditions apply

హైదరాబాద్ [ సోమాజిగూడ. | కె.పి.హెచ్.బి కాలనీ | దిల్‌సుఖ్‌నగర్ | ఎ.ఎస్.రావు నగర్ | మెహిదిపట్నం | చందానగర్ హిమాయత్ నగర్ | కొండాపూర్ | హబ్సిగూడ] వరంగల్ | కరీంనగర్ | విశాఖపట్నం | తిరుపతి | కర్నూలు | విజయవాడ కాకినాడ | రాజమండ్రి | గుంటూరు | భీమవరం | కడప | నెల్లూరు | అనంతపురం

Call: 040 68138916

ఇండియా | యు.ఎస్.ఎ | సింగపూర్ | మలేషియా | యు.ఎ.ఇ | కతార్ | కె.ఎస్.ఎ | ఒమన్ | కువైట్ | బెహ్రైన్ 260కి పైగా షోరూమ్‌లు 10 దేశాలలో


epaper.andhrajyothy.com



పరంజ్యోతి

# యోగక్షేమం వహామ్యహం



*మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః స్సఙ్గ వర్జితః*
*నిర్వైర స్సర్వభూతేషు యస్సమాయేతి పాణ్డవః"*

"ఎవరు నా కోసం శ్రోత్రాది కర్మల్ని చేస్తూ ఉంటాడో, ఎవరు నన్నే లక్ష్యంగా పెట్టుకుంటాడో, ఎవడు అన్ని విధాలా ఉత్సాహంతో నన్నే భజిస్తాడో, సంగ దోష రహితుడై ఉంటాడో, ఎవడు సమస్త జీవుల యందు ఆత్మభావం కలిగి ఉంటాడో అట్టి నా భక్తుడు నన్ను పొందుతాడు. అట్టి వానికి ముక్తి లభిస్తుంది" అని గీతాచార్యుడు చెప్పాడు. జీవుడు సుఖంలో పరమాత్మను మరచి పోతాడు. దుఃఖంలో స్మరణ చేస్తాడు. లౌకిక, పారలౌకిక సుఖాలన్నీ పరమాత్మ అనుగ్రహం చేతనే జీవునికి లభిస్తాయి. అందుకే సుఖమైనా, దుఃఖమైనా పరమాత్మ ప్రసాదమని గ్రహించి ఆచరించాలి. మానవుడు అంత్యకాలం సమీపిస్తున్నా ఇహ లోక సుఖాల మీద ఆశ వీడడు. మనిషి జీవితం యావత్తూ ప్రలోభాలమయం. కామాది అరిషడ్వర్గం సదా మేలుకొని, ఎప్పుడు మింగేద్దామా అని కాచుకుని ఉంటుంది. అలాంటి కామక్రోధాది వికారాలతో ఎడతెగని పోరు సలిపి, అలిసిపోయినవారు పరితప్త హృదయంతో భగవంతుని శరణువేడితే చాలు ఆదుకుంటాడు. 'తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహం'.. అంటూ ఈ విషయాన్ని పరమాత్మే స్వయంగా తెలిపాడు. 'సమస్తంలోనూ, నన్ను ఉపాసించే వారి యోగక్షేమాన్ని నేను వహిస్తాను' అని దీని అర్థం. 'భర్తయందు పతివ్రతకు ఉండే ప్రేమ, బిడ్డ ఎడల తల్లికి ఉండే ప్రేమ, లౌకికునికి లౌకిక వస్తువులపై ఉండే ప్రేమ.. ఈ మూడు ప్రేమల సమన్వయ ఆకర్షణ శక్తితో భగవంతుని ప్రేమిస్తే ఆయన అనుగ్రహం తప్పక కలుగుతుంది అంటారు. శ్రీ రామకృష్ణ పరమహంస.

శ్రీ కృష్ణుని స్నేహితుడైన కుచేలుడు ఆ స్వామిని భౌతిక సంపద కోరక ముచ్చటగా మూడు వరాలు కోరుతాడు. మొదటిది.. భగవంతుని పాదకమల సేవ, రెండవది భగవంతుడి భక్తులతో స్నేహము, మూడోది నిరంతరం అపారమైన భూతదయ. కమలము నీటిలో బురదలో ఉన్నా దానికి నీరు, బురద అంటదు. అదే విధంగా భగవంతుని పాదకమల సేవ చేసే వాడు సంసారంలో ఉన్నా వారికి ఆ వాసనలు అంటవు. రెండోది.. భగవంతుడి భక్తులతో స్నేహం. పాండవులు భగవంతుడైన కృష్ణునితో, భగవద్భక్తులతో స్నేహం చేసి తరించారు. గజదొంగ అయిన అంగుళీమాలుడు.. బుద్ధభగవానుడి దయతో భిక్షుకుడయ్యాడు. ఇక మూడోది భూతదయ. దయను భక్త లక్షణంగా, దైవీ సంపదగా చెబుతారు. తనను శరణుజొచ్చిన పావురము కోసం దయార్ద్ర హృదయుడైన శిబి చక్రవర్తి.. తన శరీరంలోని మాంసఖండాలనే డేగకు ఆహారంగా త్యాగం చేశాడు. దయామయుడైన బుద్ధుడు నడవలేక, కుంటుతున్న మేకపిల్లను తన భుజంపై ఎక్కించుకుని మోసుకుని బింబిసారుని యజ్ఞశాలకు వెళ్లాడు. నోరులేని జీవుల్ని బలి ఇవ్వడం పాపమని తెలియజేసి, ఆ యజ్ఞాన్ని విరమింపజేశాడు. ఈ మూడిటి కలయిక అయిన సత్వగుణమే మనను బంధాల నుండి తప్పిస్తుంది. అందుకే సుదాముడు శ్రీకృష్ణుని ఈ కోరికలు కోరి తరించాడు.

**- మేఘశ్యామ (ఈమని), 8332931376**




# ఉరే సరి!

(మొదటిపేజీ తరువాయి)

రెడ్డి నగరంలోని హరనాథపురం రెండోవీధిలో ఇల్లు కట్టుకున్నాడు. ఆయనతో పాటు భార్య శకుంతల, కుమార్తె భార్గవి ఉంటారు. భార్గవి నారాయణ వైద్య కళాశాలలో మూడో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతోంది. కొత్తఇంటికి, ఇనిస్టిట్యూట్‌కు ఎలివేషన్ చేయాలని ఇంతియాజ్‌తో దినకర్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో వారి కుటుంబంతో ఇంతియాజ్‌కు బాగా పరిచయం ఏర్పడింది. నిందితుడికి కొత్తగా వివాహం కావడంతో కుటుంబ ఖర్చులకు డబ్బు అవసరం పెరిగింది. దీంతో ఓ మైనర్ బాలుడి సహకారంతో 2012 నుంచి చైన్ స్నాచింగ్‌లు అలవాటు చేసుకున్నాడు. రెండు హత్యలకు కూడా పాల్పడ్డాడు. అయినా అవసరాలు తీరడం లేదని, ఏదైనా పెద్దచోరీ చేసి స్థిరపడిపోవాలని పథకం వేశాడు. ఇందుకు దినకర్‌రెడ్డి ఇంటిని ఎంచుకున్నాడు. చోరీకి తన సహచరుడితో పాటు మరో మైనర్ బాలుడితో ఇంతియాజ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముగ్గురూ కలిసి 2013 ఫిబ్రవరి 12న దినకర్ రెడ్డి ఇంటికి వెళ్లారు. వారిని గమనించిన భార్గవి ఫోన్ మాట్లాడుతూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లడంతో తలుపులు మూసివేసి శకుంతలమ్మపై దాడిచేశారు. ఇంతియాజ్ కత్తితో గొంతు కోయడంతో ఆమె కుప్పకూలిపోయింది. అదే సమయంలో దినకర్‌రెడ్డితో పాటు ఆయన ఇనిస్టిట్యూట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నవులూరి ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. ప్రవీణ్‌కుమార్ వెనుకవైపు నుంచి ఇంట్లోకి ప్రవేశించే సమయానికి ఇంతియాజ్ భార్గవి గొంతు నులుముతుండగా మిగిలిన ఇద్దరు ఆమె కాళ్లు, చేతులు పట్టుకున్నారు. అది చూసి పెద్దగా కేకలు వేసిన ప్రవీణ్‌కుమార్‌పై పెప్పర్ స్ప్రే చల్లారు. కత్తితో పొడిచి తలపై రాడ్డుతో కొట్టారు. ఆ తర్వాత పారిపోయేందుకు తలుపులు తీయగా బయట ఉన్న దినకర్‌రెడ్డి పట్టుకునేందుకు ప్రయత్నించాడు. ఆయనపై కూడా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఇంతలో అక్కడ గుమికూడిన జనం వారిని పట్టుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న శకుంతలను, భార్గవిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ హత్యలపై నెల్లూరు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు దినకర్ రెడ్డి ఇంట్లో దోచుకున్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మైనర్లపై జువనైల్ జస్టిస్ బోర్డు కోర్టులో విచారణ జరపగా నేరం రుజువైంది. దీంతో సదరు కోర్టు వారికి శిక్ష విధించింది. ఇంతియాజ్‌పై కేసును 8వ అదనపు జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. నేరం రుజువు కావడంతో సెక్షన్ 302 కింద ఉరిశిక్ష, సెక్షన్ 307, 449ల కింద చనిపోయే వరకు శిక్ష, సెక్షన్ 397 కింద ఏడేళ్ల కారాగారం విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. నిందితుడికి ఉరిశిక్ష పడటంపై బాధితుల బంధువులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఉరిశిక్ష విధించడం జిల్లాలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# సైకో కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డికి ఉరి

- **హాజీపూర్ వరుస హత్యాచార కేసులో తీర్పు**
- **90 రోజుల్లోనే తేల్చేసిన పోక్సో కోర్టు**

నల్లగొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యార్థినులను పాశవికంగా హత్యాచారం చేసి ఏళ్ల తరబడి తప్పించుకు తిరిగిన సైకో కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డికి పోక్సో న్యాయస్థానం మరణశిక్ష విధించింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి.. విద్యార్థినులను నమ్మించి తన వాహనంపై ఎక్కించుకొని, అత్యాచారం, హత్యచేసి పాడుబడిన బావిలో పాతిపెట్టాడు. నేరాలు రుజువు కావడంతో శ్రీనివాస్‌రెడ్డికి చనిపోయే వరకు ఉరిశిక్ష విధించాలని పోక్సో కోర్టు జడ్జి గురువారం తీర్పు చెప్పారు. కోర్టు 54 పనిదినాల్లో (మొత్తంగా 90 రోజుల్లో)నే కేసు విచారణను పూర్తిచేసి తీర్పు వెలువరించడం విశేషం. హాజీపూర్‌లో 2019 ఏప్రిల్‌లో వెలుగులోకి వచ్చిన ముగ్గురు విద్యార్థినులపై అత్యాచారం, హత్య, కిడ్నాప్ కేసులకు సంబంధించి నల్లగొండ మొదటి అదనపు జిల్లా జడ్జి(పోక్సో) కోర్టు 101 మంది సాక్షులను విచారించింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. మర్రి శ్రీనివాస్‌రెడ్డి హంతకుడని నిర్ధారించింది. రెండు కేసుల్లో చనిపోయేంత వరకు ఉరిశిక్ష, మరో కేసులో జీవిత ఖైదును విధిస్తూ జడ్జి సిద్ధ వేదవిద్యానాథారెడ్డి తీర్పు వెలువరించారు. డిగ్రీ విద్యార్థిని (17)ని హత్య చేసినందుకు జీవిత ఖైదు, అత్యాచారం చేసినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా; అపహరించినందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. పదో తరగతి విద్యార్థిని (15)ని హత్య చేసినందుకు చనిపోయేంత వరకు ఉరిశిక్ష, రూ.1000 జరిమానా; అపహరించినందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా; అత్యాచారానికి పాల్పడినందుకు 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500జరిమానా; ఆధారాలు మాయం చేసినందుకు ఏడేళ్ల కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. ఇక ఆరో తరగతి విద్యార్థిని(11)ని హత్య చేసినందుకు చనిపోయేవరకు ఉరిశిక్ష, రూ.1000 జరిమానా; అపహరించినందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా; అత్యాచారానికి పాల్పడినందుకు 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా; సాక్ష్యాధారాలను మాయం చేసినందుకు ఏడేళ్ల శిక్ష, రూ.500 జరిమానా విధిస్తున్నట్లు న్యాయమూర్తి సిద్ధ వేదవిద్యానాథారెడ్డి తెలిపారు. జరిమానా మొత్తాన్ని బాధిత కుటుంబాలకు అందజేయాలని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కూడా ఆర్థిక సహాయం చేయాలని తీర్పులో వెల్లడించారు. తీర్పు వెలువరించే ముందు జడ్జి.. 'పోలీసులు నీపై నేరాలను నిరూపించారు. నీవేమైనా చెప్పుకునేది ఉందా?' అని ప్రశ్నించగా.. 'నాకేం తెలియదు. పోలీసులు భయపెట్టి నేరాలను ఒప్పించారు. గ్రామస్థులు మా భూమిని లాక్కున్నారు. మాఇంటిని ధ్వంసం చేశారు' అని శ్రీనివాస్‌రెడ్డి చెప్పాడు. 'నీ తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారు' అని జడ్జి ప్రశ్నించగా తనకు తెలియదని చెప్పాడు. వారు బతికే ఉన్నారా? అని అడిగితే.. 'నాకు తెలియదు' అని సమాధానం ఇచ్చాడు.



శ్రీనివాస్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్న పోలీసులు

### కనిపించని పశ్చాత్తాపం..

సైకో, సీరియల్ కిల్లర్‌గా ముద్ర పడిన శ్రీనివాస్‌రెడ్డిలో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించలేదు. నేరాలు రుజువయ్యాయని జడ్జి ప్రకటించగా.. తనకేమీ తెలియదని నసగడమే తప్ప స్పందించలేదు. తుదితీర్పులో భాగంగా 2 కేసుల్లో చనిపోయేంత వరకు ఉరిశిక్ష, ఒక కేసులో జీవిత ఖైదు అని జడ్జి వెల్లడించినప్పుడు కూడా చలించలేదు. చివరి వరకు జడ్జి ఎదుట రెండు చేతులు జోడించి నిలబడడమే తప్ప ఎక్కడా బాధపడినట్లు కనిపించలేదు.

### క్షణక్షణం ఉత్కంఠ

సైకో కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డి కేసులో తుది తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గురువారం ఉదయం హాజీపూర్ గ్రామస్థులు, బాధితుల కుటుంబ సభ్యులు, మహిళా సంఘాలు, న్యాయవాదులతో కోర్టు హాలు కిక్కిరిసింది. 10:30 గంటలకు బెంచిపైకి వచ్చిన జడ్జి.. సివిల్ కేసులను తీసుకోవడంతో ఉత్కంఠ పెరిగింది. 11:30వరకు ఆ కేసులను విచారించి, తర్వాత చాంబర్‌లోకి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు జడ్జి తిరిగి బెంచిపైకి వచ్చారు. సరిగ్గా 2:15 గంటలకు జడ్జి తిరిగి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. మళ్లీ ఎప్పుడు బెంచి పైకి వస్తారోనని ఆసక్తిగా ఎదురుచూస్తుండగానే... సాయంత్రం 6 గంటలైపోయింది. దీంతో తుది తీర్పు వస్తుందా? రాదా? అన్న సంశయం మొదలైంది. 6:15 గంటలకు వచ్చిన జడ్జి ఒక్కో కేసులో నేరం, దానికి సంబంధించిన శిక్షను వివరిస్తూ తీర్పు వెలువరించారు. మొదటి కేసులో జీవితఖైదు అని చెప్పేసరికి అంతా నిరుత్సాహపడ్డారు. రెండో కేసులో మరణశిక్ష ప్రకటించడంతో న్యాయవాదులు బల్లలు చరిచారు. మూడో కేసులోనూ ఉరిశిక్షను ప్రకటించారు. తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని జడ్జి వివరించారు. న్యాయ సహాయం సైతం ఉచితంగా అందజేస్తామన్నారు. తీర్పు ప్రకటించిన అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.



## షాహీన్‌బాగ్ వద్ద ఆత్మాహుతి దళాలు

దేశానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కుట్ర జరుగుతోంది. పౌరసత్వ సవరణ బిల్లు(సీఏఏ) వ్యతిరేక ప్రదర్శనలకు కేంద్రమైన షాహీన్‌బాగ్‌లో ఆత్మాహుతి దళాలు సిద్ధమవుతున్నాయి. ఢిల్లీ-నోయిడాను కలిపే కీలకమైన ఆ లింక్ రోడ్డుపై డిసెంబరు 15 నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి. రెండు సార్లు మాత్రమే అక్కడ కాల్పులు జరిగాయి. కానీ ఎవరూ గాయపడలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం వివిధ పార్టీలు షాహీన్‌బాగ్ ఘటనలను రాజకీయం చేస్తున్నాయి.

*- గిరిరాజ్‌సింగ్, కేంద్ర మంత్రి*



## ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు కాదు

ఇంటర్నెట్ ప్రాథమి హక్కు కాదు. ఆ సేవలు కల్పించడం ముఖ్యమే. కానీ దేశ భద్రత కూడా కీలకమే. హింస కోసం ఉగ్రవాదులు ఇంటర్నెట్‌ను దుర్వినియోగం చేస్తే ఖండించొద్దా? ఇంటర్నెట్‌ను వినియోగించుకోవచ్చు. కానీ హింసను ప్రేరేపించి.. దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలను విచ్ఛిన్నం చేస్తామంటే ఎలా?

*- రవిశంకర్‌ప్రసాద్, కేంద్ర మంత్రి*

## ఆచార్య గోపికి భారతీయ భాషా అవార్డు



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వర్సిటీ మాజీ ఉపకులపతి, ప్రసిద్ధ కవి ఆచార్య ఎన్.గోపికి ప్రతిష్ఠాత్మక భారతీయ భాషా పరిషత్ పురస్కారం లభించింది. కోల్‌కతాకు చెందిన ఈ సంస్థ ఆయనకు జీవన సాఫల్య పురస్కారాన్ని (కతృత్వ సమగ్ర సమ్మాన్) ప్రకటించింది. వచ్చేనెల 21న కోల్‌కతాలో జరిగే కార్యక్రమంలో లక్ష రూపాయల నగదు పురస్కారం, సన్మానపత్రాన్ని గోపికి ప్రదానం చేయనున్నట్లు పరిషత్ అధ్యక్షులు కుసుం ఖేమానీ ఒక ప్రకటనలో గురువారం వెల్లడించారు.

## కేపీ ఉల్లి ఎగుమతికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, అమరావతి ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీలోని కృష్ణాపురం ఉల్లి ఎగుమతులపై నిషేధాజ్ఞలను కేంద్రం ఎత్తివేసింది. ఈమేరకు గురువారం కేంద్ర వాణిజ్యశాఖ పరిధిలోని విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్(డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ జారీ చేసింది.

## పీటీడీ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణాశాఖలో పని చేస్తున్న 52వేల మంది ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్, ఏపీజేఏసీ నేతలు పే రివిజన్ కమిషనర్‌ను కోరారు. గురువారం సచివాలయంలో పీఆర్సీ కమిషనర్ అశుతోష్ మిశ్రాను జేఏసీ చైర్మన్ పీఎన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## ఏపీఎన్‌టీఎస్ఈ ఫలితాల్లో శ్రీచైతన్య క్లీన్ స్వీప్!

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌టీఎస్ఈ 2019-20 పరీక్షల్లో రాష్ట్రం నుంచి 294 మంది విద్యార్థులు ఎంపికవ్వగా అందులో ఏకంగా 227 (72శాతం) మంది ఒక్క శ్రీచైతన్య నుంచే ఎంపికైనట్లు ఆ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. రాష్ట్రంలో మరే ఇతర విద్యా సంస్థ నుంచి ఇంత ఎక్కువమంది ఎంపిక కాలేదని, ఏ విద్యా సంస్థ కూడా తమ ఫలితాల దరిదాపులకు రాలేదన్నారు. తొమ్మిదేళ్లుగా శ్రీచైతన్య.. టెక్నో కరిక్యులమ్‌తో ఎన్‌టీఎస్ఈలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలో ఏపీ నుంచి టాప్ పది మార్కులను 36మంది పొందగా, వారిలో 26 మంది (72శాతం) శ్రీచైతన్య విద్యార్థులేనని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు చెప్పారు. అన్ని కేటగిరిల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకులను తమ విద్యార్థులే దక్కించుకున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రిసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీ-ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సీ-బ్యాచ్, మెడికాన్, సివిల్ వంటి పటిష్ఠమైన అకడమిక్ ప్రోగ్రాంలతో ఇంతటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని స్పష్టం చేశారు.

## 'స్థానిక' రిజర్వేషన్లపై ముగిసిన వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 59.85శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై వాదనలు ముగిశాయి. గురువారం జరిగిన విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల సుదీర్ఘ వాదనలు విన్న చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం.. తీర్పును రిజర్వు చేసింది.

## టీటీడీ ఈవోపై కోర్టు ధిక్కార కేసు

- **17లోగా కారణాలు తెలపాలని తెలంగాణ హైకోర్టు ఆదేశం**

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌పై తెలంగాణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు దాఖలైంది. హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు చేయనందున ఈవోపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపండంటూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈనెల 17వ తేదీలోపు కోర్టు ఎదుట స్వయంగా హాజరై కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ కారణాలు చెప్పాలని ఆదేశించింది. టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తుండడంపై కొందరు ఉద్యోగులు గతంలో ఉమ్మడి హైకోర్టులో సవాల్ చేశారు. ఆ కేసులో హైకోర్టు బెంచి ఆదేశాలను ఈవో అమలు చేయకపోవడంతో పిటిషనర్లు ఈవోపై తెలంగాణ హైకోర్టులో ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు.



పిఠాపురంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న స్వామీజీలు, సాధుపరిషత్ ప్రతినిధులు

## హిందువులపై జగన్ చిన్నచూపు

- **మోకాళ్లపై నిలబడి సాధువుల నిరసన**

పిఠాపురం, ఫిబ్రవరి 6: హిందువుల ఓట్లతో ఏర్పడిన జగన్ ప్రభుత్వం.. తమనే చిన్నచూపు చూస్తోందని పలువురు సాధువులు, స్వామిజీలు విమర్శించారు. హిందువుల పట్ల ఇదే రీతిలో వ్యవహరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరిగిన విగ్రహాల ధ్వంసం సంఘటన వెనుక ఉన్న ముఠాను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సాధువులు, స్వామిజీలు గురువారం పాదగయ క్షేత్రం ఎదురుగా ఆందోళనకు దిగారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయాధికారులకు వినతిపత్రం అందజేశారు.



## ముస్లింలు దేశ విభజననే వ్యతిరేకించాల్సింది

దేశ విభజన సమయంలో భారత్‌లోనే ఉండిపోవడం ముస్లింలు భారత్‌కు మేలు చేసినట్లేమీ కాదు. నిజానికి వాళ్లు దేశ విభజననే వ్యతిరేకించాల్సింది. అప్పుడు పాకిస్థాన్ దేశమే ఏర్పడకపోయేది. ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలకు ఆమ్ ఆద్మీ పార్టీ స్పాన్సర్ చేస్తోంది.

*- యోగి ఆదిత్యనాథ్, యూపీ సీఎం*

# పసిపిల్లల పాలు లాగేశారు

- **గర్భిణులు, బాలింతలకు జగనన్న అమృత 'హ్యాండ్'**
- **36 లక్షల లీటర్లకు 6 లక్షల లీటర్లే**
- **3 నెలల నుంచి ఇదే పరిస్థితి**
- **బిల్లుల చెల్లింపులో జాప్యం..**
- **ధర పెంచాలనీ సరఫరాదారుల డిమాండ్**

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పసిపిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తామంటూ ప్రభుత్వం అట్టహాసంగా నామకరణం చేసిన 'జగనన్న అమృతహస్తం' పథకం... వారికి హ్యాండ్ ఇచ్చింది. అంగన్‌వాడీలకు పాలు సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రాష్ట్రవ్యాప్తంగా 3 నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో 50వేలకుపైగా ఉన్న అంగన్‌వాడీలకు నెలకు 36 లక్షల లీటర్ల పాలసరఫరా అవసరం కాగా... మూడు నెలలుగా నెలకు కేవలం 6 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ 6 లక్షల లీటర్లు కేవలం 20శాతం అంగన్‌వాడీలకే సరిపోతున్నాయి. అంటే 3 నెలల నుంచి 80 శాతం అంగన్‌వాడీల్లోని తల్లీపిల్లలు పాలు అందక అవస్థలు పడుతున్నారు.

### అమలు కాని పెంపు

అంగన్‌వాడీలకు చిత్తూరు జిల్లా మదనపల్లెలోని విజయడెయిరీ ప్లాంట్ నుంచి పాలు సరఫరా చేస్తున్నారు. కేఎంఎఫ్ (కర్ణాటక మిల్క్ ఫెడరేషన్) నుంచి మదనపల్లె విజయడెయిరీ పాలు సేకరిస్తోంది. ఈ మేరకు ఏపీడీడీసీఎఫ్ఎల్‌కు, కేఎంఎఫ్‌కు మధ్య 2016లో కుదిరిన పాల సరఫరా ఒప్పందం 2019 అక్టోబరు 31తో ముగిసింది. ఆ తర్వాత పాల ధరలు పెంచితేనే ఒప్పందం పొడిగిస్తామని ఏపీడీడీసీఎఫ్ఎల్‌కు కేఎంఎఫ్ ప్రతినిధులు చెప్పారు. సరఫరాదారుల కోరిక మేరకు పాలధరలు పెంచే ఉద్దేశంతో మహిళా, శిశు సంక్షేమశాఖ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ... కేఎంఎఫ్ ప్రతినిధులతో జనవరి 13వ తేదీన సమావేశం నిర్వహించాయి. పాల ధరలు పెంచడం ద్వారా, అంగన్‌వాడీలకు పాల సరఫరా పునరుద్ధరించాలని నిర్ణయించారు. కానీ, ఇంతవరకూ అది అమలుకు నోచుకోలేదు. దీనిపై చర్చించిన అధికారులు... లీటర్ ఫ్లెక్సీ ప్యాకింగ్ పాల ధర రూ.47.5కి, టెట్రా ప్యాక్ ధర రూ.53కి పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఫ్లెక్సీ ప్యాకింగ్ లీటర్ పాల ధర రూ.42గా, టెట్రా ప్యాక్ ధర రూ.50గా ఉంది. ప్రతి నెలా చెల్లింపులు సక్రమంగా జరిపితేనే సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని కూడా ఈ చర్చల్లో సరఫరాదారులు చెప్పారు. దీంతో ఇందుకోసం ఏపీడీడీసీఎఫ్ఎల్ పీడీ అకౌంట్‌లో రూ.80కోట్లతో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయాలనీ అధికారులు అనుకున్నారు. కానీ ఇవేవీ కార్యరూపం దాల్చకపోవడంతో అంగన్‌వాడీల్లోని చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం లభించడం లేదు.

### కేంద్ర నిధులు వస్తున్నాయా?

కేంద్ర ప్రభుత్వ పథకమైన ఐసీడీఎస్ కింద రాష్ట్రాల్లో అంగన్‌వాడీల నిర్వహణ జరుగుతోంది. 70:30 నిష్పత్తిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు ఖర్చు చేస్తున్నాయి. అయితే, రాష్ట్రం నుంచి సకాలంలో యూసీలు పంపకపోవడం వల్ల ఐసీడీఎస్ నిధులు సక్రమంగా రావడం లేదని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక కష్టాల కారణంగా వేలకోట్ల బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. దీంతో యూసీలు కేంద్రానికి సమర్పించలేకపోతున్నట్లు తెలుస్తోంది.

### బిల్లులు చెల్లించక..

పాల బిల్లు నెలకు రూ.15 నుంచి 16 కోట్ల వరకూ ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీటి చెల్లింపులు జరపకపోవడంతో అక్టోబరు 17వ తేదీ నాటికి రూ.77 కోట్ల బిల్లులు పేరుకుపోయాయి. దీంతో పాల సరఫరాదారులు బిల్లులు చెల్లిస్తేనే పాలు సరఫరా చేస్తామని చెప్పడంతో ఆర్థికశాఖ అప్పుడు రూ.40 కోట్ల చెల్లింపులు చేసింది. అయినప్పటికీ నవంబరులో పాల సరఫరా నిలిచిపోయింది. 36 లక్షల లీటర్లకుగాను ఆ నెలలో 6 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా చేశారు. ఆ తర్వాత డిసెంబరు, జనవరిలోనూ సరఫరా స్వల్పంగా పెరిగి 25 శాతానికి చేరుకుంది. దీనికి బిల్లుల చెల్లింపులో జాప్యం ఒక కారణం కాగా, పాల ధరలు పెంచాలంటూ సరఫరాదారులు కోరడం రెండో కారణం.

# డీఎస్సీపై డైలమా

- **ప్రహసనంగా 2018 నోటిఫికేషన్ నియామకాలు**
- **7902 ఖాళీల్లో ఇప్పటికి 2690 పోస్టులే భర్తీ**
- **కోర్టు కేసులు పెండింగ్ అంటూ కాలయాపన**
- **కొత్త నోటిఫికేషన్‌పై మౌనం... 'టెట్'పైనా సందిగ్ధం**

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలపై అనిశ్చితి నెలకొంది. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయింది. పాత డీఎస్సీ నియామకాలు ఎప్పటికి పూర్తి చేస్తారో.. కొత్త నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో చెప్పటం లేదు. గత ప్రభుత్వం 2018 అక్టోబరు 26న డీఎస్సీ-2018 నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్, వెల్ఫేర్, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న దాదాపు 7,902 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈ ప్రకటన ఇచ్చింది. విద్యార్హతలతో పాటు రకరకాల కారణాలతో అభ్యర్థులు కోర్టుకెక్కారు. గత ప్రభుత్వ హయాంలోనే చాలా కేసులు ఓ కొలిక్కి వచ్చాయి. చిన్న, చిన్న కేసులు కొన్ని పరిష్కారం కాలేదు. ఈ లోగా సాధారణ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారటం వంటి పరిణామాలు జరిగాయి. ప్రభుత్వం ఏదైనా టీచర్ పోస్టులను భర్తీచేయాలి. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. పరీక్షల నుంచి ఫలితాల విడుదల వరకు తరచూ షెడ్యూల్స్ మారుస్తూ, సవరిస్తూ నిరుద్యోగుల ఉత్సాహంపై పాఠశాల విద్యాశాఖ నీళ్లు చల్లుతోంది. కోర్టు కేసుల కారణంగానే నియామకాలు ఆలస్యం అవుతున్నాయని పాఠశాల విద్యాధికారులు చెబుతున్నారు. కానీ దాదాపు 6 వేలకు పైగా టీచర్ పోస్టులకు సంబంధించి కోర్టు కేసులేవీ లేకపోయినా నియామకాలు చేయడం లేదని సంబంధిత అభ్యర్థులు చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం... డీఎస్సీ-2018 నోటిఫికేషన్ ద్వారా 7,902 పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ కేవలం 2,690 పోస్టులనే భర్తీచేశారు. కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుని, మిగిలిన ఖాళీలను కూడా భర్తీచేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా వ్యవహరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా పాఠశాల విద్య పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, మోడల్, గురుకులాలతో పాటు మున్సిపల్ పాఠశాలల్లో దాదాపు 21వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా పోస్టులను డీఎస్సీ-2020 ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయితే కొత్త నోటిఫికేషన్‌పై ప్రభుత్వం మౌనం వహిస్తోంది. పాత నోటిఫికేషన్ తాలూకు పోస్టుల భర్తీ ఇంకా పూర్తి కాకుండా కొత్త నోటిఫికేషన్ ఎలా? అనే సందిగ్ధత ప్రభుత్వవర్గాల్లో వ్యక్తమవుతోంది. కొత్త నోటిఫికేషన్ కంటే ముందుగా 'టెట్' నోటిఫికేషన్ ఇవ్వాలి. దీనిపైనా స్పష్టత ఇవ్వడం లేదు.



## వ్యాయామం వ్యసనమైతే ప్రమాదం!

బెర్లిన్, ఫిబ్రవరి 6: శరీరం ఫిట్‌గా ఉండాలంటే వ్యాయామం అవసరమే. కానీ.. అది వ్యసనంగా మారకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదేపనిగా అధిక వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి హానికరమని జర్మనీలోని కార్ల్స్‌రుహే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు తాజా అధ్యయనంలో వెల్లడించారు. ముఖ్యంగా అధికంగా తినే రుగ్మతతో బాధపడుతున్న వారికి ఇది చాలా ప్రమాదమని వారు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో తినే రుగ్మతులతో బాధపడే వారు నిస్పృహ, మానసిక స్థితి, ప్రతికూల ఆలోచనలను నియంత్రించడానికి వ్యాయామం చేసేందుకు మొగ్గు చూపుతారని గుర్తించారు. అయితే ఇది వ్యసనంగా మారితే అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వారు వెల్లడించారు.

## శిశువుల్లో నిద్రలేమి సాధారణం

లండన్, ఫిబ్రవరి 6: శిశువుల్లో నిద్రలేమి సమస్య చాలా సాధారణమని, వారికి రెండు సంవత్సరాల వయసు వచ్చేసరికి పరిస్థితి మెరుగవుతుందని ఓ అధ్యయనం వెల్లడించింది. 6నెలల వయసులో పిల్లలు నిద్రపోవడానికి తీసుకొనే సమయం సగటున 20నిమిషాలకు తగ్గుతుందని పేర్కొంది. అలాగే బిడ్డకు రెండేళ్లు వచ్చిన తర్వాత వారు సగటున రాత్రి సమయంలో ఒక్కసారి మాత్రమే మేల్కొంటారని వివరించింది. ఎనిమిది నెలల శిశువులున్న తల్లిదండ్రుల్లో దాదాపు 40శాతం మంది తమ పిల్లల నిద్ర గురించి ఆందోళన చెందుతున్నారని తెలిపింది. అయితే పసిపిల్లలు ఒకరోజులో నిద్రపోయే వ్యవధిలో వ్యక్తిగత వ్యత్యాసాలుండే అవకాశం ఉందని ఫిన్లాండ్‌కు చెందిన ఫిన్నిష్ ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ అండ్ వెల్ఫేర్‌కు చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. శిశువుల నిద్రా విధానాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా మొట్టమొదటిసారిగా సుమారు 5,700మందిపై నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలు 'స్లీప్ మెడిసిన్' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి.

# విష ప్రచారం!

ఢిల్లీలో ఉధృతంగా సాగిన ఎన్నికల ప్రచారం ముగిసింది. ఓటర్లు రేపు తమ తదుపరి ముఖ్యమంత్రిని నిర్ణయించుకోబోతున్నారు. ఏ పార్టీకి ఓటేయ్యాలో ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చివుంటారు కానీ, ప్రచారం ముగిసినందుకు మాత్రం ఎంతో సంతోషించివుంటారు. బీజేపీ వర్సెస్ కేజ్రీవాల్ యుద్ధంలో ఓటర్లు వినరానిమాటలు, చూడకూడని దృశ్యాలు అనేకం అనుభవించారు. షాహీన్‌బాగ్ చుట్టూ సాగిన రాజకీయం వారిని ప్రశాంతంగా నిద్రపోనివ్వలేదు. మిగతా రాష్ట్రాలతో పోల్చితే డెబ్బయ్ అసెంబ్లీస్థానాలున్న ఢిల్లీలో ముఖ్యమంత్రికి ఉన్న అధికారాలు కూడా తక్కువే. కానీ, ఇక్కడి జయాపజయాలు యావత్ దేశానికి ఇచ్చే సంకేతాలు ముఖ్యమైనవి. పట్టణ ఓటర్ల నాడిని పట్టివ్వడంతో పాటు, పౌరసత్వచట్టం, ఎన్ఆర్‌సి ఇత్యాది అంశాల విషయంలో విస్తృత ప్రజానీకం అభిప్రాయానికి ఇది అద్దం పడుతుంది.

మరోమారు అధికారంలోకి రావాలనుకుంటున్న కేజ్రీవాల్‌ను నిలువరించడానికి బీజేపీ అహరహం శ్రమిస్తున్నది. తన దగ్గరున్న స్థానికాస్త్రాలు తక్కువ కనుక, కేజ్రీవాల్‌ను ఉగ్రవాది అనడం నుంచి జాతీయత, జాతీయాంశాల చుట్టూ రాజకీయాన్ని నడుపుతున్నది. హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో దెబ్బతిన్న తరువాత, ఢిల్లీలో కనీస గౌరవాన్ని నిలబెట్టుకొనే స్థాయిలో స్థానాలు సంపాదించడం బీజేపీకి ముఖ్యం. మోదీని ముందుపెట్టి ఎన్నికలకు పోతున్నారు కనుక, ఇది మరీ ముఖ్యం. అమిత్ షా కొనసాగించిన పోరాటాన్ని మోదీ రెండు సభల్లో పాల్గొనడం ద్వారా ఆఖరులో అందుకొని ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారు. ఎన్నికలకు రెండురోజుల ముందు రామాలయ నిర్మాణం కూడా తిరిగి తెరమీదకు వచ్చింది. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో సాగుతున్న నిరసనలకు ఢిల్లీ ఎన్నికలతో సంబంధం లేకున్నా, బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని దీనిచుట్టూ తిప్పింది.

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన ‘దేశద్రోహుల’తో సహా, ఆమ్ ఆద్మీ నాయకులంతా దీనివెనుక ఉన్నారని చూపించేందుకు విశ్వ ప్రయత్నాలు జరిగాయి. కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో తలమునకలై ఉండాల్సిన ఆర్థికశాఖ సహాయ మంత్రి ఎన్నికల ప్రచార సభలో ‘గోలీమారో సాలోంకో’ అంటూ నినదించారు. షాహీన్‌బాగ్ నిరసనల వెనకున్న లక్షలాదిమంది మగాళ్ళంతా మీ ఇళ్ళల్లోకి చొరబడి మీ భార్యలను, చెల్లెళ్ళను చెరిచేస్తారని హిందువులను హెచ్చరించారు. ‘ఆజాదీ కావాలా, ఇదిగో’ అంటూ ఓ బీజేపీ అభిమాని నిరసనకారులపై కాల్పులు జరిపిన ఘటన ఈ స్ఫూర్తిదాయక ప్రసంగ ప్రభావమే. చట్టబద్ధంగా నడుచుకుంటూ, ప్రజలందరినీ కాపాడాల్సిన వారు ఈ తీరున విద్వేషాలు రగిల్చితే ఎన్నికల సంఘం శిక్షగా సదరు మంత్రిగారిని కొద్ది గంటల పాటు ప్రచారానికి దూరంపెట్టిన ఘట్టాన్నీ ప్రజలు గమనించారు. మరొకాయన ఈ ఎన్నికలను ఇండియా– పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌తో ఎందుకు పోల్చారో తెలిసిందే.

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని ఢిల్లీ పొరుగు రాష్ట్రాలకు కూడా విస్తరించాలని ప్రయత్నించి ఎదురుదెబ్బ తిన్నందువల్ల కాబోలు కేజ్రీవాల్‌లో చాలా మార్పు వచ్చింది. గతంలో మోదీని తీవ్రంగా విమర్శిస్తూ, నిండు సభల్లో అవమానించిన కేజ్రీ ఇప్పుడు ఆయన ఊసెత్తడం లేదు. జాతీయాంశాలు వదిలేసి, స్థానికాభివృద్ధికి పరిమితమైనారు. జెఎన్‌యూ గొడవ పట్టనట్టుగా, పౌరసత్వచట్టం మీద అంటీముట్టనట్టుగా కేజ్రీ ప్రవర్తించడం అనేకులకు ఆశ్చర్యం కలిగించింది. వీధిపోరాటాలకు పెట్టింది పేరైన కేజ్రీ కార్యాలయానికే పరిమితమై పనిమంతుడిగా రుజువుచేసుకోదల్చారు. నేను మీకన్నా మంచి హిందువును, గొప్ప జాతీయవాదిని అంటూనే, బీజేపీ ఉచ్చులో చిక్కుకోకుండా జాగ్రత్తపడ్డారు. విద్య, వైద్యరంగాల్లో కేజ్రీ తెచ్చిన మార్పు విస్పష్టం. బస్తీ వైద్యశాలలు, రూపు మారిన ప్రభుత్వ స్కూళ్ళు, నిరంతరాయ విద్యుత్, ఉచిత మంచినీరు, మహిళలకు ఉచిత రవాణా ఇత్యాది అంశాలతో ఆయన ఎన్నికలకు పోతున్నారు. ఐదేళ్ళక్రితం మూడుస్థానాలు వినా మిగతావన్నీ గెలుచుకున్న కేజ్రీ ఇప్పుడు ఆ స్థాయి విజయం సాధించలేకపోవచ్చు కానీ, అధికారం ఆయనదేనని అనేక సర్వేలు తేల్చేశాయి. అధికారం అందుకున్నా ఈ ప్రచార ఉధృతి కారణంగా బీజేపీకి గతంలో కంటే ఎక్కువస్థానాలు రావడమూ ఖాయం.

నార్లమాట

## ఓజియాన్ అశ్వశాలలు

ఓజియాన్ గ్రీకు పురాణాలలో ఒక రాజు. ఈలియాన్ అనే రాజ్యాన్ని పాలిస్తుండేవాడు. ముప్పది సంవత్సరాల పాటు ఆయన అశ్వశాలను శుభ్రం చేసినవారులేరట. వాటినుంచి బయల్దేరిన దుర్గంధం స్వర్గలోకంలోని వారి నాసికాపుటాలనే బ్రద్దలు గొట్టిందట. ఆ శాలలను శుభ్రం చేయడానికి పూనుకొన్న గ్రీక్ పౌరాణిక నాయకుడు, మహాబలుడు హెర్క్యులస్ రెండు జీవనదులను వాటిలోకి మళ్ళించవలసి వచ్చిందట. ఓజియాన్ అశ్వశాలల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయి ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు. ముప్పది సంవత్సరాల నుంచి కాక, మూడు శతాబ్దాలకు పైగా వీటిని శుభ్రం చేసిన నాథుడు లేడనే చెప్పవచ్చు. రాజధాని నగరాన్ని మరొకటి, రెండిటిని విడిచిపుచ్చితే, వీటి నుంచి వెలువడే దుర్గంధం ఇంద్రలోకాన్ని దాటి, బ్రహ్మ లోకాన్ని దాటి కైలాసాన్ని దాటి, వైకుంఠం వరకు వెళ్ళి, క్షీరసాగరంలో పన్నగశాయినే బాధపెడుతున్నదని అనుకోవచ్చు. ఈ ఓజియాన్ గుర్రపు శాలలు శుభ్రపరచడానికి ఆంధ్రప్రదేశ్‌లో నదుల కొరత లేదు. గోదావరి ఉన్నది, కృష్ణ ఉన్నది, తుంగభద్ర ఉన్నది, పెన్నా నది ఉన్నది,వంశధార ఉన్నది. కాగా, కావలసింది హెర్క్యులస్ మాత్రమే!

ఈ ఓజియాన్ గుర్రపు శాలలు శుభ్ర పరచడానికి ఆంధ్రప్రదేశ్‌లో నదుల కొరత లేదు. గోదావరి ఉన్నది, కృష్ణ ఉన్నది, తుంగ భద్ర ఉన్నది, పెన్నా నది ఉన్నది, వంశ ధార ఉన్నది. కాగా, కావలసింది హెర్క్యులస్ మాత్రమే!

*1964 జూలై 23 ‘ఆంధ్రజ్యోతి’ నుంచి*

# రాజ్యాంగ స్ఫూర్తితోనే సీఏఏ




పౌరసత్వ సవరణ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందినప్పటి నుంచి కాంగ్రెస్, వామపక్షాలు,ఉదారవాదులు, కుహనాలౌకికవాదులు,అర్బన్ నక్సలైట్లు, అల్లరిచిల్లరి మూకలు దేశాన్ని అస్థిర పర్చి దేశ సమైక్యత, సమగ్రతకు విఘాతం కలిగించేందుకు హింసోన్మాదక నిరసనలు కొనసాగిస్తున్నాయి. అధికారంలో ఉన్నా, లేకున్నా దేశంలో అత్యవసర స్థితి సృష్టించే నైపుణ్యం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోసం తహతహలాడుతోన్న ఆ పార్టీ సీఏఏను ఉపయోగించుకొని తమ నైపుణ్యానికి పదును పెడుతోంది.

దీనిపై మీడియాలో ప్రసారమవుతోన్న వార్తలు, పతాక శీర్షికలు, సంపాదకీయాలు, డిబేట్లలో చాలావరకు వక్రభాష్యాలు, అవాస్తవాలే ఉన్నాయి. సీఏఏ దేశ లౌకికతత్వాన్ని దెబ్బతీసిందని, ముస్లిం అనే పదం చేర్చక ఆర్టికల్ 14ను విఘాతపర్చిందని, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుండి కాకుండా ఇతర దేశాల నుంచి వచ్చిన వలసదారులను ఎందుకు చేర్చలేదని, అస్సాం ఒప్పందానికి తూట్లు పొడిచిందని, పౌరసత్వ చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఇప్పుడు ఏముందంటూ విపక్షాలు, మీడియా అసంబద్ధమైన ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

విస్తృతమైన సంప్రదింపులు జరపకుండా, దీర్ఘాలోచన చేయకుండా బీజేపీ ఏదీ చేయదు. సీఏఏ దేశ విభజన నాటిది. నాడు జిన్నా దేశ విభజనకు దారితీసేలా రెండు తీవ్రమైన ప్రకటనలు చేశారు. మొదటిది, 1941లో కాన్పూర్‌లో మాట్లాడుతూ తాము ఆధిక్యతలో ఉన్న ప్రాంతాల్లోని ఏడు కోట్ల ముస్లింలను బంధ విముక్తులను చేసేందుకు ఎంతటి తీవ్ర పరిస్థితులనైనా ఎదుర్కొంటామని, అవసరమైతే రెండు కోట్ల ముస్లింల ప్రాణాలతో చెలగాటమాడటానికి కూడా వెనుకాడమని చెప్పారు. మరో సందర్భంలో, శాసనసభ్యుల సదస్సులో మాట్లాడుతూ గ్లాడ్‌స్టోన్ పాలనలో మైనారిటీల రక్షణ పేరుతో ఆర్మేనియాలో బ్రిటన్ జోక్యం చేసుకోగా లేనిది, ఇప్పుడు హిందుసన్‌లో మైనారిటీలు అణచివేతకు గురవుతున్నప్పుడు జోక్యం చేసుకునే హక్కు మనకెందుకు ఉండదని ప్రశ్నించారు.

దేశ విభజన హింసాత్మక రూపం దాల్చిన సమయంలో పాకిస్థాన్‌లో హిందూ మైనారిటీలు ఎప్పుడైనా భారత్‌కు వచ్చి స్థిరపడాలనుకొంటే వారికి ఆశ్రయం కల్పిస్తామని జవహర్‌లాల్ నెహ్రూ, రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్ హామీ ఇచ్చారు. ఈ మేరకు 1950 ఏప్రిల్ లో ‘నెహ్రూ – లియాఖత్’ ఒప్పందం కుదిరింది. అయితే, అంతకుముందు 1949 ప్రారంభంలో పాక్ రాజ్యాంగ సభలో జరిగిన చర్చలో తమ దేశం ఇస్లాం రాజ్యంగా ఉండాలన్న తీర్మానానికి మద్దతు తెలిపిన లియాఖత్ పాలనలో మైనార్టీలు సురక్షితంగా ఉండగలరన్న దానిపై అనుమానాలతో నెహ్రూ తక్షణ యుద్ధం నివారించడానికి ఆ ఒప్పందంపై సంతకం పెట్టారు. 1955లో మొదటిసారి భారత ప్రభుత్వం పౌరసత్వ చట్టం తీసుకొచ్చింది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950, నాటి నుంచీ 1955 మధ్య కాలంలోనూ అనేక మందికి భారత్ పౌరసత్వం కల్పించింది. అయితే, ఏ చట్టం కింద వీరికి పౌరసత్వం కల్పించారు? పౌరసత్వం కల్పించే ఈ ప్రక్రియలో వారి వలస హోదా (శరణార్థి లేదా అక్రమ వలసదారులు లేదా చొరబాటుదారులు), భారత సంతతికి చెందినవారా కాదా, నాచురలైజేషన్ రిక్వైర్‌మెంట్, ఆర్టికల్ 14 ఉల్లంఘన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా? అప్పటికి భారత్ ఐక్యరాజ్యసమితి శరణార్థుల సదస్సు, 1951పై సంతకం చేయలేదు. నాడు దేశంలో పౌరసత్వం కల్పించే చట్టాలు లేవు కానీ, దేశ బహిష్కరణ చట్టాలు ఉన్నాయి.

పౌరసత్వ చట్టం, 1955 చేసిన 30 ఏళ్ళకు 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఈ చట్టానికి మొదటి సవరణ తీసుకొచ్చింది. అస్సాంలో అక్రమంగా వలస వచ్చిన ముస్లింలకు అవకాశం కల్పించేందుకే నాటి కాంగ్రెస్ సర్కార్ ఈ సవరణ తీసుకొచ్చింది. అయితే శరణార్థులు దేశం అంతటా వ్యాపించి ఉండగా, అస్సాంకు మాత్రమే వర్తించే విధంగా ఈ సవరణ తీసుకురావడం దురదృష్టకరం, అసంబద్ధం. కానీ, పౌరసత్వం కోసం గళమెత్తుతోన్న ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ లలో మతహింసను ఎదుర్కొని భారత్‌లో ఆశ్రయం పొందుతున్న అక్కడి మైనార్టీలను పరిగణనలోకి తీసుకోలేదు. ఇదొక తప్పిదం.

కాంగ్రెస్, వామపక్షాలు, కుహనా లౌకికవాదులు, అర్బన్ నక్సల్స్ కు ఆర్టికల్ 10 గురించి తెలియదా? సీఏఏ ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తుందంటూ వస్తోన్న ఆరోపణలు అవాస్తవమని సుప్రీం కోర్టు ఇచ్చిన 20 తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. 1959 కేసుకు సంబంధించి ఒక పరిశీలనను ఈ సందర్భంగా ప్రస్తావించాలి. ‘కొన్ని ప్రత్యేక పరిస్థితులు లేదా కారణాలతో, ఒకవేళ ఏదైనా చట్టం ఇతరులకు కాకుండా కేవలం ఒక వ్యక్తికి మాత్రమే వర్తిస్తున్నప్పటికీ, అది రాజ్యాంగబద్ధం అవుతుంది. ఆ ఏకైక వ్యక్తిని ఒక ప్రత్యేక తరగతిగా పరిగణింపవచ్చు.’

పౌరసత్వ సవరణ చట్టం, 1985 ప్రజల రాత మార్చిందా? విదేశీయులు (ట్రిబ్యునల్ ఆర్డర్, 1964) చట్టం కింద ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్స్ 62,000 మంది అక్రమ వలసదారులను గుర్తించాయి. అయితే, రికార్డుల ప్రకారం వారిలో 2400 మందిని మాత్రమే తిరిగి పంపగలిగారు. అస్సాం ఒప్పందం, 1985 లోని క్లాజ్ 6 ప్రకారం ఏర్పాటు చేయాల్సిన కమిటీకి కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు మోక్షం కలగలేదు. ఏనాడూ అమలుకు నోచుకోని 1950 నాటి “నెహ్రూ–లియాఖత్” ఒప్పందానికి శాసన హోదాని సీఏఏ ద్వారా మోదీ ప్రభుత్వం కల్పించింది. ఈ చట్టం ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో వేధింపులకు గురైన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్శీ, క్రైస్తవ శరణార్థుల పౌరసత్వం కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తుందే తప్ప కొన్ని స్వార్థ శక్తులు ప్రచారం చేస్తున్నట్లుగా ఇది ఎవరి పౌరసత్వాన్నీ రద్దు చేయదు.

కాంగ్రెస్, వామపక్షాలు, కుహనా లౌకికవాదులు, అర్బన్ నక్సల్స్‌కు ఆర్టికల్ 10 గురించి తెలియదా? సీఏఏ ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తుందంటూ వస్తోన్న ఆరోపణలు అవాస్తవమని సుప్రీం కోర్టు ఇచ్చిన 20 తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. రామ్ కృష్ణ దాల్మియా వర్సెస్ జస్టిస్ ఎస్.ఆర్.టెండూల్కర్, 1959 కేసులో ‘కొన్ని ప్రత్యేక పరిస్థితులు లేదా కారణాలతో, ఒకవేళ ఏదైనా చట్టం కేవలం ఒక వ్యక్తికి మాత్రమే వర్తిస్తున్నప్పటికీ, అది రాజ్యాంగబద్ధం అవుతుంది. ఆ ఏకైక వ్యక్తిని ఒక ప్రత్యేక తరగతిగా పరిగణింపవచ్చు.’ అన్నది.

పౌరసత్వం పొందడానికి ఉన్న ఐదు మార్గాలతో పోలిస్తే సీఏఏ ద్వారా పౌరసత్వం పొందడం ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. దీనికి డిసెంబర్ 31, 2014ను ఆఖరి గడువుగా నిర్ణయించారు. నిర్దిష్ట తేదీ అనంతరం ఈ మార్గంలో పౌరసత్వం కోరేవారు ఉండరు. సీఏఏ లో పేర్కొన్న రక్షణలు అస్సాం ఒప్పందానికి విఘాతం కలిగించవని కేంద్ర హోం మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో మతపరంగా జనాభా నిష్పత్తి మారే అవకాశం లేదు. అటు లౌకికవాదాన్నీ ఉల్లంఘించదు. సీఏఏను అమలు చేయబోమంటూ కేరళ పశ్చిమబెంగాల్ వంటి బీజేపీయేతర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. అయితే, ఇవి దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు తూట్లు పొడుస్తున్న విషయాన్ని మర్చిపోతున్నాయి.

కాంగ్రెస్ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ఆర్టికల్ 370ని జోడించారు. ఆర్టికల్ 370 కారణంగా జమ్మూకశ్మీర్ పునరావాస చట్టం 1982లో వచ్చింది. దీని ప్రకారం భారతదేశ విభజన తర్వాత, 1947 నుండి 1954 వరకు పాకిస్థాన్‌కు వలస వెళ్లిన పాకిస్థానీ జాతీయులకు కశ్మీర్‌కు వచ్చి పునరావాసం పొందే అధికారం కల్పిస్తుంది. పౌరసత్వ చట్టం, 1955కు సమాంతరంగా తీసుకొచ్చిన ఈ చట్టం దేశ భద్రత, జాతీయ సమగ్రత విషయంలో రాజీ పడింది. ఎమర్జెన్సీ కాలంలో భారత రాజ్యాంగ పీఠికలో లౌకికవాదం, సామ్యవాదం అనే పదాలను జోడిస్తూ కాంగ్రెస్ ఒక సవరణ తీసుకొచ్చింది. ఇంతటి కీలకమైన రాజ్యాంగ సవరణపై ఏ మేరకు చర్చలు జరిగాయి? పసీఏఏ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా తీసుకొచ్చిన చట్టమైనా కాంగ్రెస్ దాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తుంది. రాజ్యాంగ నిర్మాతల కలలు, ఆశయాలు, ఆకాంక్షల మేరకే మోదీ ప్రభుత్వం చట్టాలు రూపకల్పన చేస్తుంటే కాంగ్రెస్ కూటమి, కుహనా లౌకికవాదులు రాజ్యాంగానికి వక్రభాష్యం చెప్తున్నారు.

ప్రజల న్యాయవాది, అమెరికా సుప్రీం కోర్టులో గౌరవనీయ అసోసియేట్ న్యాయమూర్తి లూయిస్ డి బ్రాండేయ్స్ ఒక సామాన్య పౌరుడిని అత్యంత ముఖ్యమైన రాజకీయ శక్తిగా అభివర్ణించారు. అటువంటి రాజకీయ శక్తులను గుర్తించే ప్రక్రియను కాంగ్రెస్ ఒక విపత్తుగా పేర్కొంది. దేశ భద్రత, జాతీయ సమగ్రత, పౌర రక్షణ ప్రాతిపదికగా కేంద్రం తెచ్చిన ఈ అద్భుతమైన పౌరసత్వ సవరణ చట్టం సర్వజనులకు ఆమోదనీయం.

■ చింతా సాంబమూర్తి
బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
సఫాయి కర్మచారి కమిషన్ మాజీ సభ్యులు, భారత ప్రభుత్వం

# మాంద్యాన్ని అరికట్టలేని ‘మహాపద్దు’

కొత్త ఆర్థిక సంవత్సరం(2020–21) కేంద్ర బడ్జెట్ రూ.30.42 లక్షల కోట్ల మహా పద్దు. 2019–20 సవరించిన బడ్జెట్ కంటే రూ.3.42 లక్షల కోట్లు ఎక్కువ. ప్రత్యక్ష పన్నుల ద్వారా 24.23 లక్షల కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.3.85లక్షల కోట్లు, అప్పుల ద్వారా రూ.8.49 లక్షల కోట్లు, ప్రభుత్వరంగ సంస్థల లాభాల్లో డివిడెండ్స్ ద్వారా రూ.1.55 లక్షల కోట్లు, ప్రభుత్వ రంగ సంస్థ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.2.10 లక్షల కోట్లు బడ్జెట్‌కి ఆదాయం సమకూరుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మొత్తంగా పన్ను ఆదాయంలో గతంలో కంటే ఈ బడ్జెట్‌లో అదనంగా 12శాతం వృద్ధిని చూపారు. 2019–20 బడ్జెట్‌లో ద్రవ్యలోటు 3.3 శాతానికి పరిమితమౌతుందని చూపగా అది 3.5 శాతానికి చేరింది. ఇప్పుడు ఈ బడ్జెట్‌లో ద్రవ్యలోటును 3.8 శాతంగా ఉండగలదని పేర్కొన్నారు. సవరించిన 2019–20 బడ్జెట్‌లో సుమారు 88వేల కోట్ల ఆదాయం తగ్గుతుందని తెలిపారు. వాస్తవంగా ఈ తగ్గుదల రూ.1.55 లక్షల కోట్లకు పైబడి వుంటుంది. ఆర్థిక మాంద్యం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్‌లో పన్నుల ద్వారా వస్తుందని చూపిన ఆదాయం సాధ్యమయేది కాదు. వివిధ రంగాలకి, పథకాలకి, కార్యక్రమాలకి కోత పెట్టడం అనివార్యం.

ద్రవ్యలోటు తగ్గింపునకు మూడు పద్ధతులను ప్రభుత్వం అనుసరిస్తున్నది. మొదటిది, మౌలిక వసతులు, సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాల మీద పెట్టే ఖర్చులో కోత. పెరిగిన ఆదాయానికి అనుగుణంగా వీటిపై నిధుల కేటాయింపు పెంచరు. రెండోది, ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను అమ్మడంద్వారా ఆదాయాన్ని పెంచుకోవడం. మూడోది, ప్రత్యక్ష పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకోకుండా బడా సంస్థలకు, సంపన్నులకు భారీ రాయితీలిస్తూ ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేస్తుంది. ఈ పద్ధతుల ద్వారా ద్రవ్యలోటును కుదిస్తున్నారు. దీనివల్ల ప్రజల వినియోగ వ్యయం, సమిష్టి డిమాండ్‌పై తీవ్ర దుష్ప్రభావం కలుగుతున్నది.

ప్రభుత్వరంగ సంస్థల వాటాలు ఉపసంహరణల ద్వారా రూ. 2.10 లక్షల కోట్లు రాబట్టాలని ప్రతిపాదించారు. గతంలో ప్రతిపాదించిన బిపిసిఎల్, ఎయిర్ ఇండియా, కంటైనర్ కార్పొరేషన్ వంటి వాటితో పాటు ఈ బడ్జెట్‌లో ఎల్ఐసి, ఐడిబిఐ, ప్రభుత్వ బ్యాంకులు, రైల్వే సర్వీసులు తదితర వాటిని చేర్చటం ముఖ్యమైన మార్పు. దేశంలోని 12 ప్రభుత్వ మేజర్ పోర్టులను కార్పొరేటీకరణ చేయనున్నట్లు చెప్పారు. 150 రైళ్ళను పిపిపి పేర ప్రైవేటీకరించబోతున్నారు. డేటా పార్కులను కూడా కార్పొరేట్‌శక్తుల పరం చేస్తున్నారు. ఈ చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా నష్టం కలగజేస్తాయి. 2014నుండి మోదీ ప్రభుత్వం సుమారు రూ.4లక్షల కోట్లు విలువ గల ప్రభుత్వ సంస్థల పెట్టుబడులను ఉపసంహరించింది. బడ్జెట్‌లో ప్రతిపాదించకుండానే వ్యూహాత్మక భాగస్వామ్యం పేర విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దక్షిణ కొరియా కంపెనీ పోస్కోకి ధారాదత్తం చేయటానికి పూనుకున్నారు. వాస్తవంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు కేంద్ర బడ్జెట్‌కి ఈ ఐదేళ్ళలోడివిడెండ్స్ రూపంలో రూ.5.5లక్షల కోట్లుకు పైబడి ఇచ్చాయి. ఈ బడ్జెట్‌లో కూడా రూ.1.55 లక్షల కోట్లు ఈ సంస్థల డివిడెండ్స్ ద్వారా వస్తుందని చూపించారు.




కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న మాంద్యాన్ని నిర్మూలించేందుకు దోహదపడేలా లేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వాస్తవాలను కప్పిపుచ్చి అంకెల గారడీకి పాల్పడ్డారు. మోదీ ప్రభుత్వం యథాప్రకారం ఈ బడ్జెట్‌లోనూ కార్పొరేట్ శక్తులకు పెద్ద ఎత్తున రాయితీలను కొనసాగించింది. సమష్టి డిమాండ్, ఉపాధి అవకాశాలు, ప్రజల ఆదాయాలు, వృద్ధి రేటును ఈ బడ్జెట్ మరింత ఛిద్రం చేసి ఆర్థిక మాంద్యాన్ని మాత్రమే విస్తరింపజేస్తుంది.

ప్రభుత్వరంగ జీవిత బీమా దిగ్గజమైన ఎల్ఐసి లోని ప్రభుత్వ వాటాలను షేర్లరూపంలో స్టాక్ మార్కెట్‌లో విక్రయించాలని బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీని ద్వారా సుమారు రూ.90 వేల కోట్లు ఆదాయం రాబట్టబోతున్నారు.ఈ చర్యవల్ల కుటుంబ పరంగా, సామాజిక పరంగాను ప్రజలకు, ప్రభుత్వానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర దెబ్బతగలనున్నది. రూ. 31 లక్షల కోట్లు ఆస్తులు కలిగి ఉన్న ఎల్ఐసీ ప్రైవేట్ బీమా కంపెనీల పోటీని ఎదుర్కొంటూ 74 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. 2019 మార్చికి 29 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు దేశ అభివృద్ధికి ఇచ్చింది. ప్రతి ఏడాది డివిడెండ్స్‌తో పాటు అతితక్కువ వడ్డీతో రూ. 2 లక్షల కోట్లకు పైగా నిధులు సమకూరుస్తున్నది. ఇంత ప్రాధాన్యత కలిగిన సంస్థలో పెట్టుబడులు ఉపసంహరించటం పెద్ద కుట్రే. కాని బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు ఎల్ఐసి స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టడం వల్ల స్టాక్ మార్కెట్‌లో టాప్ కంపెనీగా మారుతుందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీనిని బలహీనం చేసి విదేశీ, స్వదేశీ సంస్థలకు లాభాలు దోచిపెట్టడమే అవుతుంది. ఎందుకంటే ఎల్ఐసి 2019–20లో సుమారు రూ. 5.61 లక్షల కోట్లు ఆదాయం నమోదు చేసి, రూ. 53 వేల కోట్లు మిగులు విలువను సాధించింది. ఇంత మార్కెట్‌ను ఎట్లాగైనా కైవసం చేసుకోవాలని కార్పొరేట్ సంస్థలు వత్తిడి చేస్తున్నాయి. ఇదీ అసలు రహస్యం.

నరేంద్ర మోదీ గొప్పగా ప్రకటించిన అనేక పథకాలకు కేటాయించిన నిధులు దారుణంగా కోతకు గురయ్యాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు రైతులకు, ఆదాయ మద్దతుపేర ఏడాదికి రూ.6వేల రూపాయల పథకానికి కేటాయించిన నిధులు భారీగా కోతకు గురయ్యాయి. 2019–20లో దీనికి రూ.75వేల కోట్లు కేటాయించి సవరించిన బడ్జెట్‌లో రూ.54,370కి తగ్గించారు. ఇప్పుడు ఈ బడ్జెట్‌లో తిరిగి 75వేల కోట్లు కేటాయించారు. దేశంలోని 10కోట్ల మందికి 5లక్షల ఆరోగ్య బీమా కల్పించే ఆయుష్మాన్ భారత్‌కి 2019–20లో రూ.6556 కోట్లు కేటాయించి సవరించిన బడ్జెట్‌లో రూ.3314 కోట్లకి తగ్గించారు. 2020–21లో కూడా రూ.6429 కోట్లు మాత్రమే కేటాయించారు. రైతుల పంటల బీమా పథకమైన పిఎం ఫసల్ బీమా యోజన్‌కి రైతులకు చెల్లించాల్సిన రూ.5వేల కోట్లకి నిధుల ప్రస్తావన లేదు. స్వచ్ఛ్ భారత్ పథకానికి రూ.12,294 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. అమృత, స్మార్ట్ సిటీల పథకాలను కూడా గత ఏడాది రూ.13,750 కోట్లు కేటాయించి రూ. 9842 కోట్లకు కుదించారు. ఈ ఏడాది రూ.13,750 కోట్లు మాత్రమే కేటాయించారు. ఐసిడిఎస్, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యా మిషన్‌ల కేటాయింపులు, ఖర్చులు కూడా ఇదే దారిలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ రుణభారం గణనీయంగా తగ్గిందని ఆర్థికమంత్రి గొప్పగా చెప్పారు. 2014 మార్చి నాటికి జీడీపీ 52.2శాతం రుణభారం ఉంటే అది 2019 మార్చికి 48.7 శాతానికి తగ్గిందని అన్నారు. ఇది మోదీ ప్రభుత్వ ఘన కార్యమన్నారు. ఇది పెద్దమాయ. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ శాఖలు, సంస్థల చేత భారీగా అప్పులు చేయించి వాటిని ప్రభుత్వ రుణ లెక్కల్లో చూపడం లేదు. 2019 మార్చినాటికి ఎఫ్‌సిఐ చేత రూ 2.65 లక్షల కోట్లు అప్పుచేయించారు. ఈ ఏడాది మరో లక్షకోట్లు అప్పుచేపించినా ఆశ్చర్యపోనక్కరలేదు. జాతీయరహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)ను కూడా ఎఫ్‌సిఐ మాదిరిగా రూ.1.78 లక్షల కోట్లు అప్పుల్లోకి దించింది. అలాగే ఎరువుల సబ్సిడీ చెల్లించడానికి ప్రధాన ఎరువుల కంపెనీలకు బ్యాంకుల నుండి అప్పులు ఇప్పించారు. భారతీయ రైల్వే, ఫైనాన్సింగ్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లు కూడా కొత్త ప్రాజెక్టులకు అప్పులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ అప్పులను ఆయా కంపెనీల బ్యాలన్స్ షీట్లలో కనిపిస్తాయి తప్ప బడ్జెట్‌లో వాటి ప్రస్తావన ఉండదు. ఇలాంటి అనైతిక పద్ధతుల ద్వారా జీడీపీ లో ద్రవ్యలోటు తగ్గించి చూపించడానికి పాల్పడుతున్నది. 2017–18 లో ద్రవ్యలోటును 3.4 శాతంగా చూపినా బ్యాలన్స్ షీట్లలో చూపని అప్పులను కలుపుకుంటే ద్రవ్యలోటు 5.86 శాతంగా ఉందని కాగ్ తెలిపింది. కనుక ఈ మోదీ విధానం వల్ల అప్పులు చేసిన సంస్థలు రుణాలు చెల్లించలేక చివరికి ప్రైవేటీకరించబడతాయి.

ఆదాయపన్ను భారం తగ్గుతుందని గంపెడాశతో ఎదురు చూసిన ప్రజలకు ఆర్థికమంత్రి నిరుత్సాహాన్నే మిగిల్చారు. మూడు శ్లాబులకు బదులు ఏడు శ్లాబులతో కొత్త విధానం తీసుకొచ్చి పాత, కొత్త రెండూ కొనసాగుతాయని చెప్పారు. రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే ఉపయోగించుకోవాలని మెలికపెచి పెట్టారు. మినహాయింపులు వర్తించవని చెప్పారు. నేడు కేంద్ర బడ్జెట్‌కి 17 శాతం ఆదాయ పన్ను ద్వారా ఆదాయం వస్తున్నది. ప్రస్తుతం ఇస్తున్న మినహాయింపులన్నీ క్రమేణా రద్దు చేయాలనే కుట్రతోటే రెండో ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చారు.

■ డా. బి.గంగారావ్
ఆర్థిక విశ్లేషకులు

# దశాబ్దం నడిచి...



మనలో మనం పేరిట 2009– 2010 మధ్యకాలంలో జరిగిన ప్రయత్నాలను పక్కన బెడితే – ‘ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్రరవే)’ ఏర్పడి ఈ ఏడాదికి సాంకేతికంగా పదేళ్ళు. తరిచి చూసుకోడానికి తగినంత కాలం. దేశంలోనే తొలి నిర్మాణాత్మక రచయిత్రుల సంస్థగా కొత్త అడుగులు వేసిన కాలం. సంతృప్తినిచ్చినవి, చేయాలనుకుని చేయలేకపోయినవీ.. అనేక పనుల మిశ్రమ కాలం. ఎన్నో ఆశాభంగాలను అంతర్గత చర్చ చేసుకోవాల్సిన కాలం. మరీ ముఖ్యంగా పనిద్వారానే సమాధానమిచ్చిన బైటి విమర్శలు కొన్నిటిని గుర్తు చేసుకోదగిన కాలం. మనుషులతో సంభాషణ కోసం మేము గడిపిన సంచార జీవితాలు, దుఃఖంతో ఆక్రోశంతో సాహసంతో పోరాటాలు చేసేవారి కోసం తీసిన పరుగులు, వారి పక్షాన రాసిన ఆ కాసిన్ని రాతలు, మా మానసిక కల్లోలాలలో గుర్తుపట్టిన తోటి మానవుల అలజడులు... ఇదీ ఒక ఆచరణేనా అంటే అవును, ప్రరవే ఒక సాహిత్య సంస్థ.

ఈ దశాబ్దకాలంగా ప్రరవే పనితీరు మీద అనేక వ్యాఖ్యానాలు వస్తూనే ఉన్నాయి. ఆచరణ మాత్రమే సంస్థని మెరుగు పర్చుతుంది అన్న విశ్వాసం వల్ల ఇంత కాలం ఆ వ్యాఖ్యానాలు మా చర్చల్లోకి కూడా రానివ్వలేదు. ఇపుడు ఈ ప్రత్యేక సందర్భంగా ప్రరవే లక్ష్యాలను, పని చేసే విధానాన్ని గురించి ఒకసారి మాట్లాడటం అవసరం అనిపించింది. సంస్థల విధి విధానాల పట్ల మాకున్న కొన్ని సందేహాలను కూడా చర్చకి పెట్టాలనిపించింది. విమర్శ నిర్మాణాత్మకంగానూ బాధ్యతాయుతంగానూ ఉండాలని నమ్మే ప్రరవే – ప్రత్యేక ఘటనలకో, వ్యక్తులకో సమాధానంగా ఈ చర్చ చేయడం లేదు. వాటన్నిటి సారాంశంగా, వాటిని ఒక ధోరణిగా గుర్తించి మాట్లాడుతోంది. సంస్థల నిబద్ధత గురించి పనితీరు గురించి మాకు కలిగిన ప్రశ్నలివి. ప్రజాస్వామిక సంస్థలు, వ్యక్తుల సామాజిక సంబంధాల పనితీరులను, నిబద్ధతను విలువ కట్టే సూత్రాలు ఏంటి? వాటిని నిర్మించే శక్తులు ఏవి? ఈ ప్రశ్నలకి మేము చెప్పుకొన్న సమాధానం, ప్రజాస్వామిక చైతన్యం మా కేంద్రం. దాని దిశగా రకరకాల చైతన్యస్థాయిల్లో ఉన్న వ్యక్తుల తోటి సంభాషణ ద్వారా వారిని కేంద్రం వైపు సమీకరించుకోవాలి.

ప్రరవే ఏ రాజకీయ పార్టీకీ ఏ రాజకీయ సంస్థకీ ప్రత్యక్ష, పరోక్ష అనుబంధంలో లేని స్వతంత్ర వేదిక. సంస్థగా ఒక ప్రాతిపదికలో పని చేస్తూనే అన్ని ప్రజాస్వామిక సంస్థలతో ఉద్యమాలతో కలిసి సంఘటితం అవుతుంది. అటువంటి బలమైన స్వరంలో భాగం కావడమే మా పదేళ్ల ఆచరణ. సంస్థ సజావుగా నడవడం కోసం కొన్ని పరిధులు ఏర్పరచుకున్నాం. ప్రధాన రాజకీయపార్టీలలో పని చేసేవారు, ఎన్జీవో నిర్వాహకులు సంస్థ సాధారణ సభ్యత్వానికి మాత్రమే అర్హులని, కార్యనిర్వాహక విధులలోకి తీసుకోకూడదని ప్రణాళికలో రాసుకున్నాం. వేదిక పని విధానానికి, పైన చెప్పినవారి పని విధానానికి మధ్య చాలా తేడా ఉంటుంది. ఆ తేడా సంస్థలో సంక్షోభం సృష్టించకూడదన్న ఆలోచనతో ఆ నియమం పెట్టుకున్నాం. సభ్యులు పనిక్రమంలో తమతమ ఆచరణలని స్వీయ వివేకంతో మెరుగుపరుచుకోవాలని ప్రరవే భావిస్తుంది. అంతే తప్ప కుటుంబం, సమాజం, విధించే ఆంక్షలకి తోడు సంస్థ కూడా నైతిక ఒత్తిడులు, నియంత్రణలు విధించాలని అనుకోదు. వ్యక్తులుగా వారి ఆచరణ సంస్థ గౌరవానికో ప్రణాళికకో భంగకరంగా ఉంటే తప్ప కల్పించుకోదు.

సాహిత్య, ప్రజాసంఘాలు తమ కార్యాచరణలో ఎవరి భాగస్వామ్యాన్ని తీసుకోవచ్చు? వ్యక్తులు సంస్థల నుంచి ఎటువంటి సహకారం తీసుకోవచ్చు? సంస్థల ఆర్థిక లావాదేవీల్లో బాహాట, రహస్య విభజన ఉంటుందా? అన్నవి మరి కొన్ని ప్రశ్నలు. ప్రరవే ప్రభుత్వాలతో కలిసి పని చేయదు, కానీ తమ స్వరానికి భంగం కలగనంతవరకూ విశ్వవిద్యాలయాలు, అకాడమీలతో కలిసి పని చేస్తుంది. ప్రరవే అవార్డులు, సత్కారాలు వంటి వాటిని నిర్వహించదు. వాటిలో సంస్థగా పాల్గొనదు. వాటిని సభ్యుల వ్యక్తిగత చాయిస్‌గా చూస్తుంది. సంస్థకి మూలధనం ఉండదు. ఎప్పటికపుడు ఆయా కార్యక్రమాలకి అవసరమైనంత మేరకి ఆయా సభలు జరిగే చోట స్థానిక మిత్రులు, సంస్థల సాయాన్ని తీసుకుంటుంది, దానిని ప్రకటిస్తుంది.

ప్రరవే తన సభ్యులను ప్రధానంగా రచయితలుగా గుర్తిస్తుంది. వారి సామాజిక అవగాహన కోసం క్షేత్ర వాస్తవాలు తెలుసుకోవలసిందిగా ప్రోత్సహిస్తుంది. రచనే ప్రరవే ప్రధాన ఆచరణ. అంతరంగ కల్లోలాల నుంచీ అనేక జీవితాల నుంచి, సామాజిక పరిణామాల నుంచీ గ్రహించిన సారాన్ని రచనల ద్వారా వ్యక్తం చేస్తుంది. రోజువారీ ఘటనల మీద ప్రరవే స్పందించాలని డిమాండ్ చేయడం, దానిని చేరుకోలేనపుడు విమర్శలు ఎక్కుపెట్టడం వల్ల రచయితలనే అస్తిత్వాన్ని, రాజకీయ కార్యకర్తృత్వం మింగివేస్తుంది. ప్రతీరోజూ చర్చలోకి వచ్చిన ఘటనలని తక్షణం ఖండించుకుంటూ పోవడమే ఆచరణగా మారిపోయాక, ఆయా సమస్యల మూలాలను తాత్వికంగా అధ్యయనం చెయ్యడం అనేది దాదాపు అసంభవమవుతుంది. రచన అనేది కళారూపంగా ప్రత్యేకమైనది అన్న స్పృహే లేనపుడు గాఢమైన సంస్పందనని కలిగించే శక్తి మాత్రం ఆ రచనలో ఎలా మిగిలి ఉంటుంది? వ్యక్తులు గానీ సంస్థలు గానీ తమ ప్రణాళికని ప్రాతిపదికగా చేసుకుని ఆయా సందర్భాలను బట్టి నిర్ణయాలు తీసుకుంటారు. అందరికీ కలిపిన యూనివర్సల్ ఆచరణ అనేది ఒకటి ఉందా అన్నది తమకి భిన్నమైన ఆచరణ ఉన్నవారిని శత్రువులుగా నిర్ధారించే వారు చెప్పాల్సిన విషయం. ఆచరణకు భిన్నస్థాయిలు ఉంటాయని, లక్ష్యాన్ని చేరుకోవడానికి భిన్నమార్గాల్లో నడుస్తారని, చేసే పనికూడా దాని పరిధిలో అది ప్రభావాన్ని వేస్తుందని నమ్మకపోవడమే సమస్య. ప్రరవే ప్రగతిశీల భావజాలం కలిగిన సంస్థలతో మిత్ర సంబంధంలో ఉంటుంది. ప్రతి సంస్థలోనూ సంస్థ ప్రణాళికకీ సభ్యుల ఆచరణకు మధ్య ఎంతో కొంత ఎడం ఉండే సందర్భాలు ఉంటాయి. వాటిని ఆయా సంస్థల అంతర్గత విషయాలుగానే ప్రరవే భావిస్తుంది తప్ప వాటిమీద ఎపుడూ అనుచిత వ్యాఖ్యానం చేయలేదు. ప్రరవే మీద ప్రరవే సభ్యుల మీద వారి వ్యక్తిగత సామాజిక ఆచరణల మీద తీవ్ర వ్యాఖ్యలు చేయడం ద్వారా ఆధిపత్య స్వరంతో ప్రరవేని నిర్దేశించే ప్రయత్నాలు చేశారు కొందరు. ఏ సంస్థ అయినా తన ప్రణాళికా పరిధిలో పని చేస్తుంది, తదనుగుణంగా లేని సభ్యులను అంతర్గతంగా ప్రశ్నిస్తుంది తప్ప ఇతర సంస్థల, వ్యక్తుల నైతిక ఆధిపత్యాలకి లొంగి పని చేయదు. మిత్ర వైరుధ్యాలను ప్రధానం చేసుకుని తీవ్రంగా స్పందించడం, అవమాన పర్చడం, తీర్పులివ్వడం ద్వారా సంస్థలను నైతికంగా దెబ్బ తీసే ప్రయత్నాలు ఆచరణలో ఉన్నవారు అసలే చెయ్యవలసినవి కావు. పదేళ్ళుగా అనేకమంది స్త్రీలు అనేక ఒత్తిళ్ళని అధిగమించి నిలుపుకున్న ప్రరవే ‘వెనకాల ఉండి నడుపుతున్నది కొందరు పురుషులు’ అన్న హీనమైన స్థాయికి విమర్శలు దిగజారాయి. వ్యక్తులను, ప్రజాస్వామిక వాదులను, సంస్థలను ఎక్కడికక్కడ ఒంటరులను చేయడమే ఫాసిస్ట్ శక్తుల లక్ష్యం. వారి లక్ష్యాలకు మనం ఆయుధాలుగా ఉపయోగపడటమంత విరోధాభాస మరొకటి ఉండదు. సంస్థకయినా వ్యక్తులకయినా స్వచ్ఛందంగా పనులు చేస్తున్నపుడు, వాటిని మెరుగు పరుచుకోమని సూచనలు చేయగలమే తప్ప ఈ పని ఇలాగే చెయ్యమని నిర్దేశించడం ఆధిపత్యపు సూక్ష్మరూపం. ఇటువంటి నిర్దేశాలకి ప్రరవే మాత్రమే కాదు, స్వతంత్ర ఉనికి కలిగిన ఏ సంస్థా అంగీకరించదు. ప్రరవే తనపని విధానాన్నితనే నిర్దేశించుకుని, అవసరమైన మార్పుచేర్పులను తనే చేసుకుంటూ ముందుకు సాగుతోంది. తన సభ్యులలో, తన చుట్టూ ఉన్న సమాజంలో ప్రజాస్వామిక విలువలను పాదుకొల్పడానికి, రచనల ద్వారా ఇక ముందు కూడా కృషి చేస్తుంది.

సంస్థకయినా వ్యక్తులకయినా స్వచ్ఛందంగా పనులు చేస్తున్నపుడు, వాటిని మెరుగు పరుచుకోమని సూచనలు చేయగలమే తప్ప ఈ పని ఇలాగే చెయ్యమని నిర్దేశించడం ఆధిపత్యపు సూక్ష్మ రూపం. ఇటువంటి నిర్దేశాలకి ప్రరవే మాత్రమే కాదు, స్వతంత్ర ఉనికి కలిగిన ఏ సంస్థా అంగీకరించదు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక తన పని విధానాన్ని తనే నిర్దేశించుకుని, అవసరమైన మార్పుచేర్పులను తనే చేసుకుంటూ ముందుకు సాగుతోంది.

• కాత్యాయనీ విద్మహే
• కె. ఎన్. మల్లీశ్వరి

*(8,9 తేదీల్లో మహబూబ్ నగర్ హెచ్.బి.ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో ప్రరవే 5వ మహాసభలు)*



## ప్రపంచ మేధావిని తీర్చిదిద్దిన త్యాగమయి

బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను గుర్తించినంతగా తన స్వంత జాతి ప్రజలు బాబా సాహెబ్ విజయాలకు కారణమైన రమాబాయిని గుర్తించలేదనే చెప్పాలి. తన త్యాగాల పునాదుల మీద అంబేడ్కర్‌ను ఆమె ఒక మేరు పర్వతంగా నిలబెట్టింది. ఆయన ఒక్కొక్క అడుగు వెనుక ఆ తల్లి పంటి బిగువున బిగపట్టిన బాధ తాలూకు గాయలున్నాయి. ఇదంతా గుర్తించారు కాబట్టే 1941లో తను రాసిన ‘థాట్స్ ఆన్ పాకిస్తాన్’ పుస్తకాన్ని అంకితమిచ్చారు. తొమ్మిదేళ్ల రమాబాయితో 14 ఏళ్ల బాబా సాహెబ్ వివాహం 1906 లో జరిగింది. ఆమెకు అంబేడ్కర్ చదువు నేర్పే ప్రయత్నం చేశారు. ఉన్నత చదువుల కోసం బాబా సాహెబ్ లండన్ వెళ్లడంతో ఇంటి బాధ్యతలు మోస్తూ రమాబాయి ఎన్నో బాధలు పడింది, ఆర్థిక కష్టాలు ఎదుర్కొంది. పిడకలు అమ్మి సంపాదించిన డబ్బుతో ఇల్లు నడపడమే కాకుండా భర్త అంబేడ్కర్‌కు కూడా పంపించేవారు. ఆమె జీవిత కాల కష్ట ఫలితమే అణగారిన వర్గాలు అనుభవిస్తున్న హక్కులు. ఈ దంపతుల కష్టాలు వింటే పగవాడికి కూడా ఇన్ని కష్టాలు రావద్దని కోరుకుంటాం. 1907 నుండి మొదలయిన బాబా సాహెబ్ విద్యా ప్రస్థానం 1953 ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ తో ముగిసింది. ఈ ‘సాధన’ వెనుక ఆయన కృషికి మించి అమ్మ రమాబాయి త్యాగమే ఉంది. ఈ దంపతులు తమ రక్తాన్ని చెమటగా మార్చి, తమ కన్నీళ్లతో పీడిత వర్గాలకు భవిష్యత్ బాటలు అయినారు. ఒక్కరొక్కరుగా వీరి సంతానం నలుగురూ చనిపోయారు. అయినా వీరు కుంగిపోక అణగారిన వారి కోసం పాటుపడ్డారు. అంబేడ్కర్ జీవన పోరాటంలో రమాబాయి పాత్రే ఎక్కువ. తన కొడుకు చనిపోయినప్పుడు బాబా సాహెబ్ చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి చూసి తన కొంగును చింపి కొడుకు శవం మీద కప్పి ,తమ పరిస్థితిని ఎదుటివారికి చూపించకుండా జాగ్రత్త పడిందంటే ఆమె పడిన ఆవేదన అర్థం చేసుకోవచ్చు. బాబా సాహెబ్ చదువులు, జ్ఞానం అమ్మ రమాబాయి భిక్ష అనడంలో అతిశయోక్తి లేదు. తన పోరాటంలో అలసి జబ్బుపడి 1935 లో విశ్వాంతరాళాల్లో కలిసి పోయింది.

– కొంగల వెంకట్
స్టేట్ ప్రెసిడెంట్,
తెలంగాణ ఎస్సీ,
ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

epaper.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం

గ్రౌండ్ రిపోర్ట్




**షాహీన్‌బాగ్... గత 50 రోజులుగా పత్రికల్లో, మీడియాలో తరచూ వినిపిస్తున్న పదం. ఢిల్లీలోని ఒక ప్రాంతానికి హఠాత్తుగా ఇంత పేరు ఎందుకొచ్చిందంటే... అక్కడ జరుగుతున్న నిరసన ప్రదర్శనలే కారణం. 'పౌరసత్వ సవరణ చట్టం' ఆమోదం తర్వాత వేలాది మహిళలు ఈ ప్రాంతంలో జరుపుతున్న నిరసనలు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. షాహీన్‌బాగ్ నుంచి 'నవ్య' గ్రౌండ్ రిపోర్ట్...**




# షాహీన్‌బాగ్...

## అపూర్వ మహిళా పోరాట శిబిరం

దేశ రాజధాని ఢిల్లీలోని అత్యంత సంపన్నులు నివసించే దక్షిణ ఢిల్లీ ప్రాంతమది... అపోలో ఆస్పత్రిని ఆనుకుని ఉన్న దారి నుంచి సరితా విహార్, జసోలా కాలనీలు దాటి ఓఖ్లా వైపు వెళుతుంటే అక్కడ కనబడుతుంది షాహీన్‌బాగ్. సందులు, గొందుల మధ్య వేలాది ఇళ్లు... చిన్న చిన్న స్కూళ్లు, మసీదులు... హైదరాబాద్‌లోని పాతబస్తీని తలపిస్తుంది. డిసెంబర్ 15న పార్లమెంట్ పౌరసత్వ చట్టం ఆమోదం పొందిందో లేదో ఈ ఇళ్లలోంచి ఒక్కసారిగా వేలాది మంది మహిళలు మెయిన్ రోడ్ వైపు పెద్ద సంఖ్యలో వచ్చేశారు. అప్పటికప్పుడు శిబిరాన్ని నిర్మించారు. వాళ్లలో అన్ని వర్గాల వారు ఉన్నారు. సంపన్న కుటుంబాలకు చెందిన ముస్లిం మహిళలు తమ నౌకర్లతో సహా అక్కడికి వస్తే చిరిగిన బురఖాలు ధరించిన పేద మహిళలు కూడా వారితో చేరారు. 90 ఏళ్లు దాటిన వృద్ధుల నుంచీ పదేళ్ల బాలిక వరకూ వేలాది మంది అక్కడి నుంచి కదలబోమని భీష్మించుకుని కూర్చున్నారు. తెల్ల కపోతాల గురించి విన్నాం. రాచరికానికి చిహ్నంగా భావించే తెల్లటి డేగను 'షాహీన్' అంటారట. కానీ ఇవాళ షాహీన్‌బాగ్‌లో మహిళలు శాంతి కపోతాల్లా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

షాహీన్‌బాగ్... ఇది ఇప్పుడు ఢిల్లీలో కేవలం ఒక ప్రాంతానికే పరిమితమయిన పదం కాదు. దేశంలోని నిరసన ప్రదర్శనలన్నింటికీ ఆదర్శంగా మారిన ప్రాంతం. తాము ఈ దేశాన్ని నమ్ముకున్నామని, ఈ దేశంపై తమకు నిజమైన భక్తి ఉన్నదని నిరూపించేందుకు వారు జాతీయగీతం జనగణమన, వందేమాతరంతో పాటు... 'హోంగే ఖామియాబ్, సారే జహాసే అచ్ఛా' గీతాలను పాడుతుంటే వేలాది గొంతులు ఆ పాటలతో ప్రతిధ్వనిస్తున్నాయి. మధ్యమధ్యలో 'లేఖే రహేంగే ఆజాదీ' (స్వాతంత్ర్యం తీసుకుని తీరతాం) అన్న నినాదం ప్రతిధ్వనిస్తోంది. షాహీన్‌బాగ్‌లో అడుగుపెడితే అక్కడ అంతటా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతూ కనిపిస్తాయి. అక్కడి వేదికపై మహాత్మాగాంధీ, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, అంబేద్కర్, భగత్ సింగ్, చంద్రశేఖర ఆజాద్, సరోజినీ నాయుడు, జాకీర్ హుస్సేన్, అసఫుల్లా ఖాన్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో పాటు రాజ్యాంగ పీఠిక వేళాడుతూ కనిపిస్తుంది. తమను అభద్రతా భావానికి గురి చేసిన పౌరసత్వ సవరణ చట్టాన్ని, జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) ప్రతిపాదనను వెనక్కు తీసుకునేంతవరకూ తమ నిరసన ఆగదని వారు చెబుతున్నారు. దేశ చరిత్రలోనే వినూత్నమైన ఈ నిరసన ప్రదర్శన చుట్టూ ఇప్పుడు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఏ క్షణంలోనైనా పోలీసులు ఈ శిబిరాన్ని తొలగిస్తారన్న వార్తలు వినపడుతున్నాయి. కాని షాహీన్‌బాగ్ మహిళలు మాత్రం చెక్కుచెదరడం లేదు.

### భయం మమ్మల్ని వెన్నాడుతోంది...

ఈ దేశంలో ముస్లింలకు పౌరసత్వ సవరణ చట్టం వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని ప్రధానమంత్రి, హోంమంత్రి పదే పదే ప్రకటిస్తున్నా వారు విశ్వసించడం లేదు. చట్టంలోనే ముస్లింలను పరిగణనలోకి తీసుకోబోమని ఉన్నదని, మత ప్రాతిపదికగా పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారని వారు చెబుతున్నారు. 'ఈ చట్టం ప్రవేశపెట్టిన తర్వాత ఈ దేశంలో మేము పౌరులమా? కాదా? అన్న భయాందోళనలు వెంటాడుతున్నాయ'ని అంటున్నారు. జాతీయ పౌర రిజిస్టర్‌ను ప్రవేశపెడతామని, అక్రమంగా ఈ దేశంలో ప్రవేశించిన వారిని ఏరి వేస్తామని రాష్ట్రపతి, హోంమంత్రి గతంలో హెచ్చరించారని వారు అంటున్నారు.

'ఎన్నాళ్లు ఈ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తార'ని అడిగితే సిఏఏ, ఎన్నార్సీపై ప్రభుత్వం వెనక్కు తగ్గే వరకూ ఉంటామని, 2024 వరకు ఈ ప్రదర్శన జరపడానికైనా సిద్ధమేనని చెబుతున్నారు. "మోదీపై మాకు కోపం లేదు. మా జీవితాలు ఏమయిపోతాయోనన్న భయం మమ్మల్ని వెంటాడుతోంది. ఇళ్లలో ఉన్న మమ్మల్ని వీధుల్లోకి లాగింది వారే. మాకు సాంత్వన కల్పించాల్సింది పోయి వాళ్లు మమ్మల్ని భయపెడుతున్నారు. మమ్మల్ని తరిమేయాలని చూస్తున్నారు. ఎవరు రెచ్చగొట్టినా వారికి జవాబివ్వకూడదని నిర్ణయించుకున్నాం" అని ఒక మహిళ చెప్పింది. అయితే ఇది నిజాయతీగా జరుగుతున్న పోరాటం కాదని, కాంగ్రెస్ వాళ్లు చేయిస్తున్న పోరాటమని... కాదు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అమిత్‌షా దీన్ని కొనసాగిస్తున్నారని... ఇలా రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి.

### రాజ్యాంగమే ధైర్యాన్నిచ్చింది!

పౌరసత్వ సవరణ చట్టం ప్రవేశపెట్టిన తర్వాత తాము భారత రాజ్యాంగం చదువుకున్నామని, భారత రాజ్యాంగమే తమకు ఈ నిరసన ప్రదర్శన నిర్వహించేందుకు ధైర్యాన్నిచ్చిందని ఒక విద్యార్థిని ప్రకటించింది. గాంధీజీ కొన్ని దశాబ్దాల పాటు స్వాతంత్ర్యం కోసం పోరాడటం తమకు స్ఫూర్తినిచ్చిందని మరో విద్యార్థిని చెప్పింది.

50 రోజులు దాటినా ప్రభుత్వం నుంచి సరైన ప్రతిస్పందన రాకపోయినా సరే, షాహీన్‌బాగ్ మహిళలు వెనక్కు తగ్గేలా కనిపించడం లేదు. తమ గురించి దేశమంతటా తెలిసిపోయిందని, దేశంలోని మహిళలు ఇళ్ల నుంచి బయటకు వస్తే ఎలాంటి ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని వారు చెబుతున్నారు.

"ఇదో వినూత్న పోరాటం... ఎముకలు కొరికే చలిలో కూడా మహిళలు, పిల్లలు ఇళ్లకు వెళ్లకుండా ప్రదర్శనలో పాల్గొనడమే వారి స్థయిర్యాన్ని తెలియజేస్తుంది" అని షాహీన్‌బాగ్‌లో ఉన్న ఒక యునానీ డాక్టర్ అన్నారు.

● **ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో**

ఫొటోలు: **చమన్ గౌతమ్**

### రెండు నెలలుగా... రోడ్డు మీదే!

దేశవిదేశాలలో పలువురిని ఆకర్షిస్తున్న ఈ షాహీన్‌బాగ్ కథ ఏమిటి? కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ 11న పార్లమెంటు ఉభయసభల్లో పౌరసత్వ సవరణ చట్టాన్ని (సి.ఎ.ఎ) ఆమోదించింది. ఆ సవరణలను వ్యతిరేకిస్తున్న జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులపై పోలీసులు దాడి చేశారు. దాంతో, గత డిసెంబర్ 15 నుంచి షాహీన్‌బాగ్ ప్రాంతవాసులు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి, నిరసనలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా స్త్రీలు, చిన్నపిల్లలు ప్రధానంగా పాల్గొంటున్న ఈ శాంతియుత నిరసన కార్యక్రమం ఇప్పటికి 50 రోజులకు పైగా నిర్విరామంగా సాగుతోంది. షాహీన్‌బాగ్ స్ఫూర్తితో గయ, ప్రయాగరాజ్, ముంబయ్, బెంగళూరు లాంటి పలు ప్రాంతాలలో కూడా ఈ తరహా నిరసనలు జరగడం విశేషం.




నగ ధగ

# 'సాలిటెయిర్'తో స్టయిలిష్‌గా..



ఉద్యోగినులు నగలకు దూరంగా ఉండాలి అనుకుంటే పొరపాటు. నిజానికి ప్రత్యేకంగా ఉద్యోగినుల అలంకరణ కోసమే తయారయ్యే నగలూ ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్ 'సాలిటెయిర్ డైమండ్స్'!

**ఉద్యోగినులకు నప్పుతాయి**

డైలీవేర్‌గా ఎలాంటి నగలు సూటవుతాయి? అనే విషయంలో ఉద్యోగినులు అయోమయానికి లోనవుతూ ఉంటారు. అయితే ఇలాంటి వాళ్లు 'సాటిటెయిర్ డైమండ్' నగల్ని ఎంచుకోవచ్చు. సింపుల్‌గా, హుందాగా, ఆకర్షణీయంగా కనిపించాలనుకుంటే ఈ నగల్నే ఎంచుకోవాలి. తక్కువ బరువుతో, చక్కని మెరుపులీనే వజ్రాలతో తయారయ్యే ఈ నగలు రోజూ ధరించడానికి వీలుగా, ఎలాంటి వస్త్రధారణకైనా నప్పేటట్టుగా ఉంటాయి.



**ఇవే ఎందుకంటే?**

కష్టపడి డబ్బులు కూడబెట్టే ఉద్యోగినులు ప్రతి రోజూ వాడుకోవడానికి వీలుండే నగలు కొనుక్కోవాలి. తక్కువ బరువు, నాణ్యత కలిగిన, మేలు రాళ్లు పొదిగిన నగలైతే పెట్టుబడికి తగిన వాడకం ఉంటుంది. సాలిటెయిర్ డైమండ్స్ పొదిగిన నగలైతే చుడీదార్, చీరలు, స్కర్ట్, జీన్స్... ఇలా సంప్రదాయ కట్టుబొట్టుతో పాటు ఎలాంటి ఆధునిక వస్త్రధారణకైనా సూటవుతాయి. బంగారంలో పొదిగిన సాలిటెయిర్ డైమండ్స్ ఇప్పుడు ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. ఉంగరం, బ్రేస్‌లెట్, పెండెంట్... ఈ మూడు కలిపి సెట్‌గా కొనుక్కోవచ్చు.

**సర్టిఫికెట్ తప్పనిసరి!**

సాలిటెయిర్ డైమండ్స్‌ను 'సెంట్'లతో కొలుస్తారు. ఈ నగలను కొనేటప్పుడు రాళ్ల మెరుపు, బరువు, వాడిన బంగారం, తరుగుల గురించి తెలుసుకోవాలి. రాళ్ల నాణ్యతకు హామీగా 'జి.ఐ.ఎ లేదా ఐ.జి.ఐ' సర్టిఫికెట్ తీసుకోవాలి. మార్పిడి చేసే సమయంలో రాళ్లు, బంగారం ధర తగ్గకుండా చూసుకోవాలి. అలా రసీదు మీద రాయించుకోవాలి. ఇక నగల్లో ఒంటి రాయితో తయారైన పెండెంట్లు తీసుకోవచ్చు. ఎక్కువగా మెరవాలనుకుంటే క్లస్టర్ డైమండ్ నగల్ని ఎంచుకోవచ్చు. బంగారం ఇష్టపడని కాలేజీ అమ్మాయిలు ప్లాటినంతో తయారైన సాలిటెయిర్ డైమండ్ నగల్నీ ఎంచుకోవచ్చు. ఇవి వెస్టర్న్ వేర్ మీదకు చక్కగా నప్పుతాయి.



● **మంజులా రావు**
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్

సొగసు

# భలే... బెల్ స్లీవ్స్ కుర్తా!

**కుర్తా అందం స్లీవ్స్ డిజైన్‌లో దాగి ఉంటుంది. కాబట్టి సాదాసీదా స్లీవ్స్‌కు బదులుగా వెడల్పుగా ఉండే, 'బెల్ స్లీవ్స్' కుట్టించుకుంటే మరింత స్టయిల్‌గా కనిపించవచ్చు. అలాంటి మోడర్న్ లుక్ తెచ్చి పెట్టే బెల్ స్లీవ్స్ కుర్తాలు ఇవే!**

- మోచేతుల దిగువకు పొడవుగా ఉంటేనే బెల్ స్లీవ్స్ ముచ్చటగా కనిపిస్తాయి. కుర్తాతో పాటు రన్నింగ్ మెటీరియల్‌తో స్లీవ్స్ కుట్టించుకుంటే అంచుల్లో డిజైన్ ఉండేలా చూసుకోవాలి. లేదంటే కాంట్రాస్ట్ కలర్ స్లీవ్స్ కుట్టించి కుర్తా హ్యాండ్స్‌కు అటాచ్ చేయవచ్చు.
- స్లీవ్స్ వెడల్పు ఎంత ఉంటే బాగుంటుంది అనేది ధరించే కుర్తాను బట్టి మారుతుంది. అలాగే సన్నగా కనిపించాలనుకుంటే తక్కువ కుచ్చులతో నిండుగా కనిపించాలనుకుంటే ఎక్కువ కుచ్చులతో వెడల్పాటి బెల్ స్లీవ్స్ ఎంచుకోవాలి.
- బెల్ స్లీవ్స్ లేయర్స్ రూపంలో కూడా ఎంచుకోవచ్చు. భారీ లుక్ తెప్పించడం కోసం ఇదే సరైన ఎంపిక. టాప్ సాదా రంగులో ఉంటే, ఆ కుర్తాకు అదనపు ఎట్రాక్షన్ తెప్పించడం కోసం ఇలాంటి ట్రిక్ ప్లే చేయవచ్చు.



# అడవిలో వీరపూజ

**మేడారం జాతర... వందల ఏళ్ల ఆదివాసీల వేడుక - ఇప్పుడు సకలజనుల సంబరం. ఇది విగ్రహాలు, దేవతామూర్తుల ఆనవాళ్లు కనిపించని జాతర... ఆసియా ఖండంలో అతిపెద్ద గిరిజన ఉత్సవం. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరతో మేడారం జనసంద్రం అయింది. మొక్కులు తీర్చుకోడానికి భక్త కోటి తరలివచ్చింది.**

విశేషం

ప్రకృతినే దేవతలుగా పూజించే పుణ్యస్థలం, గిరిజనులు ఆరాధ్య దైవంగా పూజించే సమ్మక్క-సారలమ్మలు కొలువైన ప్రాంతం తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం. కీకారణ్యమైన ఆ ప్రాంతంలో రెండేళ్లకొకసారి మాఘ మాసంలో నాలుగు రోజులపాటు జరిగే జాతర వైభవం వర్ణనకు అందదు.

### ఎన్నెన్నో కథనాలు

సమ్మక్క- సారలమ్మల గురించి బాగా ప్రాచుర్యం ఉన్న కథ ప్రకారం, ఓరుగల్లు కేంద్రంగా కాకతీయ సామ్రాజ్యం వర్ధిల్లిన కాలంలో గోదావరి తీరాన ఉన్న దట్టమైన అటవీ ప్రాంతానికి పగిడిద్దరాజు, సమ్మక్కలు సామంతరాజులుగా ఉన్నారు. వీరికి సారలమ్మ, జంపయ్య, గంటయ్య, మూగయ్యలు సంతానం. ప్రతాపరుద్రుడి కాలంలో కరువు కాటకాల వల్ల కాకతీయులకు కప్పం కట్టలేని పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో ప్రతాపరుద్రుడి మంత్రి యుగేంద్రుని ఆదేశాల మేరకు కాకతీయ సేనలు పగిడిద్ద రాజు రాజ్యంపై యుద్ధానికి దిగాయి. ఈ యుద్ధంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపయ్య వీరమరణం పొందారు. సారలమ్మ, పగిడిద్దరాజులు యుద్ధ క్షేత్రంలో నేలకొరగగా, సమీపంలో ఉన్న సంపెంగ వాగులో పడిన జంపయ్య గాయపడ్డాడు. సమ్మక్క చిలకల గట్టుపై ఉన్న నెమలినార చెట్టు దగ్గర వీరమరణం పొందింది. వారి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ జరిపే వీరపూజే మేడారం జాతర అని ఈ కథనం వెల్లడిస్తోంది. కాగా ఆదివాసీలు చెప్పుకునే కథల ప్రకారం, కొందరు గిరిజనులకు అడవిలో ఓ బాలిక కనిపించింది. ఆ బాలికను పులులు కాపలా కాస్తున్నాయి. వారు కొండదేవరను ప్రార్థించగా, ఆ పులులు మాయమయ్యాయి. ఆ బాలికకు వారు 'సమ్మక్క' అని పేరు పెట్టుకుని, పెంచి పెద్ద చేశారు. ఎన్నో మహిమలు చేస్తూ, ఆదివాసీల ఇలవేల్పుగా సమ్మక్క మారిందని చెబుతారు. అయితే సమ్మక్కకు సంబంధించిన చరిత్ర అంతా (ప్రస్తుత) ఛత్తీస్‌ఘడ్ ప్రాంతానికి చెందినదనీ, ఇప్పటికీ ఆదివాసీ పద్ధతిలో సమ్మక్కకు మొక్కులు చెల్లించేది ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఆదివాసీలేననీ ప్రస్తుత ఆదివాసీ పూజారులు చెబుతున్నారు.

**జాతరలో మూడో రోజు (శుక్రవారం) అత్యంత విశిష్టమైనది. ఈ రోజు భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారు.**

### ప్రకృతే దేవతలు!

ఇతర సాంప్రదాయాలకు సంబంధించిన ఆలయాల్లో దేవతలు శిలా విగ్రహ రూపంలో ఉంటారు. మేడారం గద్దెల వద్ద ఇటువంటి శిలావిగ్రహాలు కనిపించవు. కలపతో చేసిన దేవుని ప్రతిమలను పూజిస్తారు. ఇక మేడారం, కన్నెపల్లిలలో ఉన్న ఆలయాల్లోనూ శిలా విగ్రహ రూపాలు ఉండవు. అక్కడ కుండలలో పసుపు, కుంకుమ రూపంలో వన దేవతలు కొలువుతీరి ఉంటారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకుపై కప్పు వేయరు. గర్భగుడి, ప్రాకారం వంటివి ఉండవు ఎవరైనా సమ్మక్క, సారలమ్మలను చేతులతో తాకి తమ బాదలు, కోరికలు చెప్పుకుని మొక్కుకోవచ్చు. కేవలం రద్దీ కారణంగా జాతర సమయంలో భక్తులను గద్దెలపైకి అనుమతించరు. ఇక్కడ అర్చనలు ఉండవు. సమ్మక్క సారలమ్మ ఆలయాలు గ్రహణ సమయాల్లో సైతం మూతపడవు.. భక్తులు మొక్కుగా 'బంగారం' (బెల్లం) సమర్పించడం మేడారం ప్రత్యేకత.

### నేడు మొక్కుల రోజు

సమ్మక్క, సారలమ్మలు కొలువుతీరి ఉండగా భక్తులు మొక్కలు చెల్లించుకొనే మూడో రోజు (శుక్రవారం) ఈ జాతరలో విశిష్టమైనదిగా భక్తులు పరిగణిస్తారు. కులమతాల భేదాలు లేకుండా భారీ ఎత్తున భక్తులు మేడారం చేరుకుని సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. నాలుగో రోజు సాయంత్రం సమ్మక్క చిలుకలగుట్టకు, సారలమ్మ కన్నెపల్లికి, పగిడిద్ద రాజు పూనుగొండ్లకు, గోవిందరాజులు కొండాయికి తిరుగు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.

● **తడక రాజనారాయణగౌడ్**, భూపాలపల్లి

### ఎవరి ఆలయాలు ఎక్కడంటే...

● సమ్మక్క ప్రధాన ఆలయం మేడారం గ్రామంలోనే ఉంది. 1962కు పూర్వం సమ్మక్క ప్రధానం ఆలయం ఎస్ఎస్ తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఉండేది. రెండేళ్ళకు ఒకసారి అక్కడ జాతర జరిగేది. కరువు కారణంగా 1962లో జాతర నిర్వహించలేని పరిస్థితి ఎదురైంది. అప్పుడు జాతరను మేడారానికి తరలించి ఇక్కడే సమ్మక్కకు ఆలయం నిర్మించారు.

● సారలమ్మ ప్రధాన ఆలయం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం కన్నెపల్లి గ్రామంలో ఉంది. మేడారం-కన్నెపల్లి మధ్య మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. తొలి రోజు జరిగే వేడుకల్లో సారలమ్మ మేడారం ప్రయాణం ముఖ్యమైనది. హనుమంతుడి జెండా తోడుగా రాగా సారలమ్మ మేడారం బయలుదేరుతుంది. మార్గమధ్యంలో జంపన్నవాగు గుండా కాలినడకన నడుస్తూ సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు. అక్కడ సమ్మక్క-పగిడిద్దరాజుల వివాహానికి హజరై అక్కడి నుంచి గద్దెలపైకి చేరుకుంటారు.

● సమ్మక్క భర్త పగిడిద్ద రాజు ఆలయం మహబూబబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో ఉంది. పెనక బుచ్చిరాములు పగిడిద్దరాజు ప్రధాన పూజారి. మేడారం-పూనుగొండ్ల మధ్య 70 కిలోమీటర్ల దూరం ఉంటుంది. జాతర సందర్భంగా పూనుగొండ్ల నుంచి మేడారం వరకు పడిగెరూపంలో ఉన్న పగిడిద్దరాజును కాలినడకన మేడారం తీసుకువస్తారు.

● పగిడిద్దరాజు తమ్ముడైన గోవిందరాజులు ఆలయం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో ఉంది. మేడారం- కొండాయి మధ్య పదిహేను కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇదంతా అటవీమార్గం. జాతర జరిగే రోజు ఉదయం నుంచి కొండాయిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం పడిగే రూపంలోని గోవిందరాజులుని మేడారానికి తీసుకువస్తారు.





---

నవజీవన వేదం

## ఎవరు సజ్జనులు?

పని ప్రారంభించి మధ్యలో వదిలిపెట్టడం తప్పే. దాని గురించి భర్తృహరి సుభాషితాలను తెలుగులో అందించిన ఏనుగు లక్ష్మణకవి పద్యం ద్వారా తెలుసుకుందాం.

**తమ కార్యంబు పరిత్యజించియు పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్**
**తమ కార్యంబు ఘటించుచున్ పరహితార్థ వ్యాపృతుల్ మధ్యముల్**
**తమకై యన్య హితార్థ ఘాతుక జనుల్ దైత్యుల్, వృధాన్యార్థభం**
**గము గావించెడువార లెవ్వరో యెఱుంగ శక్యమే యేరికన్**



ఎటువంటి వాళ్ల సజ్జనులు? ఎటువంటి వాళ్ల మధ్యములు? ఎటువంటి వాళ్ల నీచులు? కొందరు అవసరమైతే తమ పని పక్కన పెట్టి ఎదుటి వాళ్ల పని చేస్తారు. వాళ్ల సజ్జనులు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఇతరుల పనులను పూర్తి చేయడం పైనే దృష్టి పెడుతుంటారు. వాళ్ల సొంతపనుల గురించి ఆలోచించరు. అటువంటి వాళ్ల సజ్జనులు. కొంతమంది ఇతరుల పని చేస్తూ, వాళ్ల పని కూడా చేసుకుంటుంటారు. వాళ్ల మధ్యములు. వీళ్ల ఆఫీసు పని పూర్తి చేస్తూ, మధ్యమధ్యలో తమ సొంత పని కూడా చక్కబెట్టుకుంటారు. ఇక చివరగా కొందరు తమ ప్రయోజనాల కోసం ఇతరుల పనులన్నీ పక్కన పెడతారు. వాళ్ల నీచులు. ఆఫీసులో కూడా తమ సొంత పనుల గురించే ఆలోచిస్తుంటారు. మనం ఆ కోవకు చెందకుండా ఉండటం చాలా అవసరం.



● **డా. గరికిపాటి నరసింహారావు**

---

## భిక్షు జీవనం ఎందుకోసం?

ధర్మపథం



తిస్సపుత్రుడు ఒక వ్యాపారి. ఊరూరా తిరుగుతూ ఆటబొమ్మలు అమ్ముకుంటూ ఉండేవాడు. సంపాదన ఒక మాదిరిగా ఉండేది. కుటుంబం హాయిగా సాగిపోతూ ఉండేది. వీధుల్లో తిరుగుతూ వస్తువులు అమ్ముకోవడం వల్ల అతనికి ప్రత్యేక గౌరవం దొరకడం లేదు. డబ్బున్నా గౌరవం లేకపోవడంతో అతను లోలోపల బాధపడుతూ ఉండేవాడు. ఏ రోజైనా అమ్మకం జరగకపోతే, తక్కువ సొమ్ము తెస్తే ఇంట్లో తిట్లు తప్పేవి కావు. రోజులు అలా దొర్లిపోతున్నాయి.

ఒక రోజు తిస్సపుత్రుడికి వీధిలో ఓ భిక్షువు ఎదురుపడ్డాడు. ఆ భిక్షువు కాళ్ళకు చెప్పులు కూడా లేవు. చీవరం (భిక్షువులు ధరించే వస్త్రం) చిరిగిపోతే, దానికి కుట్లు వేసుకొని ధరించాడు. భిక్షా పాత్ర పట్టుకొని నడిచి వస్తున్నాడు. దారిలో ఆ భిక్షువుకు ఎదురు వచ్చే వాళ్ళందరూ ఆయనకు వంగి వంగి దండాలు పెడుతున్నారు. కొందరు పాదాలకు నమస్కరిస్తున్నారు.

ఇది తిస్సపుత్రుడు రోజూ చూసే దృశ్యమే! అయినా ఆ విషయం అతని మనసులో గట్టిగా ముద్రపడింది. 'ప్రజలందరూ గౌరవించాలంటే నేను కూడా భిక్షువుగా మారాలి' అనుకున్నాడు. రెండు, మూడు రోజులు మధనపడ్డాడు. ఆలోచించి, ఆలోచించి చివరకు సన్యసించాలని నిర్ణయించుకున్నాడు. బౌద్ధ సంఘంలో చేరి భిక్షువుగా మారాడు. తన పట్టణానికి దూరంగా ఉన్న మరో పట్టణానికి వెళ్ళాడు, అక్కడ గౌరవం దక్కుతోంది

ఒక రోజున మరో భిక్షువుతో కలిసి దూరంగా ఉన్న ఒక గ్రామానికి తిస్సపుత్రుడు బయలుదేరాడు. వారిద్దరూ ఒక కాలువ కట్టమీద కాలిబాటలో సాగుతున్నారు. దారిలో ఒక చోట గొర్రెలు మేస్తున్నాయి. ఆ మందలో మిగిలిన గొర్రెలన్నీ భిక్షువులను చూసి, మోరలు ఎత్తాయి. నిలబడి చూస్తూ ఉండిపోయాయి. ఒక పొట్టేలు మాత్రం తల కిందికి దించి వెనుకకు నడిచింది.

"మిత్రమా! చూశావా! ఈ పొట్టేలు నా మీద ఎంత గౌరవం చూపుతోందో!" అన్నాడు తిస్సపుత్రుడు.

"మిత్రమా! నిలబడకు. రావయ్యా! అది గౌరవం కాదు, త్వరగా రా!" అంటూ గబగబా ముందుకు నడిచాడు తోటి భిక్షువు.

"అరే మిత్రమా! మనం భిక్షువులం. మనను అందరూ గౌరవిస్తారు. నాలోని తేజస్సును చూసి చివరకు పశువు కూడా గౌరవిస్తోంది చూడు" అంటూ పొట్టేలును దీవిస్తూ నిలబడ్డాడు తిస్సపుత్రుడు.

వెనక్కి వెనక్కి వెళ్ళిన పొట్టేలు పరుగు పరుగున వచ్చి అతని పొట్టలో గట్టిగా ఢీకొట్టింది. అంతే.. అతను వెర్రి కేక వేసి కాలువలో పడ్డాడు.

"భిక్షు జీవితం గౌరవం కోసం కాదు, జ్ఞానం కోసం. ధర్మప్రచారం కోసం. ప్రజల దుఃఖ నివారణ కోసం. కేవలం మర్యాదలూ, గౌరవాల కోసం కాదు" అని అతణ్ణి నీటిలోంచీ ఒడ్డుకు చేర్చిన తోటి భిక్షువు చెప్పాడు.

తిస్సపుత్రుడు భిక్షు జీవనం వదిలి, తిరిగి వ్యాపారిగా మారాడు.

● **బొర్రా గోవర్ధన్**

---

సందేశం



## మంచి పనులతోనే...

మనిషి తన వంతు ప్రయత్నం చెయ్యకుండానే తన సమస్య పరిష్కారం అయిపోతుందనీ, తన బతుకు బాగుపడిపోతుందనీ ఆశిస్తే అంతకన్నా ఆత్మవంచన ఉండదు. పరివర్తన అతని లోపల నుంచే ప్రారంభం కావాలి.

"ఏ జాతి అయినా స్వయంగా తన ఆచరణను మార్చుకోనంత వరకూ దైవం కూడా వారి స్థితిని మార్చడు" అతని అల్లాహ్ స్పష్టం చేశారు. (దివ్య ఖుర్ఆన్- అన్‌ఫాల్ 8:53)

నేడు సమాజంలో అధిక శాతం ప్రజలు ఏదైనా ఆపద వచ్చి వారి మీద పడినప్పుడు, ఎవరో ఒకరు వచ్చి ఆ సమస్య పరిష్కరిస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు. కానీ ఆ సమస్య పరిష్కారం దిశగా కనీసం ఒక అడుగు ముందుకు వేద్దామని ఆలోచించేవారు చాలా అరుదు. చివరకు విధిగా చేయాల్సిన పనిని కూడా చెయ్యకుండా వారు నిర్లక్ష్యం వహిస్తారు.

"మంచి వైపునకు పిలిచేవారూ, మేలు చెయ్యాలని ఆజ్ఞాపించేవారూ, చెడు నుంచి వారించేవారు మీలో తప్పనిసరిగా కొందరు ఉండాలి. ఈ పని చేసేవారే సాఫల్యం పొందుతారు." (దివ్య ఖుర్ఆన్- ఆలి-ఇమ్రాన్ 3:104)

వాస్తవానికి, మంచిని బోధిస్తూ, చెడును నిర్మూలించాల్సిన బాధ్యత ముస్లింల మీద ఉందని పవిత్ర గ్రంథాలు పేర్కొంటున్నాయి. కానీ అసలు బాధ్యతను గాలికి వదిలేసి, కేవలం ప్రదర్శనా బుద్ధికి (రియాకారీ)కి అంకితం అవడం, నలుగురి ముందూ తాము గొప్ప సంఘ సేవకులమని కొందరు చెప్పుకుంటూ చాలా చోట్ల ఉండడం కనిపిస్తుంది. అలాగే సమాజం కోసం ఎంతో కృషి, ఎన్నో త్యాగాలు చేస్తున్నామని కూడా కొందరు చెప్పుకుంటూ ఉంటారు. వాస్తవానికి ఇవన్నీ బడాయిలే! ఇలాంటి కపటులను దివ్య ఖుర్ఆన్ ఇలా హెచ్చరిస్తోంది.

"మీ నిజాయితీ గురించి మీరు గొప్పలు చెప్పుకోకండి. మీలో నిజంగా దైవభీతిపరుడు ఎవరో దైవానికి బాగా తెలుసు." (దివ్య ఖుర్ఆన్- అన్ నజ్మ్ 53:31)

కొందరు అనవసరమైన వృథా ఖర్చులతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటారు. వారిని అల్లాహ్ ఈ విధంగా ఆదేశించారు:

"వృథా ఖర్చులు చేయకండి. దుబారా చేసేవారు సైతాను సోదరులు." (దివ్య ఖుర్ఆన్ - బనీ ఇస్రాయిల్ 17:26)

సమాజంలో అన్ని రకాలుగా వెనుకబడిన వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, తమ స్వార్థం కోసం అక్రమాలకు పాల్పడేవారు చాలా మందే ఉన్నారు. వారిని దైవం ఇలా హెచ్చరిస్తున్నాడు:

"మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా తినేయకండి. పరస్పర ఆమోదంతో వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోండి." (దివ్య ఖుర్ఆన్- అన్ నిసా 4:29)

నేడు సమాజంలో కొంతమంది (ధార్మిక పండితులు) ఎన్నో నీతులు బోధిస్తారు. కానీ వాటిని స్వయంగా వారే ఆచరించరు. "మంచి పనులు చేయాలంటూ మీరు ఇతరులకు బోధిస్తారు. కానీ మీరు వాటిని ఆచరించడం మరచిపోతున్నారే" (దివ్య ఖుర్ఆన్- అల్ బఖర 2:44) అంటూ అలాంటి వారికి కూడా దైవం హెచ్చరిక చేశాడు.

జీవిత సాఫల్యం పొందాలంటే మంచి పనులు చేయాలి. దైవానికి విధేయంగా ఉండాలి. స్వార్థంతో, ప్రదర్శనతో, కేవలం మాటలే పరిమితమైన ఆచరణతో దైవ కృపను ఎవరూ పొందలేరు.

● **మహమ్మద్ వహీదుద్దీన్**

---

### డైలీ సుడోకు -272

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 3 | | | | 6 | | 2 |
| 8 | 4 | | 3 | | | | | 5 |
| | 5 | | | 2 | | | | |
| | 8 | | | | 4 | | | 1 |
| | 3 | | | | | | 5 | |
| 4 | | | 1 | | | | 9 | |
| | | | | 7 | | | 8 | |
| 5 | | | | | 1 | | 6 | 7 |
| 2 | | 4 | | | | 5 | | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 271 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 3 | 1 | 9 | 6 | 8 | 2 | 7 | 4 |
| 2 | 6 | 8 | 4 | 7 | 5 | 1 | 9 | 3 |
| 4 | 7 | 9 | 1 | 2 | 3 | 6 | 5 | 8 |
| 6 | 9 | 2 | 3 | 1 | 4 | 7 | 8 | 5 |
| 8 | 5 | 4 | 7 | 9 | 6 | 3 | 1 | 2 |
| 3 | 1 | 7 | 5 | 8 | 2 | 9 | 4 | 6 |
| 9 | 4 | 5 | 2 | 3 | 7 | 8 | 6 | 1 |
| 1 | 2 | 6 | 8 | 5 | 9 | 4 | 3 | 7 |
| 7 | 8 | 3 | 6 | 4 | 1 | 5 | 2 | 9 |

---

దైవమార్గం

## అదే గీటురాయి



ఒకసారి ఏసు ప్రభువు దగ్గరకు ఒక యువకుడు వచ్చాడు. అతను పాలకుడు కూడా. ఏసు ప్రభువు ముందు మోకాళ్ళపై వంగి అతను నమస్కరించాడు. "ఓ మంచి బోధకుడా! మోక్షాన్ని సాధించాలంటే నేను ఏం చెయ్యాలి?" అని అడిగాడు.

"పది ఆజ్ఞలను (టెన్ కమాండమెంట్స్) పాటించు" అంటూ వాటిని ఏసు ప్రభువు వివరించాడు. "నా చిన్నప్పటి నుంచీ వాటిని పాటిస్తున్నాను" అని ఆ యువకుడు బదులిచ్చాడు.

"అవునా? అయితే నీ సంపద అంతా పేదలకు పంచిపెట్టు. ఆ తరువాత 'మోక్షం' అనే అపూర్వమైన సంపద కోసం కృషి చెయ్యి" అన్నాడు ఏసు ప్రభువు.

ఆ యువకుడి మొహం వాడి పోయింది. మరేం మాట్లాడకుండా అక్కడి నుంచి విచారంగా బయటకు నడిచాడు. ఇదంతా ఏసు ప్రభువు శిష్యులు ఆశ్చర్యంగా గమనిస్తున్నారు. వారిని చూసి ఆయన నవ్వుతూ "సంపన్నుడైన వ్యక్తి దేవుడి రాజ్యంలోకి ప్రవేశించడం కన్నా సూది బెజ్జంలో ఒక వైపు నుంచి ఒంటెను దూర్చి మరోవైపు లాగడం సులభం. కానీ దేవుడు సర్వసమర్థుడు. ఆయన అన్నిటినీ సాధ్యం చెయ్యగలడు" అన్నాడు.

'ఏ వ్యక్తీ ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు. అతను ఒకరిని ప్రేమిస్తాడు. మరొకరిని ద్వేషిస్తాడు. ఒకరి పక్షాన ఉంటాడు. మరొకరిని చిన్న చూపు చూస్తాడు. అదే విధంగా దైవానికీ, ధనానికీ ఒకేసారి దాసులుగా ఉండడం సాధ్యం కాదు' అని బైబిల్ చెబుతోంది. దైవ కృపను కోరుకొనే వ్యక్తి ధనం, హోదాలాంటి వ్యామోహాలను వదులుకోవాలి. అదే విశ్వాసానికి గీటురాయి.

# హీరోగా గొప్ప లాంచ్ ఇది

-ప్రదీప్ మాచిరాజు


అమృతా అయ్యర్, ప్రదీప్

ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయమవుతున్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించటం ఎలా'. మున్నా దర్శకత్వంలో ఎస్వీ బాబు నిర్మిస్తున్నారు. అమృతా అయ్యర్ నాయిక. చంద్రబోస్ సాహిత్యం, అనూప్ రూబెన్స్ సంగీతంలో ఇటీవల విడుదలైన 'నీలి నీలి' పాట ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రదీప్ మాట్లాడుతూ "అందమైన ప్రేమకథ ఇది. 'నీలి నీలి' పాటను మహేశ్‌బాబు విడుదల చేయడం వల్ల ఇంతగా స్పందన వచ్చింది. ఈ కథలో ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంది. హీరోగా లాంచ్ అవ్వడానికి ఇంతకన్నా మంచి కథ, అవకాశం రాదు" అని అన్నారు. "నీలి నీలి' పాటను పల్లె నుంచి పట్టణాల వరకూ అందరూ పాడుకుంటున్నారు. అనూప్ బాణీలు, చంద్రబోస్ సాహిత్యం, సిద్ శ్రీరామ్, సునీతల మధురమైన గానమే అందుకు కారణం. నేపథ్య సంగీతం పూర్తయ్యాక నా మనసంతా బరువెక్కిపోయింది" అని దర్శకుడు అన్నారు. "ఈ కథ మంచి మ్యూజిక్‌ను డిమాండ్ చేసింది' అని అనూప్ అన్నారు. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని నిర్మాత చెప్పారు.

# నా చివరి ప్రేమకథ ఇది

- విజయ్ దేవరకొండ


ఇజాబెల్లె, కేథరిన్, విజయ్ దేవరకొండ, రాశీ ఖన్నా

"వరల్డ్ ఫేమస్ లవర్' అనేది నా చివరి లవ్ స్టోరీ! ఈ సినిమా చేసేటప్పుడే నాకు ఆ విషయం తెలుసు. అందుకే సినిమాను పూర్తిగా ప్రేమతో నింపేశాం" అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో కే.ఎస్.రామారావు సమర్పకుడిగా కె.వల్లభ నిర్మించిన చిత్రమిది. రాశీఖన్నా, కేథరిన్, ఐశ్వర్యా రాజేశ్, ఇజాబెల్లె నాయికలు. గురువారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "నా సినిమా అంటే ఓ హడావిడి, మళ్లీ వీడేం సినిమా చేశాడురా అన్న ఆతురత, నలుగురు హీరోయిన్‌లు ఎలా ఎంటర్‌టైన్ చేస్తారో అన్న ఎగ్జైట్‌మెంట్ పబ్లిక్‌లో ఉంటుంది. అయితే నేను ఈసారి ఏం చేయలేదు. కాకపోతే ఈ సినిమా కోసం ఎక్కువ కష్టపడ్డా. జీవితంలో కొత్త దశలోకి వెళ్తున్నా. మనిషిగా కొంచెం మారుతున్నా. అభిరుచులు మారుతున్నాయి. అందుకే నాలో ఈ మార్పు. నలుగురు బ్యూటిఫుల్ హీరోయిన్స్‌తో కలిసి పనిచేయడం గర్వంగా ఉంది. ఇది కల నిజమవడం లాంటిది" అని అన్నారు. కేఎస్ రామారావు మాట్లాడుతూ "ఐ ఫీస్ట్‌లా ఉండేలా దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. నలుగురు హీరోయిన్‌లు ఉన్నా వారిని డామినేట్ చేసేలా విజయ్ నటన ఉంటుంది. నటుడిగా ఆయనలో మరో డైమన్షన్ బయటికొస్తుంది. ఫ్రస్టేటెడ్ లవర్‌గా నలుగురు హీరోయిన్‌లతో విజయ్ దేవరకొండ నటించిన విధానం నిజంగా ఎక్సలెంట్. ఇదొక హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలా ఉంటుంది. ప్రతి లవర్‌కీ నచ్చే సినిమా ఇది" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "విజయ్‌ని కొత్తగా చూపించా. ఈ సినిమా జర్నీ నాకెంతో నేర్పించింది" అని అన్నారు. "చేసిన పాత్రలు మళ్లీమళ్లీ చేయడం నాకు నచ్చదు. అందుకే చాలా సెలక్టివ్‌గా ఉంటా. క్రాంతి మాధవ్ చెప్పిన పాయింట్‌లో కొత్తదనం నాకు నచ్చింది. ఇందులో స్మితగా కనిపిస్తా" అని కేథరిన్ అన్నారు. "ఈ సినిమాకు కథే అసలైన హీరో. నేను పోషించిన యామినీ పాత్ర ఎప్పటికీ మరచిపోలేనిది. నాకొక ఎమోషనల్ జర్నీ ఇది. ఫ్యాన్స్ గర్వంగా ఫీలయ్యే సినిమా అవుతుంది" అని రాశీఖన్నా చెప్పారు.

# నాన్న చెబుతూనే ఉన్నారు... తెలుగులో సినిమా చేయమని!

- జీవా



**"భాషలకు అతీతంగా భారతీయులు చిత్రాలను ఆదరిస్తున్నారు. హిందీ చిత్రాలను దక్షిణాదిలో చూస్తున్నారు. దక్షిణాది చిత్రాలకు హిందీలో డబ్బింగ్, శాటిలైట్ మార్కెట్ ఉంది. 'బాహుబలి'తో ప్యాన్ ఇండియన్ సినిమాల సంఖ్య పెరిగింది. రణ్‌వీర్ సింగ్ '83' అటువంటి చిత్రమే. అందులో నేను క్రికెటర్ కృష్ణమాచారి పాత్ర పోషించా. భాషతో సంబంధం లేకుండా అందరూ అన్ని భాషల్లో చిత్రాలు చేస్తున్నారు" అని జీవా అన్నారు. రతిన శివ దర్శకత్వంలో జీవా హీరోగా నటించిన చిత్రం 'స్టాలిన్'. తెలుగులో నట్టి కరుణ, నట్టి క్రాంతి విడుదల చేస్తున్నారు. తమిళ, తెలుగు భాషల్లో శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. జీవా చెప్పిన సంగతులు...**

- సంతోషంగా జీవించే ఓ పల్లెటూరి మధ్యతరగతి యువకుడు ఒక సమస్యలో ఇరుక్కుంటాడు. అదేంటి? ఆ సమస్యకు, మహిళా సాధికారితకు సంబంధం ఏంటి? అనేది చిత్రకథ. వాస్తవ పరిస్థితులపై దర్శకుడు చాలా పరిశోధన చేసి తెరకెక్కించారు. కుటుంబమంతా కలిసి చూసే చిత్రం. ఇందులో యాక్షన్, ఫ్యామిలీ సెంటిమెంట్, ఫ్రెండ్‌షిప్, ఎమోషన్స్, యువతను ఆకర్షించే అంశాలు... అన్నీ ఉన్నాయి.
- చిత్రంలో నా పేరు స్టాలిన్. తెలుగు వెర్షన్‌కు అదే టైటిల్ ఖరారు చేశారు. అందరివాడు... అని ఉపశీర్షిక పెట్టారు. ఈ రెండూ చిరంజీవిగారి టైటిల్సే. మా నిర్మాత మెగాస్టార్‌కి పెద్ద అభిమాని ఏమో!
- తెలుగులో 'రంగం' మంచి విజయం సాధించింది. ఆ తర్వాత నేను నటించిన పాత చిత్రాలను తెలుగులో విడుదల చేయడంతో నా మార్కెట్ కిల్ అయింది. మా నాన్న ఆర్‌బి చౌదరిగారు సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై తెలుగులో ఎన్నో హిట్ చిత్రాలు నిర్మించారు. 'రంగం' తర్వాత స్ట్రయిట్ తెలుగు చిత్రం చేయమని ఆయన చెబుతూనే ఉన్నారు. నాకు తెలుగు అంతగా రాదు. భాష పూర్తిగా తెలిసినప్పుడు మంచి కథలు ఎంచుకునే అవకాశం ఉంటుంది.

# దయచేసి సినిమాను ఆపొద్దు


నరసింహ నంది

"గతంలో '1940లో ఓ గ్రామం' లాంటి సామాజిక సినిమా తీసి జాతీయ పురస్కారం అందుకున్నా. నేను తీసిన ప్రతి సినిమా సామాజిక సందేశమున్నదే! సమాజానికి చెడు చేయాలని ఏ రోజూ అనుకోలేదు. డిగ్రీ కాలేజ్ కూడా అలాంటి సినిమానే. పోస్టర్ చూసి సినిమా విడుదల ఆపేస్తామనడం న్యాయం కాదు. అభ్యంతరకరంగా ఉన్న పోస్టర్‌లను తొలగిస్తాం" అని 'డిగ్రీ కాలేజ్' దర్శకుడు నరసింహనంది అన్నారు. ఈ సినిమా పోస్టర్లు అభ్యంతరకరంగా ఉన్నాయని విద్యార్థి సంఘాలు, మహిళలు ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో టాస్క్‌ఫోర్స్ బృందం దర్శకుడితోపాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. దీని గురించి నరసింహనంది ఫిల్మ్ చాంబర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.

# ఈ సక్సెస్ మాకు చాలా ముఖ్యం

-నందు



"వర్కవుట్ కావని తెలిసినా కొన్ని సినిమాలు చేశా. అవన్నీ అవసరాల కోసమే! కానీ ఏ సినిమాను అశ్రద్ధగా చేయలేదు. వంద శాతం ఎఫర్ట్ పెట్టాను. జయాపజయాలు నా చేతిలో ఉండవు కదా? నా గత చిత్రాలన్నీ నన్ను ముందుకు నడిపించే పాఠాలుగా ఉపయోగపడతాయి" అని నందు అన్నారు. ఆయన కీలక పాత్ర పోషించిన చిత్రం 'సవారి' సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సంతోశ్ మోత్కూరి, నిషాంక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా నందు మాట్లాడుతూ "స్లమ్ ఏరియాలో ఓ పూట పొట్ట నింపుకొని, గుర్రాన్ని తోలుకునేగా వాడిగా ఈ సినిమాలో కనిపిస్తా. ఇందులో నేను చేసే సవారీ దేనికనేది ఆసక్తికరం. ఇందులో లవ్ ట్రాక్, ఎమోషన్స్ హైలైట్‌గా ఉంటాయి. దర్శకుడు పూర్తిగా వర్క్ హాలిక్. మంచి సినిమా అందించాలనే తపనతో చాలా కష్టపడ్డాడు. ఈ సినిమా విజయంపైనే మా ఇద్దరి లైఫ్ ఆధారపడి ఉంది" అని అన్నారు.












## తొలగించిన పెన్షన్లపై రీసర్వే

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక పెన్షన్ల తొలగింపుపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావడం ద్వారా లక్షల్లో పెన్షన్లు రద్దయ్యాయని 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీంతో ప్రభుత్వం పెన్షన్ రద్దయినవారికి ఊరట కల్పించేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీఎం ఆదేశాలతో సెర్ప్ సీఈఓ రాజాబాబు మరోసారి.. తొలగించిన పెన్షన్లపై రీసర్వే చేయనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. సోషల్ ఆడిట్ జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించిన అనంతరం అనర్హులుగా ప్రకటించిన వారిని మరో సారి పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాత.. అర్హులైతే వారందరికీ పెన్షన్ అందజేస్తామన్నారు.

## టీడీపీ నిజనిర్ధారణ కమిటీల ఏర్పాటు

అమరావతి ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విశాఖలో భూకబ్జాలు, నాగార్జున యూనివర్సిటీ వీసీ కక్షపూరిత వ్యవహారాల శైలిపై వాస్తవాలు తెలుసుకునేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రెండు నిజనిర్ధారణ కమిటీలు ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో విశాఖలో జరిగిన భూకబ్జాలపై ఒక కమిటీ విచారణ చేయనుంది. నాగార్జున యూనివర్సిటీలో నిరసన తెలిపిన విద్యార్థులను సస్పెండ్ చేసిన వీసీ వివక్షపూరిత వైఖరిపై వాస్తవాలు తెలిపేందుకు రెండో కమిటీని ఏర్పాటు చేసింది.

## పీపీఏల రద్దుకు కేంద్రం వ్యతిరేకం: మంత్రి ఆర్కే సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు అభివృద్ధి సంస్థలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను పునఃసమీక్షించాలని నిర్ణయించిందని, అయితే ఈ ఒప్పందాలకు తిరుగులేదని, దీనిపై మళ్లీ చర్చించడం శ్రేయస్కరం కాదని తాము పదే పదే చెప్పామని కేంద్ర పునరుత్పాదక ఇంధన, విద్యుత్, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే సింగ్ చెప్పారు. పీపీఏలను పునఃసమీక్షిస్తే పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతింటుందని, భారత్‌లో చట్టపరంగా పాలన సాగడం లేదని, కాంట్రాక్టులను గౌరవించడం లేదన్న సంకేతాలు బయటి ప్రపంచానికి వెళ్తే పెట్టుబడులు రావని, అభివృద్ధి స్తంభించిపోతుందంటూ.. 2019 జులై 9న ఏపీకి ఒక లేఖలో స్పష్టం చేశామని మంత్రి తెలిపారు. గురువారం లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఒప్పందంలో తత్సంబంధిత క్లాజు ఉన్నా, లేక స్పష్టంగా అవినీతి రుజువైతే మాత్రమే ఆ ఒప్పందాన్ని సమీక్షించాలని చెప్పారు.

## జగన్ కేసులో కౌంటర్‌కు గడువు కోరిన సీబీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో వ్యక్తిగత హాజరును మినహాయించాలని కోరుతూ ఏపీ సీఎం జగన్ హైకోర్టులో దాఖలుచేసిన అప్పీలు పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. ఈ వ్యాజ్యాల్లో కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి విచారణను ఈనెల 12కి వాయిదా వేశారు.

## ఈడీ కేసులో..నేడు కోర్టుకు జగన్

- 'దిశ' పోలీసు స్టేషన్ ప్రారంభోత్సవం రేపటికి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో సీఎం జగన్ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రత్యేక న్యాయస్థానానికి హాజరు కానున్నారు. ఈ కారణంగా శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో తలపెట్టిన 'దిశ' పోలీసు స్టేషన్ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకున్నారు. శుక్రవారం ఈడీ కేసులో కోర్టుకు జగన్ హాజరవ్వాల్సి ఉండడంతో.. ఈ కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేసినట్లు డీజీపీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

## లోకేశ్‌కు మళ్లీ భద్రత తగ్గింపు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భద్రత తగ్గించింది. 8 నెలల్లో ఆయనకు భద్రత తగ్గించడం ఇది రెండోసారి. లోకేశ్‌కు భద్రతను తొలుత జెడ్ కేటగిరీ నుంచి వై ప్లస్‌కి తగ్గించగా.. తాజాగా వై ప్లస్ నుంచి ఎక్స్ కేటగిరీకి కుదించేశారు.

# 370 నిర్వీర్యంపై ఇంత రచ్చా?

### తెలంగాణ ఏర్పాటు నాడు చర్చే లేదు.. పార్లమెంట్‌ను బంద్ చేసి చర్చకు కత్తెరేశారే..!

- నాడు నిరసనల్ని మన్మోహన్ తప్పుపట్టలేదా?
- సీఏఏపై అసలు కాంగ్రెస్ వైఖరేంటి?: మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీలోనూ, దేశవ్యాప్తంగానూ సాగుతున్న అల్లర్లు అరాచకానికి చిహ్నమని ప్రధాని నరేంద్ర మోదీ నిశితంగా విమర్శించారు. 'పార్లమెంటు, అసెంబ్లీల్లో తీసుకునే నిర్ణయాలపై రోడ్లెక్కి రోజుల తరబడి నిరసన ప్రదర్శనలు చేయడం అరాచకమే. రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీలు చేసే ఓ చట్టాన్ని ప్రజలు నిరసించి ఆందోళనలకు దిగితే ఏం జరుగుతుందో ఊహించారా? దేశాన్ని ఇలానేనా నడిపేది? దీని వల్ల మాకే కాదు, మీకూ (విపక్షానికీ) ఇబ్బందే. దేశం గురించి అంతా పట్టించుకోవాలి. అందుకే మనల్ని ఇక్కడకు పంపారు. దేశంలోని మెజారిటీ ఎంపీలు ఆమోదించిన చట్టమిది. దాన్ని ఉపసంహరించాలా? ఇది ఆందోళనకరం" అని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై గురువారం పార్లమెంటు ఉభయసభల్లో విడివిడిగా ఇచ్చిన సమాధానంలో ప్రధాని పేర్కొన్నారు. శనివారం నాడు జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా మోదీ ప్రసంగం సాగింది. షాహీన్‌బాగ్‌లో రోజుల తరబడి సాగుతున్న నిరసన హోరును పరోక్షంగా ప్రస్తావించారాయన. సీఏఏను ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోయినవారు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లింల్లో లేనిపోని భ్రమలు, భయాలు కల్పించి ఈ ఆందోళనలు రెచ్చగొడుతున్నారన్నారు. '1950లో నాటి ప్రధాని పండిట్ నెహ్రూ అసోం తొలి ముఖ్యమంత్రి గోపీనాథ్ బార్డోలాయ్‌కి ఓ లేఖ రాశారు. ప్రాణాలర చేత పట్టుకుని పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందువులను శరణార్థులుగా, ముస్లింలను వలసవాదులుగా చూడాలని, ఇద్దరి మధ్యా తారతమ్యం ఉండాలని అందులో పేర్కొన్నారు. అవసరమైతే చట్టాలు కూడా సవరించాలని కోరారు. అంటే నెహ్రూను మతవాది అనగలమా? ఆయన హిందూ రాష్ట్రాన్ని కోరుకున్నారా? కాంగ్రెస్ దీనికి బదులివ్వాలి" అని మోదీ నిలదీశారు.

### తెలంగాణ గుర్తుకు రాలేదా..?

"ఆర్టికల్ 370 నిర్వీర్యంపై అసలు చర్చే జరగలేదని గులాం నబీ ఆజాద్ అన్నారు. నేను అడుగుతున్నా...2014లో యూపీఏ హయాంలో తెలంగాణ ఏర్పాటు జరిగింది. దానిపై సభలో అసలు చర్చ జరిగిందా? పార్లమెంట్‌ను బంద్ చేసి చర్చకు కత్తెరేశారు. ఇపుడు ఆర్టికల్ 370 మీద మాత్రం ఇంత రచ్చ చేస్తున్నారు. ఆనాడు ఏపీ విభజనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగినపుడు ఆ నిరసనను నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ తప్పుపట్టారు. నేడు అవే నిరసనలను ఆయన పార్టీ సమర్థిస్తోంది" అని ప్రధాని దుమ్మెత్తారు. పార్లమెంట్లో సమగ్ర చర్చ జరిగిన తరువాతే కశ్మీర్‌పై నిర్ణయాలకు ఆమోదముద్ర పడిందన్నారు. "ప్రధాని పదవి కావాలన్న ఒకరి (నెహ్రూ) ఆకాంక్ష కోసం దేశ చిత్రపటం (మ్యాపు)లో ఓ గీత గీసి దేశాన్ని విడగొట్టేశారు" అని మోదీ సూటిగా దాడి చేశారు.

### దెబ్బలు తట్టుకునేందుకు సూర్యనమస్కారాలు పెడతా!

"ఈ మధ్య విపక్ష నేత (రాహుల్‌గాంధీ) ఓ మాటన్నారు. 'వచ్చే ఆరునెలలు ఆగండి.. ప్రధాని తన ఇంటి నుంచి బయటకు కూడా రాలేరు. ఉద్యోగాలు కల్పించనందుకు ఈ దేశ యువత ఆయనను కర్రలతో కొడతారు' అన్నారు. దీనికి నా సమాధానం ఒక్కటే. వచ్చే ఆరునెలలూ నా సూర్యనమస్కారాల సంఖ్య పెంచుకుంటా. ఎక్కువగా సూర్యనమస్కారాలు చేస్తే వెన్ను గట్టిపడుతుంది. సిద్ధంగా ఉంటాను" అని చమత్కరించారు. 2 దశాబ్దాలుగా దూషణలను ఎదుర్కొనే ఉంటున్నానని చెప్పారు.

### రాహుల్ పెద్ద ట్యూబ్‌లైట్!

సూర్య నమస్కారాల గురించి ప్రధాని చెప్పడానికి ముందు రాహుల్ లేచి ఏదో చెప్పబోయారు. వెంటనే ప్రధాని కౌంటర్ చేస్తూ- '30-40 నిమిషాలుగా మాట్లాడుతూనే ఉన్నాను. ఆ కరెంట్ ఇప్పటికి చేరిందండీ! చాలా ట్యూబ్ లైట్లు ఇలానే ఉంటాయి' అని వ్యాఖ్యానించారు.

### ఎన్‌పీఆర్ ప్రశ్నల్లో తప్పేంటి..?

జాతీయ పౌర పట్టిక(ఎన్‌పీఆర్)ను కూడా ప్రధాని గట్టిగా సమర్థించుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరైన లబ్ధిదారులకు చేరవేయడానికి ఎన్‌పీఆర్ అప్‌డేషన్ ప్రక్రియ అత్యవసరమని, ఇది, జనగణన రొటీన్‌గా జరిగిపోయే పాలనాపరమైన ప్రక్రియలని పేర్కొన్నారు. 2010లో యూపీఏ హయాంలో తొలిసారి జరిగిందని, 2015లో అప్‌డేషన్ జరిగిందని చెబుతూ- నాడు వివాదాస్పదం కానివి నేడెలా అవుతాయని ప్రశ్నించారు. 'ఎన్‌పీఆర్‌లో అడిగే ప్రశ్నలన్నీ పాలనాపరమైన అవసరాల కోసమే. వీటిని వ్యతిరేకించేవారు పేదల అభ్యున్నతికి వ్యతిరేకులని విమర్శించారు.

### కాంగ్రెస్, ఆప్‌లకు

## పీఎఫ్‌ఐతో లింకు: ఈడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: షాహీన్‌బాగ్‌లో సీఏఏ వ్యతిరేక ఆందోళనకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) నిధులు సమకూరుస్తోందని, ఆ సంస్థ చీఫ్‌తో ఆప్, కాంగ్రెస్ నాయకులు టచ్‌లో ఉన్నారంటూ ఢిల్లీ ఎన్నికలకు రెండు రోజుల ముందు ఈడీ బాంబు వేసింది. దేశంలో సీఏఏ వ్యతిరేక ఆందోళనలకు డబ్బు ఎక్కడ నుంచి అందుతోందన్న విషయంపై దర్యాప్తు నిర్వహించిన ఈడీ... తన నివేదికను సీల్డ్ కవర్‌లో హోం శాఖకు సమర్పించింది. 15 బ్యాంకుల్లోని పీఎఫ్‌ఐ, రెహాబ్ ఇండియా ఫౌండేషన్‌కు సంబంధించిన 73 ఖాతాల్లో రూ.120 కోట్లు డిపాజిట్ అయ్యాయని ఆ నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. పీఎఫ్‌ఐ ఢిల్లీ అధ్యక్షుడు పర్వేజ్ అహ్మద్... ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్, ఉదిత్‌రాజ్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులతో సంప్రదింపులు జరిపారని పేర్కొన్నట్లు సమాచారం.

## 75% ఉద్యోగాలు స్థానికులకే!

- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అమలు: కర్ణాటక

బెంగళూరు, ఫిబ్రవరి 6: కర్ణాటకలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని పరిశ్రమల్లో స్థానికులకు 75% ఉద్యోగాలు కల్పించేలా చట్టం రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. నిరుడు జూలైలో ఆంధ్రప్రదేశ్ తీసుకువచ్చిన స్థానిక చట్టం తరహాలోనే కర్ణాటకలోనూ చట్టం తీసుకురానుంది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఎస్.సురేష్‌కుమార్ ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కన్నడిగులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ ధ్యేయమని ఆయన స్పష్టంచేశారు.

## అభిశంసన నుంచి ట్రంప్‌కు విముక్తి

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై అభిశంసన తీర్మా నం వీగిపోయింది. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగంపై ఆయనకు వ్యతిరేకంగా 48 ఓట్లు పడగా మద్దతుగా 52 మంది ఓటు వేశారు. అమెరికా కాంగ్రెస్ విధులకు ఆటంకం కలిగించారన్న మరో అభియోగం 53-47 ఓట్ల తేడాతో వీగిపోయింది.

# వైసీపీ దాడులు.. మేమెలా బతకాలయ్యా?

- చంద్రబాబుకు బాధితుల మొర

మంగళగిరి, ఫిబ్రవరి 6: 'వైసీపీ వాళ్ల దాడులు ఆగవాయె.. పోలీసులేమో పలకరాయె.. మేమెలా బతకాలయ్యా' అంటూ మాచర్ల నియోజకవర్గం కంభంపాడులో వైసీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన దండు వెంకయ్య టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద కన్నీరుమున్నీరయ్యారు. వైసీపీ వాళ్లు తన ఇంటిపై దాడిచేసి తనను, తన కొడుకును చంపబోయారని గురువారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. 'వైసీపీ కార్యకర్తలు గొడ్డళ్లు, ఇతర మారణాయుధాలతో నా ఇంటిపైబడి విచక్షణరహితంగా దాడిచేశారు. నా కొడుకును తప్పించేందుకు ప్రయత్నించగా నా తల, భుజాలపై నరికారు' అని రక్తమోడుతున్న గాయాలను చూపించి బావురుమన్నారు. మమ్మల్ని బతకనిచ్చేలా లేరయ్యా అంటూ వెంకయ్య విలపించారు. ఈ ఘటనపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. వైసీపీ వాళ్ల అరాచకాలు శ్రుతిమించిపోయాయని.. ఈ ఘటనపై ఎస్పీకి, డీజీపీకి లేఖలు రాస్తామన్నారు.

## సీపీఐ రామకృష్ణపై తుళ్లూరు పీఎస్‌లో ఫిర్యాదు

తుళ్లూరు, ఫిబ్రవరి 6: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం వైసీపీ మహిళా నాయకులు ఫిర్యాదు చేశారు. 'సీఎం జగన్ తుళ్లూరులో కనిపిస్తే మహిళలు ముక్కలు ముక్కలుగా నరికేస్తారు. అందుకే ఆయన పోలీసులను అడ్డుపెట్టుకొని తిరుగుతున్నారు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం వద్ద బుధవారం వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో డిమాండ్ చేశారు.

## జగన్‌పై కేసుల సంగతి 'హిందూ' రామ్‌కు తెలుసు: ఐవైఆర్

అమరావతి, ఫిబ్రవరి6: ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను 'ది హిందూ' గ్రూపు ఎడిటర్ ఎన్.రామ్ ప్రశంసించడాన్ని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు పరోక్షంగా తప్పుబట్టారు. అవినీతిపై పోరాటయోధుడినని చెప్పుకొనే రామ్‌కు.. జగన్‌పై తీవ్ర అవినీతి కేసులు ఉన్న విషయం తెలుసనే తాను అనుకుంటున్నట్లు తెలిపారు. మిగతా సీఎంలు, రాజకీయ నేతలతో పోల్చితే జగన్ అంటే రామ్‌కు ఎందుకో ప్రత్యేక అభిమానమని పేర్కొన్నారు. దీనికి కారణం వారిద్దరికే తెలుసన్నారు.

## 3 రాజధానులకు నో.. 'హిందూ' సర్వేలో జనాభిప్రాయం

అమరావతి, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటును 83 శాతం మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయం తెలివైనదేనా అని 'ది హిందూ బిజినెస్ లైన్' అనే ఆంగ్ల వెబ్‌సైట్ సర్వే చేపట్టింది. డిసెంబరు 28న ఈ ప్రక్రియ మొదలుపెట్టగా.. గురువారం రాత్రి వరకు 3,18,348 మంది దీనిపై స్పందించారు. వీరిలో 83 మంది ప్రజలు జగన్ నిర్ణయం తెలివైనది కాదని తేల్చిచెప్పగా.. మంచిదేనని 16శాతం మంది పేర్కొన్నారు. 'టుడేస్ పోల్' శీర్షికతో ఈ వెబ్‌సైట్ ఎప్పటికప్పుడు ఒక్కో అంశంపై సర్వే నిర్వహిస్తుంటుంది.













| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 163.37 | 48.80 | 288 | 645 | (7 పైసలు) | |
| 41,306.03 | 12,137.95 | 40,498 | 46,155 | 71.18 | 54.85 |
| | | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) | | | |

## రియల్టీ, ఎంఎస్‌ఎంఈలకు మరిన్ని రుణాలు

### బ్యాంకులకు అందుబాటులో అదనపు నిధులు

### సీఆర్ఆర్‌లో మినహాయింపులు ప్రకటించిన ఆర్‌బీఐ



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన చివరి పాలసీలో ఆర్‌బీఐ రెపో రేట్లను యథాతథంగా ఉంచినా బ్యాంకులు ఎంఎస్‌ఎంఈ, ఆటోమొబైల్, హౌసింగ్ విభాగాలకు ఇతోధికంగా రుణ వితరణ చేయడానికి చర్యలు ప్రకటించింది. ఈ మూడు రంగాలకు బ్యాంకులు అందించే రుణాల పరిమాణాన్ని బట్టి వాటికి సీఆర్ఆర్ (ప్రజల నుంచి బ్యాంకులు సేకరించే డిపాజిట్లలో చట్టబద్ధంగా ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేయాల్సిన మొత్తం) నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్టు తెలిపింది. ఈ కొత్త సదుపాయం ఈ ఏడాది జూలై వరకు అందుబాటులో ఉంటుంది. అంటే ఇప్పటి నుంచి జూలై వరకు బ్యాంకులు ఆయా రంగాలకు ఎంత మొత్తంలో రుణాలు అందిస్తే అంత మొత్తంలో సీఆర్ఆర్ నుంచి వాటికి మినహాయింపు వర్తిస్తుంది. ప్రస్తుతం సీఆర్ఆర్ 4 శాతం ఉంది. ద్రవ్య విధాన ప్రయోజనం అందరికీ సమానంగా విస్తరించడానికి నిరంతరం చర్యలు తీసుకోవడంతో పాటు సమాంతరంగా బ్యాంకులు ఉత్పాదక రంగాలకు రుణాలు పెంచేందుకు అవసరమైన మద్దతు ఇవ్వడానికే ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది.

#### బడ్జెట్‌కు కొనసాగింపుగా..

ఆర్‌బీఐ ప్రకటించిన ఈ చర్య ఇటీవల నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌కు కొనసాగింపుగా విశ్లేషకులు అభివర్ణించారు. అలాగే రెపోరేటు నేరుగా తగ్గించకపోయినా మరో రకంగా బ్యాంకులకు అదనపు నిధులు అందుబాటులో ఉంచడం ద్వారా కీలక రంగాలకు రుణవితరణ పెంచి ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీనికి తోడు బ్యాంకులకు ప్రస్తుతం అందిస్తున్న స్వల్పకాలిక రుణ మద్దతును దీర్ఘకాలానికి విస్తరించేందుకు దీర్ఘకాలిక రెపో వసతిని కూడా ప్రకటించింది. రియల్ ఎస్టేట్ రంగానికి ఉత్తేజం కల్పించడం లక్ష్యంగా వాణిజ్య కార్యకలాపాల ప్రారంభ తేదీని (డీసీసీఓ) మరో ఏడాది పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. డెవలపర్ల చేతిలో లేని కారణాల వల్ల ప్రాజెక్టుల్లో జాప్యం అయితే ఆయా ప్రాజెక్టులకు అందించిన రుణాలను నాణ్యత లేని రుణాలుగా వర్గీకరించడానికి కొంత వ్యవధి లభిస్తుంది. ఆర్థిక వ్యవస్థకు వెన్నుగా నిలిచే ఎంఎస్‌ఎంఈల రుణఖాతాల పునర్నిర్మాణ సదుపాయాన్ని కూడా 2021 మార్చి 31 వరకు ఏడాది కాలం పొడిగించారు. అంటే 2019 జనవరి నాటికి ప్రమాణాత్మక రుణాలుగా ఉండి ఆ తర్వాత బకాయి పడిన వాటిని నాణ్యత లేని రుణాలుగా వర్గీకరించడం ఏడాది పాటు వాయిదా పడుతుంది. 2020 డిసెంబరు 31 లోగా ఆ ఎంఎస్‌ఎంఈలు ఈ రుణాల ఏకకాల పునర్నిర్మాణం చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన సవివరమైన మార్గదర్శకాలు త్వరలో జారీ చేయనున్నట్టు ప్రకటించింది.

#### దీర్ఘకాలిక రెపో రూ.లక్ష కోట్లు

ఆర్‌బీఐ ప్రకటించే రెపో రేట్ల ప్రయోజనం బ్యాంకులు తక్షణం కస్టమర్లకు వర్తింపచేయడానికి బ్యాంకులకు ఆర్‌బీఐ రూ.లక్ష కోట్ల దీర్ఘకాలిక రెపో వసతిని ప్రకటించింది. ఈ దీర్ఘకాలిక రెపో కాలపరిమితి ఏడాది నుంచి మూడేళ్లకు విస్తరిస్తుంది. ఈ నెల 15వ తేదీ నుంచే ఇవి అమలులోకి వస్తాయి. సాధారణ రెపో వసతి ఒక రోజు నుంచి 15 రోజులే ఉండగా ప్రస్తుతం ఆర్‌బీఐ వర్తింపచేస్తున్న దీర్ఘకాలిక రెపో కాలపరిమితి 56 రోజులే ఉంది. కాగా ఏడాది నుంచి మూడేళ్ల విస్తరణ గల రెపో వసతి ద్రవ్య విధాన ప్రయోజనాలు మరింత త్వరితంగా ప్రజలకు అందింపచేయడంలో ఒక కొత్త శకాన్ని ఆవిష్కరిస్తుందని భావిస్తున్నట్టు దాస్ చెప్పారు.

## రేటు మారలేదు

### రెపో 5.15 శాతం.. వృద్ధి రేటు అంచనా 6 శాతం

### నాలుగో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం అదుపు: ఆర్‌బీఐ



ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

ముంబై: అందరూ ఊహించినట్టుగానే రిజర్వ్ బ్యాంక్ రెపో రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో రెపో రేటు (బ్యాంకులకు వర్తించే స్వల్పకాలిక వడ్డీ రేటు) 5.15 శాతం వద్ద యథాతథంగా ఉంది. ద్రవ్యోల్బణం ఇటీవల కాలంలో ఎగువకు కదులుతున్నప్పటికీ ఆర్థిక వృద్ధిరేటులో భారీ క్షీణత కారణంగా ఆర్‌బీఐ ఈ వైఖరి అనుసరించింది. వృద్ధికి ఊతం ఇవ్వడానికి భవిష్యత్తులో మరింతగా రేట్లు తగ్గించడానికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించింది. ఆర్‌బీఐ సారథ్యంలోని మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశం అనంతరం గురువారం మధ్యాహ్నం గవర్నర్ శక్తికాంత దాస్ ఈ ఆర్థిక సంవత్సరానికి చివరి ద్వైమాసిక పాలసీ విడుదల చేశారు. డిసెంబరు పాలసీలో కూడా యథాతథ స్థితినే కొనసాగించింది. అంతకు ముందు వరుసగా ఐదు పాలసీల్లో 1.35 శాతం తగ్గించిన విషయం విదితమే.

#### ఆర్‌బీఐ ప్రకటించిన అంచనాలు

**ద్రవ్యోల్బణం :** దేశవ్యాప్తంగా పాలు, పప్పు దినుసుల ధరలు పెరిగిన నేపథ్యంలో నాలుగో త్రైమాసికం రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను 6.5 శాతానికి పెంచింది. దేశంలో ధరల పరిస్థితి అత్యంత అనిశ్చితంగా ఉన్నట్టు పేర్కొంది. అయితే ఖరీఫ్ సీజన్‌లో చివరి పంట, రబీ పంట మార్కెట్‌లోకి రావడంతో ఆహార ద్రవ్యోల్బణం ఈ త్రైమాసికంలో డిసెంబరు గరిష్ఠ స్థాయిల నుంచి దిగివస్తుందని తెలిపింది. కాగా 2020-21 ప్రథమార్థంలో 5.4-5 శాతం, ద్వితీయార్థంలో 3.2 శాతంగా ఉంటుందని అంచనా వేసింది.

**చెక్ ట్రంకేషన్ వ్యవస్థ :** దేశంలో చెక్కుల క్లియరెన్స్ మరింత వేగంగా జరిగేలా చేయడానికి రాబోయే సెప్టెంబరు నుంచి చెక్ ట్రంకేషన్ విధానాన్ని (సీటీఎస్) దేశవ్యాప్తంగా అమలుపరచాలని నిర్ణయించింది. 2010లో ప్రారంభించిన సీటీఎస్ ప్రస్తుతం కొన్ని ప్రధాన నగరాల్లోనే అమలులో ఉంది.

**వృద్ధిరేటు :** రాబోయే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6 శాతం ఉండవచ్చని అంచనా వేసింది. ఆర్థిక సర్వే నివేదికలో ప్రకటించిన అంచనాలో దిగువ స్థాయి ఇది. ఆర్థిక వ్యవస్థలో బలహీనత, ఉత్పత్తిలో వ్యత్యాసాలు కొనసాగవచ్చునని పేర్కొంది. ప్రైవేటు వినియోగం, విదేశీ పరిణామాలు వృద్ధి రేటును ప్రభావితం చేసే అంశాలని పేర్కొంది.

**డిజిటల్ లావాదేవీల సూచీ :** దేశంలో డిజిటల్ చెల్లింపులు త్వరితగతిన పెరుగుతున్నందువల్ల త్వరలో డిజిటల్ చెల్లింపుల సూచీని (డీపీఐ) ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. ఈ తరహా చెల్లింపుల్లో జోరును పరిగణనలోకి తీసుకుని ఈ విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థల్లో క్రమశిక్షణ తీసుకురావడానికి స్వయం నియంత్రణ వ్యవస్థ ఒకటి అవసరమని పేర్కొంది. వచ్చే ఏప్రిల్ నాటికి ఇందుకు సంబంధించిన విధివిధానాలు కూడా ప్రకటించనుంది.

#### డిపాజిట్ బీమా

ప్రభుత్వం బడ్జెట్‌లో డిపాజిట్ బీమాను లక్ష రూపాయల నుంచి రూ.5 లక్షలకు పెంచినందు వల్ల బ్యాంకులపై ప్రభావం ఏమీ ఉండబోదని శక్తికాంతదాస్ అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో పీఎంసీ బ్యాంకు సంక్షోభంతో పాటు పలు ఎన్‌బీఎఫ్‌సీలు డిపాజిటర్లకు సొమ్ము చెల్లించలేని సంకట స్థితిలో పడిన నేపథ్యంలో ఆర్‌బీఐ సారథ్యంలోని డీఐసీజీసీ ద్వారా అందించే బీమా పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచారు. ఈ కారణంగా ప్రతీ రూ.100పై ప్రీమియం 10 పైసల నుంచి 12 పైసలకు పెరుగుతుందని, ఇది బ్యాంకుల పద్దులను దెబ్బ తీసేంత భారం ఏమీ కాదని డిప్యూటీ గవర్నర్ బీపీ కనుంగో చెప్పారు.

#### కరోనా వైరస్

దేశంలో ప్రాణాంతకమైన కరోనా వైరస్ త్వరిత గతిన విస్తరిస్తున్న నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనుబంధ ప్రణాళికలు రూపొందించాలని దాస్ సూచించారు. అయితే దాని ప్రభావం ఎంత అన్న విషయంలో అనిశ్చితి ఉన్నదని ఆయన చెప్పారు.

## ఐటీ వెబ్‌సైట్‌లో ఈ-కాలిక్యులేటర్





### శ్లాబుల సందేహాలకు సమాధానం

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపు కోసం పాత శ్లాబు విధానం ఎంచుకోవాలా? కొత్త శ్లాబుల విధానం ఎంచుకోవాలా? ఏ విధానం ఎంచుకుంటే పన్ను పోటు తగ్గుతుంది? ప్రస్తుతం లక్షలాది మంది ఐటీ చెల్లింపుదారుల్ని వేధిస్తున్న ప్రశ్న. ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ఐటీ శాఖ తన వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా 'ఈ-కాలిక్యులేటర్' ప్రవేశపెట్టింది. పన్ను చెల్లింపుదారులు incometaxindiaefiling.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వయసు, వార్షిక స్థూల ఆదాయం, ఆదాయ వనరులు, అనుమతించిన మినహాయింపులు, తగ్గింపులు ఎంటర్ చేసి క్లిక్ చేయాలి. అప్పుడు వారి పన్ను చెల్లింపు ఆదాయంపై పాత విధానం ప్రకారం ఎంత పన్ను భారం పడుతుంది? కొత్త విధానం ఎంచుకుంటే ఎంత పన్ను పోటు పడుతుందనే విషయం కంప్యూటర్ మానిటర్‌పై ప్రత్యక్షమవుతుంది. మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త శ్లాబుల ఐటీ విధానం 2020-21 ఆర్థిక సంవత్సరం అమల్లోకి రానుంది. అయిదు, పది, 30 శాతం శ్లాబులు ఉండే పాత విధానం ఎంచుకుంటే రూ.50,000 ప్రామాణిక తగ్గింపుతో పాటు సెక్షన్ 80సీ కింద వివిధ పెట్టుబడుల్లో పెట్టే రూ.1.5 లక్షల పెట్టుబడులకు మినహాయింపు లభిస్తుంది. కొత్త విధానం ఎంచుకుంటే మాత్రం ఈ ప్రయోజనాలేవీ లభించవు.

## ఆధార్‌తో తక్షణమే ఈ-పాన్

### ఈ నెలలోనే ప్రారంభం





న్యూఢిల్లీ: ఆధార్ వివరాలు అందించడం ద్వారా ఆన్‌లైన్ పాన్ కార్డులను తక్షణమే జారీ చేసే సదుపాయాన్ని ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్టు రెవెన్యూ సెక్రటరీ అజయ్ భూషణ్ పాండే తెలిపారు. "ఈ-పాన్‌ను అందించడానికి సంబంధించిన వ్యవస్థ సిద్ధమైంది. ఈ నెలలోనే ఇది అందుబాటులోకి వస్తుంది" అని ఆయన చెప్పారు. వ్యక్తులు ఆదాయ పన్ను శాఖ వెబ్‌సైట్‌ను సందర్శించి వారి ఆధార్ నెంబర్‌ను ఎంటర్ చేయగానే ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కు వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుందని, దీని ద్వారా ఆధార్ వివరాల పరిశీలన జరుగుతుందని ఆయన చెప్పారు. ఆ తర్వాత తక్షణమే పాన్ కేటాయింపు జరుగుతుందని, ఆ తర్వాత వ్యక్తులు తమ ఈ-పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా పన్ను చెల్లింపుదారులు దరఖాస్తు ఫారాలను నింపి ఆదాయ పన్ను శాఖకు సమర్పించే ఇబ్బంది తప్పుతుందని, ఇదే సమయంలో పన్ను శాఖ అధికారులు పన్ను చెల్లింపుదారుల ఇంటికి పాన్ కార్డులను పంపించే ప్రక్రియ సులభం అవుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వం పాన్-ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 30.75 కోట్లకు పైగా పాన్‌లు ఆధార్‌తో అనుసంధానమయ్యాయి. 2020 జనవరి 27 నాటికి ఇంకా 17.58 కోట్ల పాన్‌లు ఆధార్‌తో అనుసంధానం కావాల్సి ఉంది. పాన్-ఆధార్ అనుసంధానానికి ఈ ఏడాది మార్చి 31 చివరి గడువు.

ప్రతిపాదిత టాక్స్‌పేయర్ చార్టర్ గురించి పాండే మాట్లాడుతూ.. మొత్తం పన్ను చట్టాల్లో పన్ను చెల్లింపుదారుల బాధ్యత గురించి తెలియజేస్తాయని, అయితే పన్ను అడ్మినిస్ట్రేషన్ బాధ్యతల గురించి మాత్రం పేర్కొన్నలేదన్నారు. ఇప్పుడు చార్టర్‌ను పన్ను అధికారి పాటించకపోతే వారికి జరిమానా విధిస్తారని తెలిపారు. విశ్వసనీయ ఆధారిత వ్యవస్థ ఉండాలన్నదే ఈ ప్రతిపాదన లక్ష్యమన్నారు. నిజాయితీగా పన్ను చెల్లించే వారు వేధింపులకు గురికావద్దని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారానే ఎక్కువ వరకు సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం జరుగుతోందన్నారు.

## నిరోధం 12160

**టెక్ వ్యూ**

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై 12160 వరకు వెళ్లింది. సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన అనిశ్చితంగా ముగిసింది. గత నాలుగు రోజుల్లో నిఫ్టీ వి షేప్‌లో ఎగువకు రివర్సల్ సాధించింది. బేరిష్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీలో ఉంది. 20, 50 డిఎంఏలను కూడా దాటినందు వల్ల కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే ఈ సూచీ కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఓవర్‌సోల్డ్ స్థితి కూడా సద్దుబాటవుతోంది.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 12160 మద్దతు : 12080**

- మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 12160 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 12220, 12300.
- మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 12080 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 12000.

■ వి.సుందర్ రాజా

## మిడ్‌సెషన్ మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** మాఘ శుక్ల త్రయోదశి
**నక్షత్రం :** పునర్వసు
**అప్రమత్తం :** రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 12.44**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 11 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.55 వరకు బలంగా నిలిచి తదుపరి ముగింపు 2.55 వరకు నిస్తేజంగాను, తిరిగి చివరిలో మరోసారి మెరుగ్గాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 11 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1. 15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే తిరిగి షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.45 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 12180, 12215**
**మద్దతు స్థాయిలు : 12100, 12065**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72 | విజయవాడ | 77 |
| వరంగల్ | 72 | గుంటూరు | 77 |
| మహబూబ్‌నగర్ | 72 | ఒంగోలు | 79 |
| కరీంనగర్ | 73 | చిత్తూరు | 75 |
| కర్నూలు | 72 | నెల్లూరు | 75 |
| విశాఖపట్నం | 65 | అనంతపురం | 79 |
| గోదావరి | 71 | | |

## వాహన కనువిందు!

### ఆటో ఎక్స్‌పోలో మరిన్ని కొత్త మోడళ్లు

*గ్రేటర్ నోయిడా: సరికొత్త వాహనాలతో ఆటో ఎక్స్‌పో కళకళలాడుతోంది. మారుతి సుజుకీ, మెర్సిడెస్ బెంజ్, ఫోక్స్ వ్యాగన్, పియాజియో తదితర ఆటో కంపెనీలు గురువారం మరిన్ని కొత్త మోడళ్లను ఆవిష్కరించాయి. ప్రస్తుతం మీడియా కోసం ప్రదర్శిస్తున్న కొత్త వాహనాలను వీక్షించేందుకు సందర్శకులను శుక్రవారం నుంచి అనుమతించనున్నారు.*



#### పెట్రోల్ ఇంజన్‌తో మారుతీ బ్రెజ్జా

దేశంలో అతిపెద్ద కార్ల తయారీదారు మారుతీ సుజుకీ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ విటారా బ్రెజ్జాలో బీఎస్-6 ప్రమాణాలతో కూడిన పెట్రోల్ ఇంజన్ వేరియంట్‌ను ప్రదర్శించింది. ఈ కారు బుకింగ్‌ను కూడా ప్రారంభించింది. 2016లో మార్కెట్లోకి ప్రవేశపెట్టిన విటారా బ్రెజ్జా డీజిల్ ఇంజన్ కార్లను 5 లక్షల యూనిట్లకు పైగా విక్రయించింది.



#### హ్యుండయ్ కొత్త క్రెటా

హ్యుండయ్ ఎస్‌యూవీ క్రెటాలో కొత్త వెర్షన్‌ను ఆవిష్కరించింది. మార్చిలో ఈ ఎస్‌యూవీని లాంఛనంగా విడుదల చేయనుంది. ప్రీమియం ఫీచర్లు, స్మార్ట్ టెక్నాలజీలతో దీన్ని రూపొందించింది.



#### జేబీఎం కొత్త ఈ-బస్సులు

భారత్‌కు చెందిన జేబీఎం ఆటో లిమిటెడ్.. ఎకో లైఫ్ ఈ9, ఈ12 పేర్లతో రెండు కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రదర్శించింది. ఈ బస్సులు పూర్తి చార్జింగ్‌తో 125-150 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి.



#### ఫోక్స్‌వ్యాగన్ ఐడీ.క్రాజ్

జర్మన్ ఆటో కంపెనీ ఫోక్స్‌వ్యాగన్.. ఐడీ.క్రాజ్ పేరుతో కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించింది. రేస్ పోలో మోడల్‌ను సైతం ప్రదర్శనకు ఉంచింది.



#### ఒలెక్ట్రా-బీవైడీ ఎలక్ట్రిక్ బస్

దేశంలోనే తొలి ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ బస్‌ను విడుదల చేసింది. కొత్తగా ప్రవేశపెట్టిన 'సీ9' బస్సు ఒక సారి ఛార్జ్ చేస్తే 300 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మోపిదేవి వెంకటరమణ

## ఐదు మేజర్ పోర్టులు

- 300 కోట్లతో నిర్మిస్తాం: మంత్రి మోపిదేవి
- ఆక్వా ఎక్స్ ఇండియా సదస్సు ప్రారంభం

కాళ్ళ: రాష్ట్రంలో రూ.300 కోట్లతో ఐదు మేజర్ పోర్టులను నిర్మించనున్నట్టు మత్స్యశాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ తెలిపారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళ మండలం పెదఅమిరంలో ఆక్వాఎక్స్ ఇండియా-2020 సదస్సును మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె, ప్రకాశం జిల్లా ఓడరేవు, గుంటూరు జిల్లా నిజాంపట్నం, కృష్ణా జిల్లా మచిలీపట్నం, తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడ ప్రాంతాల్లో పోర్టులు నిర్మిస్తున్నామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలోని బియ్యపుతిప్ప వద్ద సుమారు రూ.20కోట్లతో మీడియం జెట్టీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగతా జిల్లాల్లోనూ ఫిషింగ్ జెట్టీలు నిర్మిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో ఎంపెడా సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ గుర్తించిన ప్రాంతాల్లో 45 ఆక్వా ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| 6వ తేదీకి.. | | విజయవాడ | 325 |
| హైదరాబాద్ | 315 | విశాఖపట్నం | 375 |
| 7వ తేదీకి.. | | వరంగల్ | 318 |
| చిత్తూరు | 373 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 325 | | |

**బులియన్**

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,460 | --- | 41,750 | 40,650 | 40,550 |
| క్రితం ముగింపు | 40,730 | 40,800 | 41,490 | 40,600 | 40,290 |
| 22 క్యారెట్లు | 38,510 | --- | 38,410 | 37,600 | 38,620 |
| క్రితం ముగింపు | 38,830 | 37,800 | 38,170 | 37,550 | 38,370 |
| వెండి (కిలో) | 45,900 | --- | 47,500 | 47,300 | 49,800 |
| క్రితం ముగింపు | 45,900 | 47,500 | 47,000 | 47,300 | 49,400 |

## ఐబీఏ సీనియర్ అడ్వైజర్‌గా కక్కెర వెంకటేశ్వర్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) సీనియర్ అడ్వైజర్‌గా కక్కెర వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్, బ్యాంకింగ్ టెక్నికల్ విభాగంలో మూడేళ్ల పాటు సీనియర్ అడ్వైజర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఉప్పుమాగలూరుకు చెందిన వెంకటేశ్వర్లు 1982లో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లో డీఆర్ఓగా చేరారు. 2004 నుంచి బీఓబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకింగ్ అప్లికేషన్స్ విభాగంలో చీఫ్ మేనేజర్‌గా కొనసాగారు. బీఓబీని పూర్తిగా డిజిటలైజేషన్ చేయటంతో కీలక పాత్ర పోషించారు. గత ఏడాది ఆగస్టులో జీఎం చీఫ్ కో-ఆర్డినేటర్ హోదాలో వెంకటేశ్వర్లు పదవీ విరమణ చేశారు. ఇటీవల ఐబీఏ సీనియర్ అడ్వైజరీ కోసం ఆహ్వానించగా వివిధ బ్యాంకులలో జీఎం హోదాల్లో రిటైరైన వారు దరఖాస్తు చేసుకున్నారు. వెంకటేశ్వర్లుకు సీనియర్ అడ్వైజర్ హోదా లభించింది.

## స్వల్పంగా తగ్గిన కెనరా బ్యాంకు వడ్డీ రేట్లు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. నిధుల సేకరణ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను 25 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. తగ్గించిన రేట్లు ఈ నెల మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. తాజా తగ్గింపుతో ఓవర్‌నైట్ ఎంసిఎల్ఆర్ 7.65 శాతం, నెల రోజుల కాలపరిమితి గల రుణాలపై వడ్డీ రేటు 7.65 శాతం, మూడు నెలల వ్యవధితో కూడిన వడ్డీ రేటు 7.95 శాతం, ఆరు నెలల కాల వ్యవధి కలిగిన రుణాలపై వడ్డీ రేటు 8.10 శాతం, ఏడాది కాలపరిమితి గల రుణాలపై వడ్డీ రేటు 8.2 శాతంగా ఉంటాయని కెనరా బ్యాంక్ పేర్కొంది. కాగా రిటైల్ రుణాలకు సంబంధించి రెపో రేటు అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్), ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చే రుణాలపై వడ్డీ రేటు 8.05 శాతంగా ఉంటుందని తెలిపింది.

## జీసీపీఎల్ నుంచి గుడ్‌నైట్ గోల్డ్ ఫ్లాష్



ముంబై : గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్).. మార్కెట్లోకి సరికొత్త లిక్విడ్ వేపోరైజర్ 'గుడ్‌నైట్ గోల్డ్ ఫ్లాష్'ను తీసుకువచ్చింది. దోమల బారి నుంచి తప్పించుకునేందుకు ఫ్లాష్ వేపోర్స్‌తో తీసుకువచ్చిన తొలి వేపోరైజర్ ఇదని జీసీపీఎల్ సీఈఓ సునీల్ కటారియా తెలిపారు. ప్రత్యేకమైన చిప్, ఆటోమేటిక్‌గా ఫ్లాష్ మెషిన్ స్విచెస్‌తో దీన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. గోల్డ్ ఫ్లాష్ మెషిన్ ధర రూ.89 కాగా రీఫిల్ ధర రూ.75ని జీసీపీఎల్ తెలిపింది.

**వీ హబ్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ :** ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన వీ హబ్ స్టార్టప్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. గురువారం ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ మార్చి 3న ముగియనుంది.

**డెయిరీ డే:** కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఐస్‌క్రీమ్ బ్రాండ్ డెయిరీ డే.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి ప్రవేశించింది. రాష్ట్రంలోని రెండు వేల ఔట్‌లెట్లలో ఐస్‌క్రీమ్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. కార్యకలాపాల విస్తరణ కోసం గడచిన రెండేళ్లలో రూ.80 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు తెలిపింది.

# ‘కియ’ కలకలం!



## ఎక్కడికీ వెళ్లడం లేదు

- రాయిటర్స్ కథనంలో వాస్తవం లేదు
- ఆ మీడియా కట్టడిపై యోచన: బుగ్గన
- హోదాపై ఏపీ వ్యక్తిలా ఆలోచించండి
- ఎంపీ జీవీఎల్‌కు ఆర్థికమంత్రి హితవు



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కియ ప్లాంట్ తమిళనాడుకు తరలి వెళుతుందంటూ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్‌లో వచ్చిన కథనం అవాస్తవమని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ‘రాయిటర్స్‌లో వచ్చిన కథనాన్ని సోషల్ మీడియాలో బాగా పాపులర్ చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నామ’ని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అతలాకుతలంగా ఉందన్న ప్రతిపక్షనేత చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబు హయాంలో కంటే ఇప్పుడే జీఎస్టీ వసూళ్లు పెరిగాయి కానీ, ఆశించినస్థాయిలో వృద్ధి లేదని చెప్పారు. తాము చేస్తున్న అప్పులకు కేంద్రం ఆమోదం ఉందని చెప్పారు. “ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు. ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కింద తెచ్చిన రూ.10,000 కోట్లను ఆయా కార్పొరేషన్ల అప్పుల రీపేమెంట్‌కు వినియోగిస్తున్నాం. పెండింగ్ బిల్లులను ప్రాధాన్యక్రమంలో చెల్లిస్తున్నాం. అయినా సమస్య తీవ్రంగానే ఉంది” అని చెప్పారు. బడ్జెట్ సమావేశాలను మార్చిలో నిర్వహించాలనుకుంటున్నట్టు బుగ్గన తెలిపారు. కాగా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే డిమాండ్‌కు తాము కట్టుబడి ఉన్నామని బుగ్గన స్పష్టం చేశారు. హోదా అడిగితే చంద్రబాబుకు పట్టినగతే సీఎం జగన్‌కూ పడుతుందంటూ బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ‘జీవీఎల్ ఏపీ వ్యక్తి అయి ఉండి హోదాకు వ్యతిరేకంగా మాట్లాడడం సమంజసం కాదు. విభజన నష్టం గురించి ఏపీ వ్యక్తి గా ఆయన ఆలోచించాలి’ అని బుగ్గన హితవు పలికారు.

## తరలిపోతోందని రాయిటర్స్ కథనం

- తమిళనాడుతో చర్చిస్తోందని వెల్లడి
- రాష్ట్రం నుంచి పార్లమెంటుదాకా పెద్దఎత్తున విపక్షాల విమర్శలు
- ఖండించిన ప్రభుత్వం
- కియ మోటార్స్ యాజమాన్యంతో మాట్లాడిన బుగ్గన, మేకపాటి

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ప్రతిష్ఠాత్మక కియ మోటార్స్ తరలిపోతుందంటూ రాయిటర్స్ వార్తా సంస్థ ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. అనంతపురం జిల్లాలో వేల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ.. భారీ పెట్టుబడితో నడుస్తున్న కియ మోటార్స్ తమిళనాడుకు తరలిపోతుందన్న ఈ కథనం రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. జగన్ హయాంలో పెట్టుబడులు వెనక్కి పోతున్నాయని రాష్ట్రం నుంచి అటు పార్లమెంటు దాకా విపక్షాలు విరుచుకుపడడంతో ఈ కథనాన్ని రాష్ట్రప్రభుత్వం, కియ ఖండించాయి. దక్షిణ కొరియాకు చెందిన ఈ పరిశ్రమ కొంతకాలం క్రితమే రాష్ట్రంలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించింది. ‘1.1 బిలియన్ డాలర్ల విలువైన ఈ ప్రాజెక్టు పొరుగు రాష్ట్రం తమిళనాడుకు తరలిపోనుంది. ఆంధ్ర ప్రభుత్వ విధానాలు మారడంతో ఈ నిర్ణయం తీసుకున్న కియ మోటార్స్... తరలింపుపై తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది..’ అని రాయిటర్స్ సంస్థ ప్రత్యేక కథనం రాసింది. ఇది గురువారం నాడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. రాష్ట్రం మొత్తం విస్మయానికి లోనైంది. ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక, పరిశ్రమల మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి నేరుగా కియ యాజమాన్యంతో మాట్లాడారు. అనంతరం కియ ఎక్కడకూ వెళ్లడం లేదని మీడియాకు వెల్లడించారు. కియను కూడా ఆ మేరకు ప్రకటన ఇవ్వాలని అడిగినట్లు తెలిసింది. దాంతో ఆ సంస్థ తాము ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగి ఉన్నామని, ప్లాంటును తరలించే ఆలోచనేదీ లేదని స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తమిళనాడు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు సమాచారం. కియ విషయంలో అలాంటి చర్చలేమైనా జరిగాయా అని ఆరా తీశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రచారం తమిళనాడు ప్రభుత్వ దృష్టికి కూడా వెళ్లడంతో.. కియ తమతో చర్చలు జరపలేదంటూ ఆ రాష్ట్రం కూడా ప్రకటించాల్సిన పరిస్థితి తలెత్తింది.

### కియకు ఎందుకింత ప్రాధాన్యం?

రాయిటర్స్ కథనంతో ఒకేసారి ప్రజలు, ప్రభుత్వ పెద్దలు కూడా ఉలిక్కిపడ్డారు. కియ రూ.13,500 కోట్ల పెట్టుబడితో.. 18 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఏటా 3 లక్షల కార్ల ఉత్పత్తి చేసే దిశగా ముందుకు వెళ్తోంది. అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో కియ రావడం అప్పట్లో సంచలనం. వాస్తవానికి కియ ప్రతినిధులు తమిళనాడును తమ మొదటి ప్రాధాన్యంగా చూశారు. లేదంటే గుజరాత్‌లో పెట్టాలనుకున్నారు. అయితే నాటి సీఎం చంద్రబాబు వారిని ఒప్పించి రాష్ట్రానికి తీసుకొచ్చి.. అనంతపురంలో పెట్టేలా చేశారు. ఒకదశలో శ్రీసిటీలో పెట్టాలన్న ప్రతిపాదనా వచ్చింది. శ్రీసిటీ సెజ్ అప్పటికే అభివృద్ధి చెంది ఉండడం, పైగా కియ లాంటి పెద్ద పరిశ్రమ అనంతపురంలో వస్తే.. ఆ జిల్లా అభివృద్ధికి ఉపకరించడంతో పాటు.. ఒక కొత్త ప్రాంతాన్ని ఆటోమొబైల్ తయారీ పరిశ్రమల కేంద్రంగా చేసినట్లు అవుతుందని చంద్రబాబు ప్రభుత్వం ఆలోచించింది. అసలు కియ పరిశ్రమ అంటే అది ఒక కంపెనీ మాత్రమే కాదు. అనుబంధ పరిశ్రమలు కూడా తరలివస్తాయి. ఇప్పటికే కొన్ని వచ్చాయి కూడా. కియ ఇక్కడుంటే మరిన్ని దిగ్గజ కంపెనీలను ఆకర్షించేందుకు మార్గం సుగమమవుతుంది. అందుకే కియకు అంత ప్రాధాన్యం. దీనివల్లే రాయిటర్స్ సంస్థ రాసిన కథనంపై ఇటు రాష్ట్రప్రభుత్వం, అటు కియ మోటార్స్, తమిళనాడు ప్రభుత్వం అన్నీ చకచకా స్పందించాయని అంటున్నారు.



భూముల మ్యాపులు పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ ప్రతినిధులు

## దొనకొండలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు!

- భూములు పరిశీలించిన నెడ్‌క్యాప్ బృందం

దొనకొండ, ఫిబ్రవరి 6: వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం ప్రకాశం జిల్లా దొనకొండ ప్రాంతంలో ప్రభుత్వ భూములు అనుకూలంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(నెడ్‌క్యాప్) బృందం ధ్రువీకరించింది. నెడ్‌క్యాప్ హైలెవల్ టెక్నికల్ కమిటీ డీజీఎం జి.బి.జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జి.బుచ్చిరాజు బృందం మండలంలోని వద్దిపాడు, పోచమక్కపల్లి, రుద్రసముద్రంలోని ప్రభుత్వ భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్, మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి ఆదేశాల మేరకు దొనకొండ ప్రాంతంలో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. 5వేల ఎకరాల్లో రూ.4వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామన్నారు. ప్రాజెక్టులో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు. రెండేళ్లలో పూర్తిస్థాయిలో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ప్రాజెక్టు పరిధిలో దాదాపు 10వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

## పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- లఖ్‌నవూ డిఫెన్స్ ఎక్స్‌పోలో మంత్రి మేకపాటి
- బోయింగ్, ఎయిర్‌బస్ కంపెనీలతో చర్చలు
- ‘ఉన్నతి’లో విశాఖ మహిళలకు రోల్స్‌రాయిస్ శిక్షణ

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లఖ్‌నవూలో జరుగుతున్న డిఫెన్స్ ఎక్స్‌పో సదస్సులో పాల్గొన్న పలు దిగ్గజకంపెనీల సీఈవోలతో పరిశ్రమల శాఖమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. బోయింగ్, లాఖీద్ మార్టిన్, బీఏఈ సిస్టమ్స్, ఎయిర్‌బస్, జాకోబ్స్ తదితర కంపెనీల సీఈవోలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. పెట్టుబడిదారులకు పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. ఆతర్వాత రోల్స్ రాయిస్ దక్షిణాసియా అధ్యక్షుడు కిశోర్ జయరామన్‌తో ముఖాముఖి భేటీఅయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యేందుకు జయరామన్ ఆసక్తి చూపించారు. తాము త్వరలో చేపట్టే ఉన్నతి కార్యక్రమం ద్వారా విశాఖ, ముంబైకి చెందిన 100మంది స్థానిక మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణితో కూడా మేకపాటి చర్చించారు. ఈ కంపెనీ ఇప్పటికే నెల్లూరులో రూ.1200కోట్లతో ఆటోమొబైల్ విడిభాగాల తయారీ ప్లాంటు నిర్వహిస్తోంది. రక్షణ, రవాణా రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల దిశగా తమ ఆలోచనలను కంపెనీ ప్రతినిధులు మంత్రితో పంచుకున్నారు. ఇండో-అమెరికన్ రక్షణ సెమినార్‌లోనూ మంత్రి ప్రసంగించారు. ఇటీవల ఇండో-యూఎస్ భాగస్వామ్యంలో విశాఖలో సంయుక్త విన్యాసాలు నిర్వహించారని గుర్తుచేశారు.

### జనగణన డైరెక్టర్‌గా జె.సత్యనారాయణ

కేంద్ర సెన్సస్ డైరెక్టర్‌గా జె.సత్యనారాయణ నియమితులయ్యారు. ఎస్సీ సహకార ఆర్థిక కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఆయన్ను రిలీవ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇకనుంచీ కేంద్ర సర్వీసులో డిప్యూటీ కార్యదర్శి హోదాలో సెన్సస్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తారని పేర్కొంది.

# తరలింపుపై జోక్యం చేసుకోండి



- రాష్ట్రానికి ఆ సంస్థ పెద్ద ఇన్వెస్టర్
- మిలీనియం టవర్ ఖాళీచేయాలని ఐటీ సంస్థలకు నోటీసులు
- కంపెనీలన్నీ పోతే రాష్ట్రం ఏం కావాలి?
- లోక్‌సభలో రామ్మోహన్ వినతి
- కియ ఎక్కడకూ తరలడం లేదు
- వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి కియ పరిశ్రమ తరలిపోనుందన్న ప్రచారం లోక్‌సభలో దుమారం లేపింది. టీడీపీ, వైసీపీ ఎంపీల మధ్య వాగ్వాదం జరిగింది. గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో తొలుత టీడీపీ లోక్‌సభాపక్ష నేత రామ్మోహన్‌నాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ వ్యవహారంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని, రాష్ట్ర నిర్ణయాన్ని ప్రశ్నించాలని కోరారు. ‘కియ మోటార్స్ ఆంధ్రకు పెద్ద పెట్టుబడిదారు. 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. గత ప్రభుత్వం దీనిని తీసుకొచ్చింది. ఇప్పుడా సంస్థ తరలిపోతుంది. ఇప్పటికే ఆ సంస్థ ఆన్సిలరీ యూనిట్‌ను వేరే రాష్ట్రానికి తరలించింది. ఇప్పుడు ప్రధాన యూనిట్‌ను పొరుగు రాష్ట్రానికి తరలించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి విధానాలు అనుసరిస్తే ఆంధ్ర పరిస్థితి ఏం కావాలి..’ అని ఆవేదన వ్యక్తంచేశారు. ఇవి అంతర్జాతీయ పెట్టుబడులు కాబట్టి కేంద్రం బాధ్యత తీసుకోవాలని, ఇది దేశానికి సంబంధించిన అంశమని స్పష్టంచేశారు. వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అప్పటి సీఎం చంద్రబాబు అనంతపురం జిల్లాకు కియ పరిశ్రమను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఐటీ రంగం అభివృద్ధికి విశాఖలో మిలీనియం టవర్ నిర్మించారని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ టవర్‌లో ఉన్న సంస్థలకు మార్చి 30లోగా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిందని చెప్పారు. 18వేల మంది ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తానేమీ తప్పుడు ఆరోపణలు చేయడం లేదని, వార్తాపత్రికల్లో వచ్చిందని స్పష్టం చేశారు. ఈ సమయంలో వైసీపీ ఎంపీలు పదేపదే అడ్డుకోడానికి ప్రయత్నించారు. వైసీపీ సభ్యుడు గోరంట్ల మాధవ్.. రామ్మోహన్ ముందుకొచ్చి అడ్డుకునేందుకు యత్నించగా.. టీడీపీపీ నేత గల్లా జయదేవ్ సహా ఆయా పార్టీల ఎంపీలు వారించారు. రామ్మోహన్ మాట్లాడాక వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ కియను తరలిస్తున్నారని వచ్చిన వార్తలు అవాస్తవమని చెప్పారు. తాను కియ ఎండీతో మాట్లాడానని, ఆ వార్తలను ఖండిస్తూ ప్రకటన ఇస్తామన్నారని వెల్లడించారు. మిలీనియం టవర్స్‌పై స్పందిస్తూ... ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ అనే డమ్మీ కంపెనీని ఏర్పాటువేసి రూ.30కోట్లు పెట్టుబడులు పెట్టినందుకు ఆ కంపెనీకి రూ.వేయి కోట్ల విలువైన భూములను కట్టబెట్టారని ఆరోపించారు. ఇది పెద్ద కుంభకోణమని చెప్పారు. రామ్మోహన్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని సభాపతిని కోరారు.

## కొత్తవి రాకపోగా ఉన్నవి పోతున్నాయి

- పరిశ్రమలన్నీ పోతే ఉపాధి కల్పన ఎలా?: పవన్



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): “రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు వచ్చేందుకు అనుకూల వాతావరణం నెలకొల్పాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించింది. కొత్తవి రాకపోగా ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది” అని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ విమర్శించారు. ఉన్న పరిశ్రమలు వెళ్లిపోతుంటే ఉపాధి అవకాశాలు ఎలా మెరుగుపడతాయని ప్రశ్నించారు. “కరువు ప్రాంతమైన అనంతపురంలో ఉన్న కియా పరిశ్రమలోని కొన్ని యూనిట్లు తరలిపోతున్నాయనే వార్తలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. ఈ వార్తను ప్రఖ్యాత రాయిటర్స్ సంస్థ ప్రపంచానికి తెలియజేసింది. కియా ఇక్కడ తన ప్లాంట్‌ను విస్తరిస్తుందనుకుంటే ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సిద్ధపడటం ప్రభుత్వ విధాన లోపాలను బహిర్గతం చేస్తోంది” అని విమర్శించారు. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్ నుంచి సాఫ్ట్‌వేర్ సంస్థలను ఖాళీ చేయించడమంటే ఇక ఆ రంగం రాష్ట్రం వైపు చూడకుండా చేయడమే అవుతుందన్నారు. రద్దులు, కూల్చివేతలు, తరలింపులతో ప్రభుత్వం సరిపెడుతోంది అని పవన్ విమర్శించారు.

## సీఎంను వ్యక్తిగతంగా విమర్శించలేదు

- అది మా పార్టీ విధానం కాదు: సీపీఐ రామకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మూడు రాజధానుల నిర్ణయం సరైంది కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డిని తాను వ్యక్తిగతంగా విమర్శించలేదని, వైసీపీ విధానాలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సీపీఐగానీ, తానుగానీ వ్యక్తిగత దూషణలకు ఎప్పుడూ వెళ్లబోమని, ప్రణాళికాబద్ధంగానే వెళతామని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులుగా తాము రాజకీయపరమైన విమర్శలు, పోరాటాలు చేస్తామే తప్ప వ్యక్తిగతంగా ఎవరితోనూ శత్రుత్వం పెట్టుకోమని రామకృష్ణ వివరించారు.

## జీవీఎల్... జగన్‌కు ఏజెంటు

- సచివాలయం, అసెంబ్లీ ఒకే చోట ఉండాలి: సీపీఐ నారాయణ



నర్సీపట్నం టౌన్, ఫిబ్రవరి 6: “బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, సీఎం జగన్‌కు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మోదీకి, అమిత్ షాకు తెలియకుండా రాష్ట్రంలో ఏమీ జరగడం లేదు. బీజేపీ నాయకులు కేంద్రంలో ఒక నాటకం, రాష్ట్రంలో ఒక నాటకం ఆడుతున్నారు. బీజేపీ, వైసీపీ కలిసి కాపురం చేస్తున్నామని బహిరంగంగానే ప్రకటించవచ్చు. ఈ డొంక తిరుగుడు అనవసరం. ఆ రెండు పార్టీలు లీగల్‌గా కాపురం చేస్తే ఎవరికీ అభ్యంతరం లేదు” అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. గురువారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ‘హైకోర్టు ఎక్కడైనా పెట్టుకోండి...సచివాలయం, అసెంబ్లీ ఒకేచోట ఉండాలని స్పష్టం చేశారు.

## కేంద్రానిది సవతి తల్లి ప్రేమ: విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని, తీరని అన్యాయం చేస్తోందని వైసీపీపీ నేత విజయసాయిరెడ్డి ఆరోపించారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం ఇచ్చిన ప్రధానమైన హామీలేవీ అమలు చేయడంలేదన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామని నాడు హామీ ఇచ్చి, నేడు చేతులెత్తేస్తోందని చెప్పారు. ఇది ఎంతవరకు సమంజసమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ప్రస్తావనే చేయలేదని.. 15వ ఆర్థిక సంఘం కూడా తన నివేదికలో ప్రత్యేకహోదా అంశం కేంద్ర పరిధికి సంబంధించిందని స్పష్టీకరించిందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ప్రత్యేక హోదా, పోలవరం, రెవెన్యూ లోటు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు.

సీబీఐకి ఇవ్వాలన్న.. నా పిటిషన్‌ను

## మూసివేయండి

- తదుపరి ఆదేశాలు అక్కర్లేదు
- వివేకా హత్య కేసులో హైకోర్టుకు జగన్ అభ్యర్థన
- మెమో దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ హత్యకేసును సీబీఐకి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రతిపక్ష నేత హోదాలో గతేడాది తాను దాఖలు చేసిన పిటిషన్‌ను మూసివేయాలని సీఎం జగన్ కోరారు. తన పిటిషన్‌లో తదుపరి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఎందుకు పిటిషన్‌ను మూసివేయాలని కోరుతున్నారో లిఖితపూర్వకంగా కారణాలు తెలియజేయాలని జగన్‌ను ఆదేశించింది. ఇందుకు సంబంధించి తదుపరి విచారణ నాటికి ఓ మెమో దాఖలు చేయాలని నిర్దేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య కేసును సీబీఐతో గానీ, లేదా రాష్ట్రప్రభుత్వ నియంత్రణ లేని స్వతంత్ర సంస్థతో గానీ దర్యాప్తు చేయించాలని అభ్యర్థిస్తూ గత ఏడాది జగన్, వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, ఇటీవలటీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, బీజేపీ నేత, మాజీ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా.. వివేకా కుమార్తె సునీతా నర్రెడ్డి, అల్లుడు రాజశేఖరరెడ్డి నర్రెడ్డి కలిసి తాజాగా మరో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ముందు గురువారం విచారణ జరిగింది. కేసులు విచారణకు రావడానికి ముందే ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్.శ్రీరాం విచారణను వాయిదా వేయాలని కోరగా న్యాయమూర్తి తిరస్కరించారు. గత విచారణ సమయంలోనే ఈ రోజు వాదనలు వింటానని స్పష్టంగా చెప్పానని, అందువల్ల వాయిదా వేసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అనంతరం విచారణ సందర్భంగా.. ప్రభుత్వ న్యాయవాది మహేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ.. సునీత, రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తిస్థాయి కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని తెలిపారు. మిగిలిన పిటిషన్లలో ఇప్పటికే కౌంటర్లు దాఖలు చేశారు కదా.. ఇందులో భిన్నమైన కౌంటర్ ఏముంటుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. సునీత పిటిషన్‌లో పలు ఆరోపణలు ఉన్నాయని, అందువల్ల వాటికి సవివరంగా సమాధానం ఇవ్వాల్సి ఉందని ప్రభుత్వ న్యాయవాది బదులిచ్చారు. ఈ దశలో సునీత తరఫు సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి జోక్యం చేసుకుని.. తమ పిటిషన్‌లో చేసిన ఆరోపణలు, వాటి తీవ్రత గురించి వివరించారు. జగన్ తరఫు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. తమ పిటిషన్‌లో తదుపరి ఉత్తర్వులు అవసరంలేదని, దానిని మూసివేయాలని కోరారు. వీరారెడ్డి అభ్యంతరం తెలిపారు. దీనిపై అందరి వాదనలను విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌ను ఎందుకు మూసివేయాలని జగన్ కోరుతున్నారో కారణాలు వివరిస్తూ తదుపరి విచారణ నాటికి మెమో దాఖలు చేయాలని నిర్దేశించారు. వివేకా హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఎందుకు ఇవ్వరాదని ప్రశ్నించారు. తదుపరి విచారణ 13వ తేదీకి వాయిదా వేశారు.

### సునీత పిటిషన్లో ఏముంది?

వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ ప్రతిపక్ష నేతగా జగన్ వేసిన పిటిషన్‌పై విచారణ హైకోర్టులో ఇంకా పెండింగ్‌లో ఉందని, అది పెండింగ్‌లో ఉన్నంత కాలం జగన్ సీబీఐ దర్యాప్తు కోసం డిమాండ్ చేస్తున్నట్లే భావించాల్సి ఉంటుందని డాక్టర్ సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్పట్లో సీబీఐ దర్యాప్తుకి డిమాండ్ చేసిన జగన్.. ఇప్పుడెందుకు కోరడం లేదో అర్థం కావడం లేదని ఆమె పేర్కొన్న విషయం తెలిసిందే.

# హోల్‌సేల్‌గా తరిమేస్తున్నారు!

- నానాతిప్పలు పడి తెస్తే ఇలా చేస్తారా?
- కియ తరలింపు వార్తలపై చంద్రబాబు ఆవేదన
- బెదిరింపుల వల్లే ఈ దుస్థితి
- రాయితీల్లోనూ కోతలు పెట్టారు
- భూమి ధరలు సైతం పెంచేశారు
- సైతాన్‌ను చూసినట్లు.. పారిశ్రామికవేత్తలు బెదిరిపోతున్నారు
- 9 నెలల్లో 1.80 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి
- విశాఖలో ఐటీ భవనాలను ఆక్రమిస్తే కంపెనీలు ఎక్కడకు వెళ్తాయి?
- ఆదాయం సగానికి సగం పడిపోయింది
- అభివృద్ధిపై వ్యయం 69% తగ్గింది
- జగన్ ప్రభుత్వంపై టీడీపీ అధినేత ఆగ్రహం



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రాష్ట్రాల పోటీని ఎదుర్కొని శ్రమపడి తెచ్చిన పెట్టుబడులు, పరిశ్రమలను వైసీపీ ప్రభుత్వం కాలదన్నుతోందని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారమయం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తాము నానా తిప్పలు పడి ఒక్కొక్క పరిశ్రమను తెస్తే వీళ్లు హోల్‌సేల్‌గా అందరినీ కలిపి తరిమేస్తున్నారని విరుచుకుపడ్డారు. కియ కార్ల ఫ్యాక్టరీ ఈ రాష్ట్రం నుంచి తమిళనాడుకు తరలివెళ్లే ఆలోచనలో ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ వెలువరించిన ప్రత్యేక కథనంపై గురువారం సాయంత్రం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నాటినుంచి కియకు సమస్యలు మొదలయ్యాయని.. ఇప్పటికే వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలకు తాజా కథనం బలం చేకూరుస్తోందని చెప్పారు. సైతాన్‌ను చూసి భయపడినట్లుగా వీళ్లను చూసి పారిశ్రామికవేత్తలు బెదిరిపోతున్నారని వ్యాఖ్యానించారు. ‘రాయిటర్స్ అంతర్జాతీయ వార్తా సంస్థ. కియ కంపెనీ ప్రతినిధులు, తమిళనాడు ప్రభుత్వ అధికారులు.. ఇంకా అనేక మందితో మాట్లాడి ఈ కథనం రాసింది. తమతో కియ చర్చలు జరుగుతున్న మాట వాస్తవమని తమిళనాడు అధికారులు చెప్పినట్లు అందులో రాశారు. తమిళనాడు, గుజరాత్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొని చంద్రబాబు ప్రభుత్వం కియను సాధించుకుందని ఆ రోజుల్లో కణ్ణన్ రామస్వామి అనే పారిశ్రామికవేత్త పేర్కొన్నారు. ప్రధాని కార్యాలయం (పీఎంవో) ఈ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తీసుకెళ్లాలని ఒత్తిడి తెచ్చినా చివరకు ఆ కంపెనీ ఆంధ్రనే ఎంచుకుందని డెక్కన్ క్రానికల్ రాసింది. మనం ఎదుర్కొన్న పోటీకి ఇవి నిదర్శనాలు. మొదట ఆ కంపెనీ పరిశీలనలో అసలు మన రాష్ట్రమే లేదు. నేను అనేకసార్లు వెంటబడి ఒత్తిడి చేసి పరిశీలనకు తీసుకునేలా చేశాను. బెంగుళూరుకు దగ్గరలో ఉంటుందని అనంతపురం జిల్లాలో పెట్టాలని సూచించాను. వచ్చి స్థలం చూసుకుని అక్కడ నీరు లేకుండా పరిశ్రమ ఎలా పెట్టాలని వారు ప్రశ్నించారు. ఆరు నెలల్లో నీరు తెచ్చి చూపిస్తానని చెప్పాను. యుద్ధ ప్రాతిపదికపై గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి ప్రత్యేక పైపులైన్ ద్వారా నీరందించే ఏర్పాటు చేశాను. ఆ కంపెనీకి ఇవ్వాలనుకున్న భూమి ఎత్తుపల్లాలతో ఉంటే చదును చేసి ఇచ్చాం. దీంతో ఆ కంపెనీకి మనపై నమ్మకం కలిగింది. తర్వాత నేను స్వయంగా కొరియాలోని ఆ కంపెనీ ఫ్యాక్టరీకి వెళ్లివచ్చాను. కావలసిన రాయితీలపైనా చర్చించి ఫ్యాక్టరీ వచ్చేలా చేశాను. గతంలో ఫోక్స్‌వ్యాగన్ కార్ల ఫ్యాక్టరీ దాదాపుగా వచ్చే దశలో బొత్స సత్యనారాయణ వంటివారు తమ అవినీతితో దానిని పోగొట్టారు. మళ్లీ ఇంతకాలానికి ఒక కార్ల ఫ్యాక్టరీని తేగలిగామన్న ఆనందాన్ని ఈ ప్రభుత్వం తన చర్యలతో ఆవిరి చేస్తోంది’ అని విమర్శించారు. ఇంకా ఏమన్నారంటే..

### చేతులారా చేస్తున్నారు..

‘రాష్ట్రం నుంచి తరలివెళ్లాలన్న ఆలోచన కియ కంపెనీకి రావడానికి ఈ ప్రభుత్వం చేసిన చర్యలే కారణం. కియ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం రోజు వైసీపీ ఎంపీ అందరిముందూ ఆ కంపెనీ ఉన్నతాధికారి ముఖంపై చెయ్యి పెట్టి తీవ్రంగా బెదిరించి అవమానించారు. అనంతరం తాము చెప్పిన వారికి ఉద్యోగాలివ్వాలని, లారీ కాంట్రాక్టులు తమకే ఇవ్వాలని మరో అధికారిపై వైసీపీ వాళ్లు బెదిరింపులకు దిగారు. కియ వల్ల రూ.20వేల కోట్ల భారమని, గత ప్రభుత్వం ఇచ్చిన రాయితీలపై సమీక్ష జరుపుతామని స్వయంగా మంత్రి ప్రకటించారు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలన్న చట్టం, రాయితీలపై పునఃసమీక్ష వల్ల కియ ఇక్కడి నుంచి పొరుగు రాష్ట్రానికి వెళ్లాలనుకుంటోందని రాయిటర్స్ తెలిపింది. 75శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వడానికి మేం వ్యతిరేకం కాదు. కానీ అసలు పరిశ్రమలే రాకపోతే ఇక ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయి?

### బుగ్గన కథలు చెబుతున్నారు..

‘కియకు అనుబంధంగా 17 విడి భాగాల పరిశ్రమల ఏర్పాటుకు మేం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ ప్రభుత్వం రాగానే వాటికి భూమి ధర పెంచారు. దానితో ఆ పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నాయి. ఇదేమంటే మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నంగి నంగిగా మాట్లాడుతున్నారు. కథలు చెబుతున్నారు. పారిశ్రామికవేత్తలందరితో ఇలాగే వ్యవహరిస్తున్నారు. సౌర, పవన విద్యుత్ సంస్థల పీపీఏలను సమీక్షించాలని ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తే అంతర్జాతీయంగా పెద్ద వివాదంగా మారింది. జపాన్ రాయబారి లేఖ రాస్తూ ఇలా వ్యవహరిస్తే ఇక ఎవరూ రారని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వం దెబ్బకు విదేశీ కంపెనీల పెట్టుబడుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయినా ఇంకా దబాయిస్తున్నారు.’

### కంపెనీలన్నీ పోయాయి..

‘జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం నుంచి రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. విశాఖలో అదానీ కంపెనీ రూ.70 వేల కోట్లతో పెట్టాలనుకున్న డేటాసెంటర్ ప్రాజెక్టు, అమరావతిలో రూ.50 వేల కోట్ల సింగపూర్ కంపెనీల పెట్టుబడులు, ప్రకాశం జిల్లాలో రూ.25 వేల కోట్ల పేపర్ పరిశ్రమ, తిరుపతిలో రూ.15 వేల కోట్ల రిలయన్స్ పరిశ్రమ, మరో 130 పరిశ్రమలకు సంబంధించి రూ.50 వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి మళ్లినవాటిలో ఉన్నాయి. మా హయాంలో రూ.16లక్షల కోట్ల విలువైన పరిశ్రమల ఏర్పాటుకు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఇందులో సగం వరకూ నెరవేరే వాతావరణం కల్పించాం. కానీ ఈ ప్రభుత్వం 9 నెలల్లో ఒక్క పరిశ్రమ కూడా తేలేకపోయింది. పరిశ్రమ పెట్టాలని ఎవరైనా వస్తే ఎందుకు వచ్చారన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.’

### మిలీనియం టవర్‌లో సచివాలయమా?

‘హైదరాబాద్‌లో హైటెక్ సిటీ మాదిరిగా విశాఖలో ఐటీ కంపెనీల కోసం ప్రత్యేకంగా మిలీనియం టవర్స్‌ను మా ప్రభుత్వం నిర్మిస్తే అందులోకి కాండ్యూయెట్ వంటి కంపెనీలు వచ్చాయి. ఇప్పుడు అందులో సచివాలయం పెడతామని ప్రచారం చేస్తున్నారు. అక్కడ సచివాలయం ఉంటే అందులో ఐటీ కంపెనీలు ఎలా, ఎక్కడ పనిచేస్తాయి? వచ్చిన కంపెనీలు ఎలాగోలా సర్దుకుపోయినా కొత్త కంపెనీలు ఏవీ రాలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఏ ప్రభుత్వం వచ్చినా పాత ఒప్పందాలను గౌరవిస్తారన్న నమ్మకం పారిశ్రామికవేత్తల్లో ఉంటుంది. కానీ వాటిని తిరగతోడడం ద్వారా రాష్ట్రంపైనే అపనమ్మకం కలిగిస్తున్నారు. అభద్రత ఏర్పడితే రాష్ట్రానికి ఎవరూ రారు. ఒకసారి బ్రాండ్ ఇమేజి దెబ్బ తీస్తే తర్వాత ఎంత ప్రయత్నం చేసినా ఉపయోగం ఉండదు. కొత్త పెట్టుబడులు రాకపోవడంతో రాష్ట్ర ఆదాయం ఈ 9 నెలల్లో సగానికి సగం పడిపోయింది. మింట్ వంటి పత్రికల సర్వేల్లో రాష్ట్రం అట్టడుగుకు చేరిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ వ్యయం ఒకేసారి 69 శాతం తగ్గిపోయింది. ఇక రాష్ట్రం ఎలా ముందుకు వెళ్తుంది? కియకు ఏం జరుగుతోందో అమరావతికీ అదే జరుగుతోంది. దీనివల్ల రాష్ట్రం ఎంత మూల్యం చెల్లించాల్సి వస్తుందో ప్రజలు ఆలోచించాలి.’

# 3 ఒక రాష్ట్రం రాజధానులు

## అమరావతి జేఏసీకి భారీగా విరాళాలు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిరక్షణ జేఏసీకి భారీగా విరాళాలు అందుతున్నాయి. బుధవారం తెనాలిలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జోలె పట్టి సేకరించిన విరాళాలను గురువారం తీసుకువచ్చి జేఏసీ నేతలకు అప్పగించారు. ఇందులో రూ.6.26 లక్షలు, 11 బంగారు ఉంగరాలు, జత బంగారు గాజులు, రెండు జతల చెవి పోగులు, జత వెండి పట్టీలు ఉన్నాయి. ఇందులో రూ.2.73 లక్షలు తెనాలి జేఏసీకి అందజేశారు. మాజీ మంత్రులు ఆలపాటి రాజా, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. విరాళాలు ఇచ్చిన దాతలను చంద్రబాబు అభినందించారు.

### మిలీనియం టవర్స్ ఖాళీ చేయిస్తే..
## ఆ పత్రాల్నీ జత చేయండి

▸▸ పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ కార్యాలయాలను కర్నూలుకు తరలిస్తూ జారీ చేసిన జీవోతోపాటు, విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్-బి నిర్మాణ పనుల కోసం రూ.19.73 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం మిలీనియం టవర్స్‌లో ఉన్న ఐటీ ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్నారన్న పిటిషనర్ తరఫు న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం.. ఆ పత్రాలను పిటిషన్‌కు జత చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. కర్నూలుకు కార్యాలయాల తరలింపు చట్టవిరుద్ధమని, రాజధాని నగర నిర్మాణ పనులు మధ్యలో నిలిపేశారంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎం.రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం ధర్మాసనం విచారణ జరిపింది. రాజధానిలో 10,500 కోట్లకు పైగా ప్రభుత్వం వ్యయం చేసిందని, ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు లేకుండానే రాజధానిలో అభివృద్ధి పనుల్ని నిలిపేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. పాలనా వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ చట్టం రద్దు బిల్లులు పెండింగ్‌లో ఉండగా కార్యాలయాలను తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. మిలీనియం టవర్‌లో ఉన్న 24 వేల మంది ఐటీ ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్నట్లు తనకు వాట్సాప్ దారా సమాచారం వచ్చిందని, కార్యాలయాల తరలింపుపై స్టే ఇవ్వాలని అభ్యర్థించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలతోపాటు వ్యక్తిగత హోదాలో సీఎం జగన్, డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, మంత్రులు బొత్స, బుగ్గన, కన్నబాబు, సీఎస్ ఎన్.సాహ్ని, సీఎం సలహాదారు అజయ్‌కల్లం తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

### రోహత్గీ నియామకంపై మరో పిటిషన్

రాజధాని వ్యవహారంపై వాదనలు వినిపించేందుకు మాజీ అటార్నీ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించడంతోపాటు, రూ.5 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. గతంలో ఇదే వ్యవహారంపై దాఖలైన పిటిషన్లతో కలిపి దీన్ని విచారిస్తామంటూ ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

## ప్రభుత్వ ఆఫీసుకు పార్టీ రంగులా!

▸▸ కేంద్రం వైఖరి తెలపాలని హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వ కార్యాలయాలపై పార్టీ రంగులేయడం, సీఎం బొమ్మ పెట్టడం ఏమాత్రం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. దీనికి శాశ్వత పరిష్కారం కనుగొనాల్సి ఉందని అభిప్రాయపడింది. గ్రామ పంచాయతీ కార్యాలయానికి, గ్రామ సచివాలయ భవనానికి వైసీపీ జెండా రంగులేస్తున్నారంటూ గుంటూరు జిల్లా పల్లపాడుకు చెందిన ఎం.వెంకటేశ్వర్లు, విజయనగరం జిల్లా తలారి గ్రామానికి చెందిన ఎ.రమణ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై గురువారం మరోమారు హైకోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వ భవనాలపై వైసీపీ జెండా రంగులు వేస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వ భవనాల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ వైఖరేంటో చెప్పాలని ఆదేశించింది. 'ఆర్టీసీ కార్గో బస్సులపై తన ఫొటో వద్దని, అలాంటి ప్రచారం తనకు అవసరం లేదని తెలంగాణ సీఎం చెప్పినట్లు పత్రికల్లో చూశాం. అలాగే ప్రభుత్వ కార్యాలయాలపై తన బొమ్మ వద్దని ఏపీ సీఎం కూడా అంటారేమో చూద్దాం' అని చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, నేషనల్ బిల్డింగ్ కోడ్ తదితర వివరాలపై అధ్యయనం చేయాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ కృష్ణమోహన్‌కు సూచిస్తూ తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.



మందడం దీక్షా శిబిరంలో జై అమరావతి అంటూ మహిళల నినాదాలు

# కృష్ణమ్మా.. కాపాడమ్మా

▸▸ సారె సమర్పించి మహిళా రైతుల జలదీక్ష

▸▸ చెప్పులు కుడుతూ విద్యార్థి జేఏసీ నిరసన

▸▸ 51వ రోజు కొనసాగిన రాజధాని ఆందోళనలు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజధాని తరలింపుపై సీఎం జగన్ అన్ని గ్రామాల్లో పర్యటించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని అమరావతి ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు. మూడు రాజధానులపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. రాజధానిగా అమరాతినే కొనసాగించాలని కోరుతూ గురువారం 51వ రోజు ఆందోళనలు కొనసాగించారు. తుళ్లూరు, మందడంలో మహాధర్నా నిర్వహించగా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, యర్రబాలెం, గుంటూరు కలెక్టరేట్ ఎదురు, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తెనాలి తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. మందడం, తాళ్లాయపాలెం రైతులు తాళ్లాయపాలెం పుష్కర ఘాట్‌లో జలదీక్ష చేశారు. మహిళలు కృష్ణమ్మకు హారతి ఇచ్చి, నీటిలో పసుపు, కుంకుమ, పూలు వదిలి, సారె సమర్పించి రాజధానిగా అమరావతిని కొనసాగించాలని వేడుకున్నారు. జాతీయ జెండాలు, ప్లకార్డులు పట్టుకుని 'సేవ్ అమరావతి, సేవ్ ఏపీ' అంటూ నినాదాలు చేశారు. అమరావతి విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లో విద్యార్థులు బూట్ పాలిష్ చేసి, చెప్పులు కుట్టి నిరసన ప్రదర్శన చేశారు. జేఏసీ నేతలు మద్దకూరి రాంబ్రహ్మం, బాష్యం నరసయ్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి నాడు రైతులు చేపట్టిన సత్యాగ్రహ నిరాహార దీక్షలు గురువారంకు 8వ రోజుకు చేరాయి. ఇందులో భాగంగా మందడం, వెలగపూడి రైతులు, రైతు కూలీలు 24గంటల నిరాహార దీక్ష కొనసాగించారు. యువదీక్ష పేరుతో వెలగపూడిలో యువరైతులు తాడికొండ శ్రీకర్, బొర్రా రవిచంద్ర బుధవారం చేపట్టిన 151 గంటల నిరాహాదీక్షలు కొనసాగాయి. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉద్యమం కోసం మందడం, రాయపూడి, తుళ్లూరు, వెలగపూడి, పెదపరిమి గ్రామాల్లో శిబిరాల వద్ద తాటాకు పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు కృష్ణా, ప్రకాశం, తూర్పు, పశ్చిమ గోదావరి, తెలంగాణ నుంచి పలువురు రైతులు, విశ్రాంత ఉద్యోగులు, యువకులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డులో నిరసనలు 34వ రోజుకు చేరుకున్నాయి. చిత్తూరు జిల్లాకు చెందిన ఉద్యానవన వర్సిటీ పాలకవర్గ సభ్యులు జి.పద్మనాభనాయుడు, పోపూరి శివరామకృష్ణ ఆందోళనలకు మద్దతు తెలిపారు. పెదవడ్లపూడిలో రిలే దీక్షలు 41వ రోజుకు, పెనుమాకలో దీక్షలు 51వ రోజుకు చేరుకున్నాయి. రాజధాని రైతులకు ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మాజీ మంత్రి దేవినేని ఉమా తమ సంఘీభావాన్ని తెలిపారు. మండలిలో తమ తరపున పోరాటం చేసిన అర్జునుడికి రైతులు శాలువాతో సత్కరించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట జేఏసీ నేతలు చేపట్టిన రిలే దీక్షలు 40వ రోజుకు చేరుకున్నాయి.



పెనుమాకలో ఆర్టీసీ బస్సును శుభ్రంచేసి నిరసన తెలుపుతున్న రైతులు


151 మంది వైసీపీ ఎమ్మెల్యేల తీరును నిరసిస్తూ వెలగపూడిలో 151 గంటల నిరశన దీక్ష చేస్తున్న యువకులు

### సచివాలయం, అసెంబ్లీ
## వేర్వేరు చోట్లా?

▸▸ అలాంటి రాజధాని ఏదీ లేదు

▸▸ ఒక ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్‌ను.. తర్వాతి ప్రభుత్వం రద్దు చేస్తామంటే ఎలా?

▸▸ పోలవరం నిర్మాణంపై దృష్టి పెట్టండి

▸▸ హోదా కాదు.. రాయితీలు అడగండి: ఉండవల్లి



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయం, అసెంబ్లీ వేర్వేరు చోట్ల ఉన్న రాజధాని ఏదీ లేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. రాజధాని గొడవలు తెచ్చుకుని సీఎం జగన్, సీఏఏ గొడవలతో ప్రధాని మోదీ ఇబ్బందుల్లో పడ్డారని చెప్పారు. గతంలోనే జగన్ అమరావతిని వ్యతిరేకించి ఉంటే బాగుండేదన్నారు. 'ఇవాళ రాజధాని ఎక్కడుంటే ఏమిటి? పాలన ఎక్కడి నుంచైనా చేయవచ్చు. ముందు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి పెట్టండి. సీఎం చెప్పినట్లు 2021కి అది పూర్తయ్యే పరిస్థితి లేదు. అది పూర్తయితే అన్ని ప్రాంతాలూ సస్యశ్యామలమవుతాయి. ప్రజలెవరూ ఉద్యమాలు ఊసే ఎత్తరు' అని అభిప్రాయపడ్డారు. గురువారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు రాజధానుల సంగతి తనకు తెలియదన్నారు. 'నేను అమరావతిని మొదటే వ్యతిరేకించాను. పెట్టుబడి అంతా హైదరాబాద్‌లో పెట్టి ఒకసారి దెబ్బతిన్నాం. అదే విధంగా అమరావతిని చేయవద్దని చంద్రబాబుకు కూడా చెప్పాను. అక్కడ త్యాగం కాదు. రియల్ ఎస్టేట్ బిజినెస్ జరిగింది. అయినా ఒక ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్‌ను.. తర్వాత వచ్చిన ప్రభుత్వం రద్దు చేస్తామంటే ఎలా? ఇక ఎవరైనా పనులు చేస్తారా? జగన్ పదేళ్లలో విశాఖను హైదరాబాద్‌లా చేస్తానని ప్రకటించారు. చంద్రబాబు చేసిన తప్పు మళ్లీ చేయొద్దు. అభివృద్ధి వికేంద్రీకరణ అవసరం. వసతి, సౌకర్యాలు ఎక్కడుంటే అక్కడకే పెట్టుబడులు వస్తాయి. అడుక్కునే వాడి దగ్గరకు వెళ్లి ముష్టెత్తుకుంటే ఉపయోగం ఏముంటుంది' అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా మాట మానేసి ప్యాకేజీ, రాయితీలు అడగాలని జగన్‌కు సలహా ఇచ్చారు. ఇంటింటికీ పెన్షన్ అనేది పెద్ద బూతుగా పేర్కొన్నారు. 'ఇచ్చిన సంక్షేమ పథకాలను తీసేస్తే బీభత్సమైపోతుంది. నీవు ఏసీలో తిరగడం లేదా? మీ అమ్మ ఏసీలో ఉండడం లేదా అని ఓ ముసలమ్మ జగన్‌ను ప్రశ్నించడం వాట్సాప్‌లో చూశాను. అనేక మంది అర్హులు ఇబ్బంది పడుతున్నారు. 1989లో కాంగ్రెస్‌కు 53.63 శాతం ఓట్లు వచ్చాయి. కానీ సీఎం చెన్నారెడ్డి రేషన్ కార్డులకు ఎంత మంది అర్హులు కారో సర్వే చేయాలన్నారు. సర్వే చేశారో లేదో తెలియదు. కానీ ప్రజల్లో అలజడి వచ్చింది. కార్డులు తీసివేశారో లేదో గాని.. ప్రజలు మాత్రం కాంగ్రెస్‌ను అధికారం నుంచి తీసివేశారు' అని తెలిపారు.

## రైతులకు అన్యాయం చేయొద్దు

▸▸ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో రైతుల భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజధానిని అమరావతిలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రికి నచ్చజెప్పి, తమకు న్యాయం చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును రైతు నేతలు కోరారు. పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద వైసీపీ అమరావతి రాజధాని పరిరక్షణ సమితి ప్రతినిధులు ఆయనతో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవడానికి సీఎం జగన్‌తో భేటీ అవుతామంటే అపాయింట్‌మెంట్ ఏర్పాటు చేస్తానన్నారు.

### రాజధాని అమరావతే.. ఏనాడో ప్రకటించాం

▸▸ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్సీ మాధవ్



అమలాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే రాజధాని అని బీజేపీ ఏనాడో ప్రకటించింది. రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ విభేదాలు సృష్టించే విధానాలకు స్వస్తి పలకాలి. ఏపీ రాజధాని ముగిసిన అధ్యాయమని చెప్పిన ఏకైక పార్టీ బీజేపీ. అంతేకాదు.. అమరావతి వెళ్లి రైతులతో కలిసి దీక్ష చేయడంతోపాటు సంఘీభావం తెలిపిన ఘనత రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణకు, పార్టీ శ్రేణులకు దక్కుతుంది. అమరావతి రాజధానిగా బీజేపీ తీర్మానం చేసినట్టు టీడీపీగానీ, కమ్యూనిస్టు పార్టీలు గానీ ఏ విధమైన తీర్మానాలు చేయలేదు" అని బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. అమలాపురంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటనతో ఎవరికి వారు మాకు రాజధాని కావాలంటే మాకు రాజధాని కావాలని కోరుకునే పరిస్థితిని వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ఒక రాజధాని సరిపోతుందన్నారు. చంద్రబాబు ఊహించిన అమరావతిని తాము సపోర్టు చేయడంలేదన్నారు. అవసరమైతే విశాఖపట్నంలో కొన్ని హెచ్‌వోడీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నా అభ్యంతరం లేదన్నారు. శాసనమండలిలో 2 బిల్లులను వ్యతిరేకించడం జీర్ణించుకోలేని జగన్ ఏకపక్ష ధోరణితో మండలిని రద్దు చేశారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాధవ్ ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ సీఎం జగన్, ప్రధాని మోదీకి లేఖ పంపడం సత్యదూరమన్నారు. ఏ రాష్ట్రానికి రాని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు కేటాయించిందన్నారు. 'ఉపాధి' పథకం కింద రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించారని, అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు.

# 'సెలెక్ట్' సెగలు

▸▸ చైర్మన్ విశేషాధికారాలపై అధికార నేతల లేఖాస్త్రాలు

▸▸ డివిజన్ కోరకుండా కమిటీయా: ఉమ్మారెడ్డి

▸▸ నోటిమాటతోనే ఏర్పడటానికి ఫత్వా కాదు: మంత్రి బుగ్గన

▸▸ మండలి కార్యదర్శికి చేరిన 2 కమిటీల సభ్యుల ఫైలు?

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి, ప్రభుత్వం మధ్య సెలెక్ట్ కమిటీ వ్యవహారం సెగలు రేపుతోంది. గత నెలలోనే శీతాకాల సమావేశాలు వాయిదా పడినప్పటికీ ఈ వేడి ఇప్పట్లో చల్లారేలా లేదు. అసెంబ్లీ ఆమోదించిన సీఆర్డీఏ రద్దు, పాలనవికేంద్రీకరణ బిల్లులను మండలి తిరస్కరించడాన్ని వైసీపీ వ్యతిరేకిస్తోంది. నిబంధనలు పాటించకుండా విశేషాధికారం పేరిట బిల్లులను సెలెక్టు కమిటీకి పంపే అధికారం చైర్మన్‌కు ఎక్కడిదని ప్రశ్నిస్తోంది. దీనిపై చైర్మన్ షరీఫ్‌కు మంత్రులు పిల్లి సుభాష్ చంద్రబోస్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు లేఖలు రాశారు. "సెలక్ట్ కమిటీకి పంపాలంటే ముందుగా డివిజన్ (ఓటింగ్)ను కోరాలి. ఆ తర్వాతే సభ్యుల పేర్లను పంపాలి. సభ ద్వారానే సభ్యుల పేర్లను రాజకీయపక్షాల నుంచి కోరాలి" అని తన లేఖలో ఉమ్మారెడ్డి అన్నారు. దీనిపై ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు. 'నేను రాసిన లేఖను మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు పంపాను. వారు కూడా లేఖలోని అంశాలతో ఏకీభవించారు. సెలెక్ట్ కమిటీ వేసేందుకు అవకాశమే లేదని స్పష్టం చేస్తూ, చైర్మన్‌కు లేఖ రాశారు' అని వివరించారు. కమిటీపై ముందడుగు సాధ్యం కాదని మరో మంత్రి పేర్ని నాని చెబుతున్నారు. సచివాలయంలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "సెలెక్ట్ కమిటీ ఏర్పాటు చేస్తూ చైర్మన్ నిర్ణయం తీసుకోవడం అనేది ఫత్వా జారీ చేయడం కాదు. నోటి మాట ద్వారా కమిటీ ఏర్పాటు కుదరదు. విధానం ప్రకారం అది జరగలేదు. కాబట్టి సెలెక్ట్ కమిటీ ఏర్పాటనే ప్రశ్నే తలెత్తదు. అసలు చైర్మన్ ఆ రెండు బిల్లులను కమిటీకి రిఫర్ చేసే ప్రక్రియే ఇంకా పూర్తి కాలేదు. విచక్షణాధికారం ఉంది కదా అని ఇష్టారాజ్యంగా చేయడానికి వీలు లేదు" మంత్రి వ్యాఖ్యానించారు. ఇంతలో.. శాసనమండలి చైర్మన్ కార్యాలయం సెలక్ట్ కమిటీలకు చైర్మన్, సభ్యులను నియమిస్తూ ప్రకటన చేసిందంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. సీఆర్‌డీఏ రద్దు బిల్లుపై కమిటీకి మునిసిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సభ్యులుగా జీ దీపక్‌రెడ్డి, బచ్చుల అర్జునుడు, గౌనివారి శ్రీనివాసులు, షేక్ మహమ్మద్ ఇక్బాల్, ఐ.వెంకటేశ్వరరావు, సోము వీర్రాజును ఎంపిక చేసినట్లు వైరల్ అయింది. వికేంద్రీకరణ బిల్లుపై కమిటీకి చైర్మన్‌గా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యవహరిస్తారని, సభ్యులుగా అశోక్‌బాబు, నారా లోకేశ్, జీ తిప్పేస్వామి, జీ సంధ్యారాణి, వెన్నపూస గోపాల రెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, పీవీఎన్ మాధవ్‌ను నియమించారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాలతో తమకేమీ సంబంధం లేదని శాసనమండలి సెక్రటేరియేట్ చెబుతోంది. కాగా, సెలెక్ట్ కమిటీ చైర్మన్లు, సభ్యుల పేర్లను ప్రతిపాదిస్తూ చైర్మన్ షరీఫ్ మండలి కార్యదర్శికి ఫైల్ పంపారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిపై అధికారిక ప్రకటన విడుదల కావాల్సి ఉంది.

# అయ్యో..ఐటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయనకు అప్పగించింది. కొత్త కంపెనీలను తీసుకురావడం, వాటికి తగిన వసతి సమకూర్చడం, ఉద్యోగ అవకాశాలు పెంచడం వంటి కార్యక్రమాలు అప్పట్లో విస్తృతంగా సాగేవి. ఇందుకోసం సపోర్టింగ్ స్టాఫ్ 15 మంది వరకు ఉండేవారు. కొత్త ప్రభుత్వం వచ్చాక...ఏమనుకుందో ఏమోగానీ, సీఈవోని, సిబ్బందిని తొలగించింది. ఏకంగా ఎపీటా కార్యాలయాన్నే ఎత్తేసింది. ప్రపంచమంతా ఇన్నోవేషన్ ఆలోచనల కోసం స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తుంటే...వైసీపీ ప్రభుత్వం మాత్రం వాటిని పక్కనపెట్టింది. గత ప్రభుత్వం స్టార్టప్‌ల కోసం విశాఖలో ఏకంగా ఓ భవనాన్నే నిర్మించి స్టార్టప్ విలేజ్ అని నామకరణం చేసింది. యువతను ప్రోత్సహించింది. తరువాత దాని పేరును ఏపీ ఇన్నోవేషన్ వేలీగా మార్చారు. నాస్కామ్‌తో యువతకు మార్గదర్శనం చేయించారు. ఆర్నెలల క్రితం ప్రభుత్వం తీరు చూసి నాస్కామ్ కూడా అక్కడి నుంచి బయటకు వచ్చేసింది. తరువాత స్టార్టప్‌లను కూడా బయటకు పంపేశారు. యాక్సలేటర్ కంపెనీ గోవిన్ కేపిటల్, ఇంకా ఒకటి, రెండు కార్యాలయాలు మాత్రమే అక్కడ ఉన్నాయి. అక్కడ కూడా ప్రభుత్వ సిబ్బందిని తొలగించేసి, కేవలం ఒకే ఒక ఉద్యోగిని ఉంచారు. ఇప్పుడు ఆ భవనాన్ని 'సీఎం ఆఫీసు'గా ఉపయోగించుకుంటారని ప్రచారం జరుగుతోంది.

### పొగ పెడుతున్నారు..

స్టార్టప్ విలేజ్ పక్కనే మిలీనియం టవర్ నిర్మాణం చేపట్టారు. గత ఫిబ్రవరిలో టవర్-1 పూర్తి కాగా అందులో స్థలాన్ని కాండ్యుయెంట్ అనే కంపెనీకి ఇచ్చారు. అందులో 1500 మంది పనిచేస్తున్నారు. ఆ టవర్‌లో మొత్తం రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉండగా, అప్పటికి పూర్తయిన లక్ష చదరపు అడుగులు వారికి ఇచ్చారు. ఆ తరువాత దశల వారీగా మరో లక్ష చదరపు అడుగులు అందుబాటులోకి వచ్చింది. దానిని కూడా తమకు కేటాయిస్తే...మరింత మందికి ఉపాధి కల్పిస్తామని ఆ కంపెనీ 4 నెలలక్రితం రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. అయితే విశాఖలో రాజధాని అనగానే నాయకులు, అధికారుల కన్ను మిలీనియం టవర్‌పైనే పడింది. అందులో లక్ష చదరపు అడుగులు ఖాళీగా ఉండడంతో, అందులో సచివాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానిని అందుకు అనుగుణంగా మార్చుకోవడానికి ప్రతి వారం అమరావతి నుంచి ఉన్నతాధికారులు వచ్చి వెళుతున్నారు. ఒకే భవనంలో కొంత స్థలం సచివాలయంగా వాడుకుంటే...వీఐపీలు, వారి సెక్యూరిటీ వస్తుంటే...అందులో ఐటీ కంపెనీ వ్యవహారాలు ఎలా నడుపుతామంటూ కాండ్యుయెంట్ వాపోతోంది. అసలు ఐటీకి మౌలిక వసతులు కల్పించడానికి రుషికొండలో ఐటీ పార్కును అభివృద్ధి చేశారని, అందులో సచివాలయం, సీఎం కార్యాలయం ఎలా పెడతారంటూ ఐటీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కాండ్యుయెంట్‌ను అక్కడి నుంచి తరలిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఆ సంస్థలకు మిలీనియం టవర్‌లో కేవలం షెల్ (భవనం) మాత్రమే ఇచ్చారు. ఆ కంపెనీ సొంత నిధులు రూ.20 కోట్లకు పైగా వెచ్చించి ఇంటీరియర్ చేయించుకున్నట్టు తెలిసింది. ఇంకో రూ.5 కోట్లు వెచ్చించి సిబ్బందిని రిక్రూట్ చేసుకుంది. ఇప్పుడు అర్ధంతరంగా తమను పంపించేస్తే పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఐటీ కంపెనీలకు గత కొంతకాలంగా రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు. ఐటీ అసోసియేషన్ అనేక సంప్రదింపులు జరిపిన మీదట గత నెలలో రూ.100 కోట్లు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అందులో ఒక్క రూపాయి కూడా ఏ కంపెనీకీ ఇప్పటివరకు విడుదల చేయలేదు. నిధుల పరిస్థితి ఇలా ఉండగా, తాజాగా మిలీనియం టవర్ -2 నిర్మాణానికి రూ.20 కోట్లు విడుదల చేశారు. దీనిని ఐటీ వర్గాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. ప్రభుత్వం కోసం భవనాలు నిర్మించుకోవడానికి నిధులు ఇస్తున్నారుగానీ అదే ప్రభుత్వం చెప్పిన విధానాలు అనుసరించినందుకు ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వడం లేదని, ఇలాగైతే ఐటీ కంపెనీలను ఎలా నడుపుతామని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం విశాఖను ఐటీ హబ్‌గా చూడడం లేదని, రియల్ ఎస్టేట్ హబ్‌గా మారుస్తోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

## రాష్ట్రానికి సాయపడండి

▸▸ పోలవరానికి ఏటా 10వేల కోట్లు ఇవ్వండి.. నాబార్డుకు సీఎం వినతి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'ఏపీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. 62% ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఆక్వా, ఫిషరీస్ లాంటి రంగాల్లో నంబరు వన్‌గా ఉన్నాం. దేశం మొత్తం ఇప్పుడు మాంద్యం ఎదుర్కొంటోంది. దీని ప్రభావం తొలుత ప్రాథమిక రంగాలపైనే ఉంటుంది. మెజార్టీ సంఖ్యలో ఉపాధి కల్పించే ఈ రంగానికి సాయం చేయండి' అని సీఎం జగన్... నాబార్డును కోరారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర స్థాయి రుణమంజూరు సెమినార్ జరిగింది. 2020-21 నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్‌ను ఈ సందర్భంగా సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. గుండెకాయ లాంటిది. మేము రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తే దానిపై వడ్డీ రూ.500కోట్లకుపైగా కడుతున్నాం. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఇప్పుడు రూ.1800 కోట్లకుపైగా నాబార్డు నుంచి పీపీఏకి వెళ్లాయి. అవింకా రాలేదు. ఈ సమస్యలు తీర్చేలా పూర్తిస్థాయి సహకారం కావాలి. ఏడాదికి కనీసం రూ.10వేల కోట్లు చొప్పున ఆర్అండ్ఆర్ కింద కావాలి. సివిల్ పనులకు ఈ ఏడాదే రూ.6వేలకోట్లు కావాలి. ఈ ప్రాజెక్టుపై మేము ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం' అని అన్నారు. తాము చేపట్టిన పథకాలు గతంలో ఎక్కడా లేవని చెప్పారు. వచ్చే ఖరీఫ్ నాటికి 11వేలపైగా రైతు భరోసాకేంద్రాలు పెడుతున్నామని, ప్రతి నియోజకవర్గంలో అగ్రిల్యాబ్స్ పెడుతున్నామని తెలిపారు. ఈ సెమినార్‌లో మంత్రి కన్నబాబు, సలహాదారు అజేయకల్లం, నాబార్డు సీజీఎం సెల్వరాజ్ తదితరులు మాట్లాడారు.

# రైతుకు ధర రాకపోతే మనమే కొందాం

▸▸ ప్రభుత్వానికి నష్టమొచ్చినా ఫర్వాలేదు

▸▸ అగ్రి మిషన్ సమీక్షలో సీఎం ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'పంట ఉత్పత్తులను కనీస మద్దతు కంటే తక్కువ ధరకు రైతు అమ్ముకోవాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. రైతుల నుంచి ఉత్పత్తిని ప్రభుత్వమే కొనాలి. కొనుగోలు కేంద్రాల్లో పంటను కొన్న వెంటనే రైతుకు డబ్బు అందేలా చూడాలి' అని అధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అగ్రిమిషన్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల లోగోను ఆవిష్కరించడంతో పాటు వాటిద్వారా విత్తనాల కొనుగోలు బుకింగ్ చేసుకునే వెబ్‌సైట్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ 'అన్ని కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల పట్టికలు పెట్టాలి. ఎమ్మెస్పీ కన్నా తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. కొనుగోలు కేంద్రాల వివరాలు, ఎమ్మెస్పీ పట్టికలు గ్రామ సచివాలయాల్లోనూ అందుబాటులో ఉంచాలి' అని అధికారులను ఆదేశించారు. 'వచ్చే నెలకల్లా పరిస్థితిలో మొత్తం మార్పురావాలి. లేదంటే సంబంధిత అధికారులను కచ్చితంగా బాధ్యుల్ని చేస్తాను. పంట అమ్ముకునే సమయంలో రైతుకు చిన్న ఇబ్బంది కూడా రాకూడదు. ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వచ్చినా ఫర్వాలేదు' అని స్పష్టం చేశారు.


రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న విత్తన పరీక్షా యంత్రాలను పరిశీలిస్తున్న సీఎం జగన్

### నేటి నుంచి పప్పు, చిరుధాన్యాల బోర్డులు

రాష్ట్రంలో చిరుధాన్యాల, పప్పుధాన్యాల బోర్డులు చట్టరూపం దాల్చాయి. చట్టసభల ఆమోదంతో ఏపీ మిలెట్స్ బోర్డు-2019, ఏపీ పల్సస్ బోర్డు-2019 చట్టాలను గురువారం అమలులోకి తెస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

## ఏపీకి 21 వేల కోట్ల రుణం!

రాష్ట్రానికి కొత్తగా రూ 21362.70 కోట్లు రుణం ఇచ్చేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) సంసిద్ధత తెలిపింది. గతంలో ఇచ్చిన రుణానికి ఇది అదనమని పేర్కొంది. సచివాలయంలో సీఎం జగన్‌తో ఏఐఐబీ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి డీజే పాండియన్, ఇన్వెస్ట్‌మెంట్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ ఈ-ఎన్-పంగ్, ప్రిన్సిపల్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు సోమనాథ్ గురువారం భేటీ అయ్యారు. నిర్ణయించుకున్న ప్రాధాన్యతల ప్రకారం తమ రుణాన్ని ఖర్చు చేసుకోవచ్చని వారు సూచించారు. 62% మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడినందున ఇరిగేషన్ ప్రాజెక్టులు తమకు ప్రాధాన్యమని సీఎం చెప్పారు. కొత్తగా 16 మెడికల్ కాలేజీలు పెట్టనున్నట్టు తెలిపారు. దీనికి స్పందించిన ఏఐఐబీ ప్రతినిధులు రాష్ట్రప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల నివేదికలు అందగానే రుణం మంజూరు చేస్తామని పేర్కొన్నారు. తమ ప్రణాళికలను వివరించడానికి బ్యాంకు ప్రధాన కార్యాలయానికి రావాలని సీఎం జగన్‌ని ఏఐఐబీ ప్రతినిధులు ఆహ్వానించారు.

| పాకిస్థాన్ X బంగ్లాదేశ్ | దక్షిణాఫ్రికా X ఇంగ్లండ్ | భారత X ఇంగ్లండ్ |
|---|---|---|
| తొలి టెస్ట్-తొలి రోజు | రెండో వన్డే | మహిళల టీ-20 |
| ఉ.10.30 నుంచి | సా.4.30 నుంచి.... | ఉ. 8.40 నుంచి |
| సోనీ-ఈఎస్‌పీఎన్‌లో... | సోనీ సిక్స్‌లో... | సోనీ సిక్స్, సోనీ టెన్-3ల్లో... |


హర్మన్‌ప్రీత్ స్మృతి మంధాన

అండర్-19 ప్రపంచకప్‌లో విశేషంగా రాణించిన వారిని భారత క్రికెట్ భవిష్యత్ స్టార్లుగా పరిగణిస్తుంటారు. ఇక కెప్టెన్‌గా ముందుండి నడిపించి జట్టుకు కప్‌ను అందించిన ఆటగాడికైతే ఆ క్రేజ్ వేరేలా ఉంటుంది. కచ్చితంగా అతడు జాతీయ జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకుంటాడని భావిస్తుంటారు. 2008లో విరాట్ కోహ్లీ, 2018లో పృథ్వీ షా చాంపియన్లుగా నిలిచి స్టార్లుగా మారారు. ఈ మధ్యలో నాలుగు సార్లు టోర్నీ జరిగినా 2012లో మాత్రమే భారత జట్టుకు కప్ దక్కింది. ఆ సమయంలో జట్టును నడిపిన నాయకుడు ఉన్ముక్త్ చంద్. ఫైనల్లో శతకం కూడా అతడి ఖాతాలో ఉంది. అప్పట్లో అంతా ఉన్ముక్త్ బ్యాటింగ్ ప్రతిభను ఆకాశానికెత్తిన వారే. మరి ఇప్పుడతడి పరిస్థితి ఏమిటి? ఎక్కడున్నాడు?

# ఉన్ముక్త్‌కు ఆ అదృష్టం లేదా!

**అండర్-19 ప్రపంచకప్ అందించినా.. జట్టులో చోటు కరవు**

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



ఢిల్లీ అండర్-19 తరఫున పరుగుల వరద పారించడంతో ఉన్ముక్త్ నేరుగా ఆ రాష్ట్ర రంజీ జట్టులోనే చోటు దక్కించుకున్నాడు. 2010-11 సీజన్‌లో రైల్వేస్‌పై 151 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల్లోనే 400 పరుగులు సాధించడంతో ఏకంగా భారత అండర్-19 కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇదే జోరుతో అతడు కుర్రాళ్ల ప్రపంచకప్‌లోనూ అదరగొట్టి ఆసీస్ గడ్డపై భారత్‌కు ఈ మెగా టైటిల్ అందించిన సారథిగా రికార్డు సృష్టించాడు. అలాగే ఆసియాకప్, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ ఇలా టోర్నీ ఏదైనా తన బ్యాట్ పవర్ చూపించాడు.

**భారత్‌కు ఆడని ఏకైక కెప్టెన్:** అండర్-19 ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచిన భారత జట్ల కెప్టెన్లలో ఉన్ముక్త్ (26) మినహా అంతా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నవారే. 2012 టోర్నీ ఫైనల్లో ఆసీస్‌పై అతడు 130 బంతుల్లో 111 పరుగులు చేసి జట్టుకు టైటిల్ అందించాడు. కానీ ఎందుకో గానీ తను ఒక్కసారి కూడా భారత జెర్సీ ధరించలేక పోయాడు. 2011లోనే ఐపీఎల్‌లో ఢిల్లీ తరఫున అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత రాజస్థాన్‌కు ఆడినా ఈ లీగ్‌లో విఫలమయ్యాడు. 2015-16లో చివరిసారిగా అతడు ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. అప్పుడు కూడా పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. రెగ్యులర్‌గా ఆటగాళ్ల వేలంలో ఉన్ముక్త్ పేరుంటున్నా ఏ ఫ్రాంచైజీ అతడిని పట్టించుకోవడం లేదు. 2016లో ఉన్ముక్త్ భారత్ 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. మరోవైపు ఉన్ముక్త్‌తో కలిసి 2012 అండర్-19 ప్రపంచకప్ ఆడిన వారిలో హనుమ విహారి, ఇష్ సోధి, డికాక్, బాబర్ ఆజమ్, లిట్టన్ దాస్, సౌమ్య సర్కార్, డిక్‌వెల్లా, ఆంబ్రిస్, టర్నర్, ట్రావిస్ హెడ్ కూడా ఉండడం విశేషం.

**ప్రస్తుతం ఎక్కడ?**

2010 నుంచి 2019 వరకు ఉన్ముక్త్ చంద్ ఢిల్లీ జట్టుకు ఆడాడు. అయితే ఆశించిన మేర రాణించకపోవడంతో జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకమైంది. దీంతో గతేడాది ఉత్తరాఖండ్ జట్టులో చేరాడు. ప్రస్తుతం ఆ జట్టుకు కెప్టెన్. అయితే ఈ జట్టు తరఫున కూడా అతడిది పేలవ ప్రదర్శనే. గతేడాది అక్టోబరులో సిక్కింపై చివరి హాఫ్ సెంచరీ సాధించాడు. ఆ తర్వాత ఏడు రంజీలాడినా విఫలమవుతూనే ఉన్నాడు. అయితే ఏదో రోజు భారత జట్టులో చోటు దక్కించుకోవాలనే ఆలోచనతో ఉన్న ఉన్ముక్త్ ఓవరాల్‌గా 67 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 31.57 సగటుతో 3,379 పరుగులు సాధించాడు. ఇందులో 8 సెంచరీలున్నాయి.



# భారత్ ప్రత్యర్థి బంగ్లా

**హసన్ శతకం ● సెమీస్‌లో కివీస్‌పై ఘన విజయం**

**అండర్-19 వరల్డ్‌కప్**


హసన్ జాయ్ (100)



**పోచెఫ్‌స్ట్రూమ్:** మహ్మదుల్లా హసన్ జాయ్ (127 బంతుల్లో 13 ఫోర్లతో 100) శతకంతో.. బంగ్లాదేశ్ తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్‌ను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో డిఫెండింగ్ చాంప్ భారత్‌తో సమరానికి సిద్ధమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. బెక్‌హామ్ వీలర్ (75 నాటౌట్) అర్ధ శతకం సాధించాడు. పేసర్ షొరిఫుల్ ఇస్లాం (3/45) మూడు వికెట్లు పడగొట్టగా.. షమీమ్ హుస్సేన్ (2/31), హసన్ మురాద్ (2/34) చెరో రెండు వికెట్లు దక్కించుకున్నారు. స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 44.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 212 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి బంగ్లా.. ఓపెనర్లు తంజీద్ హసన్ (3) పర్వేజ్ ఇమాన్ (14) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. వన్‌డౌన్‌లో వచ్చిన జాయ్ జట్టును ఆదుకొన్నాడు. తౌహిద్ (40)తో కలసి మూడో వికెట్‌కు 68 పరుగులు జోడించిన జాయ్. . షహదత్ (40 నాటౌట్)తో కలసి నాలుగో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యంతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. సెంచరీ సాధించిన జాయ్‌ను జెస్సీ తష్కోఫ్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేశాడు. అక్బర్ అలీ (5 నాటౌట్) ఫోర్‌తో.. మరో 35 బంతులు మిగిలుండగానే జట్టును విజయతీరాలకు చేర్చాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**న్యూజిలాండ్:** 50 ఓవర్లలో 211/8 (బెక్‌హామ్ వీలర్ 75 నాటౌట్; నికోలస్ లాడ్‌స్టోన్ 44; ఇస్లాం 3/45, షమీమ్ హుస్సేన్ 2/31, హసన్ మురాద్ 2/34).

**బంగ్లాదేశ్:** 44.1 ఓవర్లలో 215/4 (మహ్మదుల్లా హసన్ జాయ్ 100, తౌహిద్ హ్రిదోయ్ 40, షహదత్ హుస్సేన్ 40 నాటౌట్; డేవిడ్ హెన్‌కాక్ 1/31, ఆదిత్య అశోక్ 1/44).

# ఈసారి అంచనాలు పెరిగాయి



**ముంబై:** ప్రపంచ చాంపియన్ హోదాలో ఉండడంతో ఈసారి జరిగే ఒలింపిక్స్‌లో తనపై అంచనాలు పెరగడం సహజమేనని బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తెలిపింది. షూటర్ అభినవ్ బింద్రా తర్వాత మరో వ్యక్తిగత స్వర్ణం సాధించిన అథ్లెట్‌గా నిలవాలని ఈ హైదరాబాదీ భావిస్తోంది. అయితే రియో గేమ్స్ సమయంలో తనపై ఎవరి దృష్టీ లేదని, ఈసారి పరిస్థితులు అలా ఉండవని గుర్తు చేసింది.

**గతేడాది ఎత్తుపల్లాలపై:** గెలిచిన సందర్భాల్లో చాలామంది ప్రశంసలు కురిపించడంతో పాటు మద్దతుగా నిలుస్తారు. అయితే 2019లో ప్రపంచ చాంపియన్‌షిప్ తర్వాత పలు టోర్నీల్లో ఓడాను. ఒక్కసారిగా సింధుకేమైందనే విమర్శలు వచ్చాయి. అయితే ఇవేమీ నా ఆటతీరును ప్రభావం చేయవు.

**టోక్యో గేమ్స్‌పై:** చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. రియోకు ఈ ఒలింపిక్స్‌కు చాలా తేడా ఉంది. నాలుగేళ్ల క్రితం నేనెవరో ప్రజలకు తెలీదు. నేను పతకం సాధిస్తాననే ఆలోచన కూడా వారికి లేదు. కానీ ఇప్పుడు కచ్చితంగా నేను మెడల్ తెస్తాననే నమ్మకం పెట్టుకున్నారు. అందుకే ఇప్పుడు నాపై బాధ్యతతో పాటు ఒత్తిడి కూడా పెరిగింది.

# టోక్యో ఒలింపిక్స్‌లో మొబైల్ మసీదులు!

**టోక్యో:** ఒలింపిక్స్‌లో పాల్గొనే అథ్లెట్లు, అధికారులు, చూసేందుకు తరలివచ్చే ముస్లింల ప్రార్థనలకోసం మొబైల్ మసీదులను నిర్వాహకులు ఏర్పాటు చేయనున్నారు. టోక్యో ఒలింపిక్స్ జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు జరగనున్నాయి. క్రీడా గ్రామంలో ప్రార్థనా మందిరాలు నిర్మిస్తున్నారు. కానీ కొన్ని క్రీడా వేదికలు, హోటళ్లతోపాటు టోక్యోలోని కొన్ని ప్రదేశాలలో ప్రార్థనలకు అవసరమైన స్థలాలు అందుబాటులో లేవు. దాంతో నిర్వాహకుల వినూత్న ఆలోచననుంచి వెలుగుచూసినవే మొబైల్ మసీదులు. అన్ని సదుపాయాలతో కూడిన 48 చదరపు మీటర్ల వైశాల్యం కలిగిన ప్రార్థనా మందిరానికి వీలుగా ట్రక్కులను రూపొందిస్తున్నారు. ఇక.. ఒలింపిక్స్‌లో పాల్గొనే అన్ని మతాలవారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



# గాయంతో ఐపీఎల్‌కు ఆర్చర్ దూరం

**లండన్:** ఐపీఎల్ టీమ్ రాజస్థాన్ రాయల్స్‌కు గట్టి షాక్ తగిలింది. గాయం కారణంగా ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. అతడి కుడి మోచేతి వద్ద గాయమైనట్టు స్కానింగ్‌లో బయపడిందని ఇంగ్లండ్ బోర్డు ప్రకటించింది. శ్రీలంక టూర్‌కు కూడా ఆర్చర్ దూరం కానున్నాడు.

# సెమీస్‌కు బెంగళూరు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** బెంగళూరు రాప్టర్స్ జట్టు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) సెమీస్‌కు చేరుకొంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 5-0తో అవధ్ వారియర్స్‌ను ఓడించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. పురుషుల, మహిళల సింగిల్స్‌లో లేవర్డెజ్, తైజు నెగ్గి బెంగళూరును ఆధిక్యంలో నిలిపారు. రాప్టర్స్ ట్రంప్‌గా ఎంచుకున్న మరో పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్.. విన్సెంట్‌పై గెలిచి 4-0తో బెంగళూరు విజయాన్ని ఖరారు చేశాడు. ఆఖరున జరిగిన మిక్స్‌డ్‌లోనూ బెంగళూరు గెలిచింది. శుక్రవారం జరిగే తొలి సెమీస్‌లో చెన్నైతో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్, శనివారం జరిగే రెండో సెమీస్ మ్యాచ్‌లో పుణెతో బెంగళూరు తలపడనున్నాయి.

# బ్యాటింగ్‌లో రాణిస్తేనే..

- నేడు ఇంగ్లండ్‌తో భారత మహిళల పోరు
- ముక్కోణపు టీ-20 సిరీస్

**మెల్‌బోర్న్:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు కీలక పోరుకు సిద్ధమవుతోంది. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో మరోసారి ఇంగ్లండ్‌తో తలపడనుంది. గత నెల 31న సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఇంగ్లండ్‌పై ఆధిపత్యం ప్రదర్శించి బోణీ చేసింది. కానీ ఆసీస్‌పై మాత్రం బ్యాట్స్‌వుమెన్ వైఫల్యంతో చిత్తుగా ఓడాల్సి వచ్చింది. స్మృతి మంధాన (35), హర్మన్‌ప్రీత్ (28) మినహా అంతా విఫలమయ్యారు. 21 పరుగుల తేడాతోనే చివరి ఆరు వికెట్లను కోల్పోవడంతో అతికష్టమ్మీద 100 పరుగులు దాటగలిగింది. అయితే బౌలర్లు మెరుగ్గానే రాణించినా స్వల్ప స్కోరు కావడంతో ఆసీస్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురుకాలేదు. నేడు మరోసారి ఇంగ్లండ్‌తో తలపడనుండడంతో భారత బ్యాటింగ్ఆర్డర్ సమష్టిగా విజృంభించాల్సి ఉంటుంది. అలాగైతేనే ఫైనల్‌పై ఆశలు పెంచుకోవచ్చు. షెఫాలీ, జెమీమా, వేద కృష్ణమూర్తి బ్యాట్లు ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయమే. ఈ సిరీస్‌లో 3 జట్లూ ఒక్కో విజయం, ఒక్కో ఓటమితో రెండేసి పాయింట్లతో సమానంగా ఉన్నాయి. భారత్‌కు మరో మ్యాచ్ ఉండడంతో దీనిట్లో విజయం సాధిస్తే ఒత్తిడి తగ్గుతుంది.

# లోపెజ్, షకీరా ఫ్రీ షో !



**మియామి:** పాప్ టాప్ స్టార్లు జెన్నిఫర్ లోపెజ్ (50), షకీరా (43) ఒక్క ప్రదర్శనకు రూ.కోట్లలో చార్జ్ చేస్తుంటారు. అలాంటిది గత ఆదివారం ఇక్కడ జరిగిన సూపర్ బౌల్ ఫుట్‌బాల్ మ్యాచ్ మధ్యలో నిర్వహించిన షోకు వారు ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు! కారణం..ఈ మ్యాచ్‌కుండే వీక్షకుల సంఖ్యే. అమెరికా వ్యాప్తంగా ఈ మ్యాచ్‌ను కోట్లాదిమంది వీక్షిస్తారు. దాంతో కేవలం 15 నిమిషాలకంటే తక్కువగా ఉండే ఈ షోలో ప్రదర్శన ఇచ్చేందుకు ప్రపంచ వ్యాప్తంగా పాప్‌స్టార్లు క్యూ కడుతుంటారు. ఈ ప్రదర్శనలో పాడే పాటలకు ఉండే క్రేజ్ అంతా ఇంతాకాదు. షోలో లోపెజ్, షకీరా పాడిన పాటల ఆల్బమ్‌ల అమ్మకాలు ఏకంగా 1013 శాతం పెరిగాయి. ఇకపోతే షకీరా హిట్ సాంగ్ 'అంపైర్' అమ్మకాలు అత్యధికంగా 2,135 శాతం పెరిగాయి. షోలో లోపెజ్ 11 ఏళ్ల కూతురు ఎమే కూడా పాల్గొంది.

# విజయవాడలో కరోనా కలకలం?

**అదేమీ లేదంటున్న వైద్యాధికారులు**

విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చైనాతోపాటు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ ప్రకంపనలు విజయవాడనూ తాకాయి. కరోనా లక్షణాలతో బాధపడుతున్న ఒక వ్యక్తి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వచ్చినట్టు గురువారం మీడియాలో ప్రచారం కావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. కాగా.. జిల్లాలో ఇంతవరకు ఒక్కరిలో కూడా ఆ లక్షణాలు కనిపించలేదని వైద్యాధికారులు స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన ఒక మహిళ ఇటీవల చైనా నుంచి వచ్చినట్టు గుర్తించిన వైద్యాధికారులు ఆమెను పిలిపించి పరీక్షలు నిర్వహించారు. కరోనా లక్షణాలు లేవని ధ్రువీకరించుకున్నాక ఇంటికి పంపేశారు. గత నెల 12న చైనా నుంచి విజయవాడకు వచ్చిన వ్యక్తి కరోనా వైరస్ నేపథ్యంలో ఇక తిరిగి చైనాకు వెళ్లలేదు. ఆ వ్యక్తి తనకు కూడా వైరస్ సోకిందేమోనన్న అనుమానంతో ఈనెల 4న ప్రభుత్వాస్పత్రికి వచ్చినట్టు సీఎస్ ఆర్ఎంవో గీతాంజలి మీడియాకు తెలిపారు. తాజాగా గురువారం కరోనా వైరస్ లక్షణాలతో మరో వ్యక్తి ప్రభుత్వాస్పత్రిలో చేరినట్టు వచ్చిన వార్తలను ఆమె కొట్టిపారేశారు. విదేశాల నుంచి వచ్చేవారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు గన్నవరం విమానాశ్రయంలో ప్రత్యేక శిబిరాన్ని కొనసాగిస్తున్నామని.. విజయవాడ, మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశామని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.శ్రీరామమూర్తి తెలిపారు.

# హైదరాబాద్‌లో కరోనా?

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రిలో చేరిన ఇద్దరి నమూనాలను సేకరించారు. పరీక్షలు చేయగా పాజిటివ్ అని తేలినట్లు సమాచారం. దాంతో, ఆందోళన చెందిన వైద్యులు నిర్ధారణ చేసుకోవడానికి మరోసారి అనుమానితుల నమూనాలను పుణెలోని ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతానికి వారిని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా కరోనా వైరస్ అనుమానిత కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒక్క గురువారమే గాంధీ, ఫీవర్ ఆస్పత్రుల్లో 16 మంది చేరారు. గాంధీలో తొమ్మిది మంది, ఫీవర్ ఆస్పత్రిలో ఏడుగురు చికిత్స తీసుకుంటున్నారు. వీరిలో నలుగురు మహిళలున్నారు. ఫీవర్ ఆస్పత్రిలో చేరిన ఏడుగురూ చైనీయులే. వీరంతా బంజారాహిల్స్‌లో ఓ కంపెనీని నిర్వహిస్తున్నారు. జనవరిలో చైనా వెళ్లి వారం రోజుల కిందటే తిరిగి వచ్చారు. ఫీవర్ ఆస్పత్రి వైద్యులు రక్త నమూనాలను తీసుకుని పరీక్షల నిమిత్తం వారిని గాంధీ ఆస్పత్రికి పంపారు. బుధవారం కూడా బీజింగ్‌కు చెందిన ఇద్దరు అనుమానితులు ఫీవర్ ఆస్పత్రికి వచ్చారు. ఇప్పటి వరకు 9 మంది వైరస్ అనుమానంతో ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నారని గాంధీ నోడల్ అధికారి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి చెప్పారు. ఫీవర్ ఆస్పత్రి నుంచి ఇద్దరు చైనీయులు గురువారం ఉదయం వచ్చారని, వారికి కూడా ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వారి రక్త నమూనా నివేదిక అందిన తర్వాత నిర్ధారణ చేస్తామని చెప్పారు. మరోవైపు, అటు ఫీవర్, ఇటు గాంధీ ఆస్పత్రుల్లో కరోనా అనుమానిత లక్షణాలతో చైనీయులు ఎక్కువగా చేరుతుండడంతో ఆందోళన నెలకొంది.

**నిర్ధారణ కాకుండానే గాయబ్**

కరోనా వైరస్ అనుమానితులు ఆస్పత్రుల్లో చేరినట్లే చేరి వెళ్లిపోతున్నారు. సిబ్బంది వారి రక్త నమూనాలను సేకరించిన తర్వాత చెప్పా పెట్టకుండానే వెళ్లిపోతున్నారు. దాంతో, నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నవారు.. నివేదిక వచ్చే వరకూ ఉండడం లేదని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# కరోనాకు 24 వేల మంది బలి?

- చైనాలో అతిపెద్ద ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ వెల్లడి
- మర్నాడే అధికారిక గణాంకాలతో సర్దుబాటు
- చైనా సర్కారు వాస్తవాలు దాస్తోందని ప్రజల ఆందోళన
- అధికారికంగా కరోనా మృతుల సంఖ్య 564కు చేరిక
- వైరస్ బారిన 28,018 మంది



బీజింగ్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ కారణంగా చనిపోయినవారి సంఖ్య 564 అని చైనా అధికారికంగా వెల్లడిస్తోంది. కానీ.. ఈ వైరస్ కారణంగా 24 వేల మందికిపైగా చనిపోయారంటూ చైనాకు చెందిన అతిపెద్ద ఆన్‌లైన్ న్యూస్ వెబ్‌సైట్ 'టెన్‌సెంట్'లో ప్రచురించడం సంచలనం సృష్టిస్తోంది. కరోనా వైరస్‌పై ఆ వెబ్‌సైట్ చాలా రోజులుగా 'ఎపిడమిక్ సిచ్యువేషన్ ట్రాకర్' పేరుతో ఒక ట్రాకర్‌ను తన సైట్‌లో పెట్టింది. కరోనా మృతులు, అనుమానితులు, ఆ వైరస్ బారిన పడినవారి సంఖ్యను అందులో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తోంది. ఈ క్రమంలోనే.. కరోనా వైరస్ సోకినవారి సంఖ్య 1,54,023గా, మృతుల సంఖ్య 24,589గా ఆ ట్రాకర్ చూపించింది. అంటే.. అధికారిక గణాంకాలకన్నా మృతుల సంఖ్య 80 రెట్లు ఎక్కువ. ఈ సంఖ్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం కావడంతో.. ఆ వెబ్‌సైట్ వెంటనే తన ట్రాకర్‌లో నంబర్లను అధికారిక గణాంకాలకు అనుగుణంగా సర్దుబాటు చేసింది. అంటే.. వైరస్ బారిన పడినవారి సంఖ్యను 14,446కు (ఫిబ్రవరి 1 నాటికి), మృతుల సంఖ్యను 304కు మార్చింది. చైనాలో పరిస్థితి విషమించిందని.. కానీ, ఆ విషయం బయటపడకుండా సర్కారు దాస్తోందని, టెన్‌సెంట్ ఫిబ్రవరి 1న తన ట్రాకర్‌లో పెట్టిన గణాంకాలే ఇందుకు నిదర్శనమని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఫిబ్రవరి 1 ముందు వరకూ టెన్‌సెంట్ వెబ్‌సైట్ వాస్తవ గణాంకాలనే ఇచ్చిందని, ఆ తర్వాత ప్రభుత్వం చేసిన హెచ్చరికలతో తప్పుడు గణాంకాలు ఇస్తోందని వారు ఆరోపిస్తున్నారు. వైరస్ శరవేగంగా వ్యాపిస్తున్న తీరు చూస్తుంటే.. ఒక్క వూహాన్‌లోనే 3.5 లక్షల మందికి ఇప్పటిదాకా సోకి ఉండొచ్చని కొందరు వైద్యనిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చైనా సర్కారు మృతుల సంఖ్యపై వెబ్‌సైట్లలో వస్తున్నవన్నీ తప్పుడు గణాంకాలేనని కొట్టిపారేసింది. కాగా, అధికారిక గణాంకాల ప్రకారం.. కరోనా వైరస్ మృతుల సంఖ్య 565కు చేరింది. ఈ వైరస్ బారిన పడినవారి సంఖ్య 28,018 అని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ తెలిపింది. ఒక్క బుధవారంనాడే వైరస్ బాధితుల్లో 73 మంది మృతిచెందారు. చైనాకు ఆవల 27 దేశాల్లో దాదాపు 260 మంది కరోనా బారిన పడ్డారు. చైనా నుంచి తరలించిన 645 మంది భారతీయులకూ వైద్యపరీక్షలు చేయించగా.. కరోనా నెగెటివ్ వచ్చినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది.

**చైనాకెళ్తే పాస్‌పోర్టు చింపేస్తాం!**

ప్రపంచవ్యాప్తంగా 16 దేశాలు చైనాకు రాకపోకలను నిషేధించాయి. ఈ జాబితాలో తాజాగా సౌదీ అరేబియా చేరింది. ఆ నిషేధాజ్ఞను మీరి ఎవరైనా చైనాకు వెళ్లే ప్రయత్నం చేస్తే వారి పాస్‌పోర్టును చింపేస్తామని పౌరులను హెచ్చరించింది.

**ఏ దేశాల్లో ఎన్ని కేసులు**

బెల్జియం (1), ఫిన్‌లాండ్ (1), స్పెయిన్ (1), స్వీడన్ (1), శ్రీలంక (1), కంబోడియా (1), నేపాల్ (1), రష్యా (2), యూకే (2), ఇటలీ (2), ఇండియా (3), ఫిలిప్పీన్స్ (3), యూఏఈ (5), కెనడా (5), ఫ్రాన్స్ (6), వియత్నాం (10), మకావు (10), హాంకాంగ్ (11), అమెరికా (12), జర్మనీ (12), ఆస్ట్రేలియా (14), మలేసియా (14), హాంకాంగ్ (21), దక్షిణకొరియా (23), థాయ్‌లాండ్ (25), సింగపూర్ (28), జపాన్ (45).

**కరోనా వైరస్‌కు పేరు సిద్ధం**

కరోనా వైరస్.. అని యథాలాపంగా అనేస్తున్నాంగానీ, ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కొత్త వైరస్ కరోనా కుటుంబానికి చెందినది. కరోనా కుటుంబంలో చాలా రకాల వైరస్‌లున్నాయి. సార్స్, మెర్స్ వంటివి ఇందుకు ఉదాహరణలు. కొత్త వైరస్‌ను తాత్కాలికంగా 2019-ఎన్‌సీవోవీ (నావెల్ కరోనా వైరస్)గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని ప్రాంతాల్లో దీన్ని స్నేక్ ఫ్లూ అని.. బ్యాట్ ఫ్లూ అని రకరకాలుగా పిలుస్తున్నారు. వాటన్నిటికీ చెక్ పెట్టేలా 'ఇంటర్నేషనల్ కమ్యూనిటీ ఆన్ టాక్సానమీ ఆఫ్ వైరసెస్ (ఐసీటీవీ)' శాస్త్రజ్ఞులు ఈ వైరస్‌కు ఒక పేరు పెట్టారు. కానీ, అధికారికంగా బయటకు వెల్లడించలేదు. కాగా.. కరోనా వైరస్‌కు తాము పెట్టిన పేరులో ప్రాంతాల, మానవుల, జంతువుల పేర్లేవీ లేవని ఐసీటీవీ వర్గాలు తెలిపాయి. ఎందుకంటే.. గతంలో పెట్టిన మెర్స్ (మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) అనే పేరు మధ్యప్రాచ్యానికి ఇబ్బంది కలిగించే పేరు. స్పానిష్ ఫ్లూ, జపనీస్ ఎన్‌కెఫలైటిస్, స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూలాంటివి కూడా అలాంటి పేర్లే.

**పింగ్ పింగ్.. యాన్ యాన్**

**ఆస్పత్రుల్లో సేవా రోబోలు**



కరోనా బాధితులకు చికిత్స చేయాలంటే వైద్య సిబ్బందికీ ప్రమాదమే. ఈ నేపథ్యంలో.. వైద్యసిబ్బంది వారిని కలవాల్సిన అవసరం తక్కువగా ఉండేలా.. గువాంగ్‌డాంగ్‌లోని ప్రజావైద్యశాల కృత్రిమమేధతో పనిచేసే రెండు రోబోలను ఏర్పాటుచేసింది. వాటి పేర్లు.. పింగ్ పింగ్, యాన్ యాన్. ఈ రోబోల లోపలిభాగాల్లోకి కరోనా వైరస్ వ్యాపించినా వాటిని స్వయంగా శుభ్రంచేసుకునే ఏర్పాట్లున్నాయి. ఈ రోబోలు ఒక్కొక్కటీ ముగ్గురు సిబ్బంది చేసే పనిచేస్తాయి.

**13 రోజుల్లో.. 1500 పడకలతో**



కరోనా బాధితులకు చికిత్స కోసం వూహాన్‌లో 10 రోజుల్లో 1000 పడకల ఆస్పత్రిని నిర్మించి, అందుబాటులోకి తెచ్చిన చైనా తాజాగా మరో ఆస్పత్రిని నిర్మించింది. జనవరి 25న చేపట్టిన ఈ 1500 పడకల ఆస్పత్రి నిర్మాణం గురువారానికి పూర్తయింది. వూహాన్‌లో ఇప్పటిదాకా 132 క్వారంటైన్లను ఏర్పాటు చేసింది. కొత్తగా కట్టిన రెండు ఆస్పత్రులు, ఆ క్వారంటైన్లతో కలిపి 12,500 పడకలు అందుబాటులోకి వచ్చాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.